
మనం మరచిన మహా వ్యవస్థలు

శెట్టి సమయాలు

(చారిత్రక, సామాజిక పరిశోధన)



ధూపం అభిమన్యుడు




థాయ్‌లాండ్‌లో హరివంశాన్ని స్థాపించిన రాణి ఛామదేవి విగ్రహం

మనం మరచిన మహా వ్యవస్థలు

శెట్టి సమయాలు

(చారిత్రక, సామాజిక పరిశోధన)



ధూపం అభిమన్యుడు

శెట్టి సమయాలు

రచన : ధూపం అభిమన్యుడు

ప్రచురణ : జనవరి , 2017

ప్రతులు : 1000

వెల : రూ. 100/-

ముద్రణ : ముద్రిక,
జి22, కృష్ణకాంత్ ప్లాజా,
శిల్పా బిర్లా కాంపౌండ్
గుత్తిరోడ్డు, కర్నూలు - 518 002.
సెల్ : 94405 69106
email: mudrikaprinters1@gmail.com

ప్రతులకు : ధూపం అభిమన్యుడు
వెలుగోడు ,
కర్నూలు జిల్లా - 518 533 అం.ప్ర
సెల్ : 94904 83744,
96033 16211
email: abhikalasri@gmail.com

అంకితం



ధూపం రామసుబ్బయ్య ధూపం నారాయణమ్మ

నాకు జన్మనిచ్చి...నన్ను పెంచి...నాకు ప్రపంచాన్ని చూపించి,

శెట్టిసమయాల పరిశోధనకు బీజాలు వేసిన

నా తల్లిదండ్రుల పాదపద్మాలకు భక్తి తో.....

కృతజ్ఞతలు

మనం మరచిన మహా వ్యవస్థలు పుస్తక రచనకు ఎందరో పెద్దలు సహకరించారు, ప్రోత్సహించారు, సలహాలిచ్చారు. అలాంటి వ్యక్తులకు కృతజ్ఞతలు చెప్పుకోవడం సమంజసం, సందర్భోచితం.

వారిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వారు హైదరాబాదులో వుంటున్న మిత్రులు శ్రీ పోలిశెట్టి సత్తిరాయుడు గారు నాకంటే వయసులో చిన్నవాడైనా అంతులేని సమాచారాన్ని నాకు అందించాడు. ఈ పరిశోధనలో ఆయనకు కూడా భాగం వుంది. అదే విధంగా ఒంగోలు లో నివాసం వుంటున్న ''శ్రీకృష్ణదేవరాయలు'' చంద్రవంశ బలిజ క్షత్రియుడు పుస్తక రచయిత, చరిత్ర పరిశోధకులు శ్రీ భట్టరు శెట్టి పద్మారావు రాయలు గారు పెద్దలుగా నాకు విలువైన సలహాలను, సమాచారాన్ని అందించారు.

తెలుగుభాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు, అమ్మనుడి పత్రిక సంపాదకులు శ్రీ సామల రమేష్ బాబు గారు నా పుస్తకాన్ని ఆసాంతం చదివి ఎన్నో సలహాలను అందించారు. పుస్తకం లోని అంశాలు ఒక క్రమపద్ధతిలో పెట్టడానికి, ముఖచిత్రం డిజైన్ లో ఆయన నాకు అమూల్యమైన సలహాలు అందజేసి ఆశీర్వదించారు.

ఇక మా బాబాయి, కర్నూలు జిల్లా బలిజ సంఘం అధ్యక్షులు శ్రీ యర్రంశెట్టి నారాయణ రెడ్డి గారు తమ అమూల్యమైనసలహాలు అందించి ప్రోత్సహించారు. చరిత్ర పరిశోధకులు, రచయిత శ్రీ చొక్కపు నారాయణ స్వామి గారు అడగగానే తన అభిప్రాయాన్ని రాసి ఇచ్చారు.

కర్నూలు జిల్లా వేల్పనూరు గ్రామానికి చెందిన శ్రీ కాసర్ల పెద్ద చెన్నయ్య గారు శెట్టి పత్తి కొండయ్య, చలువాది కుటుంబ సభ్యులకు పరిచయం చేసి సంబంధిత సమాచారాన్ని అందజేయడానికి కృషి చేశారు.


వీరితో పాటు మరోక వ్యక్తి కర్నూలు నగరం లోని ముద్రిక ప్రింటర్స్ అధినేత శ్రీ భాస్కర్ గారు నాపట్ల సోదర వాత్సల్యంతో పుస్తకాన్ని అత్యంత అందంగా, అతి తక్కువ ఖర్చుతో అచ్చు వేసి అందించారు. వీరందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

అదే విధంగా నా పరిశోధనలో అడుగడుగునా సలహాలు ఇచ్చి, సహకరించిన వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

–ధూపం అభిమన్యుడు

సూచిక

మరుగునపడిన వాస్తవాలను వెలికి తెచ్చిన మహాప్రయత్నం



బ్రిటీషు పాలననుండి బయట పడ్డాక, సర్వసత్తాక స్వతంత్ర రాజ్యంగా రూపొందడం కోసం రాజ్యాంగనిర్మాణం చేసుకున్న సందర్భం లో మన నేతలు వలస పాలకుల వారసత్వాన్ని కొనసాగించడానికే ప్రాధాన్యత నిచ్చారు. పాలకులు మారినా, ప్రభుత్వ వ్యవస్థ కొనసాగుతుం దన్నమాట నిజమే. కాని, వలసపాలకుల నుండి విముక్తమ్మైన తరువాత ప్రభుత్వ వ్యవస్థలో దేశీయ అవసరాలకు, వారసత్వ విలువలకు తగ్గ సమూల మార్పులను తేకుండా, మనలను అణచివేసిన, దోచుకున్న, చిన్నాభిన్నం చేసిన పూర్వ వ్యవస్థలను యథాతథంగా కొనసాగించడం తప్పు. కాని, జరిగింది అదే. ఇందువల్ల స్వాతంత్ర్యా నంతర భారతదేశం తన వారసత్వాన్ని విస్మరించి, బానిసత్వ భారాన్ని వివిధ రూపాల్లో ఇంకా మోస్తూనే వుంది. మనకు మనం చేసుకున్న చేటు అంతా ఇంతా కాదు.

మన దేశ చరిత్ర ముస్లింల రాకతోనో, బ్రిటీష్‌వాళ్ల పాలనతోనో మొదలు కాలేదు. వాళ్ల పాలన అంతా కలసి కొన్ని వందల ఏళ్లు మాత్రమే. అంతకు ముందు మన దేశానికి కొన్ని వేల ఏండ్ల స్వంత చరిత్ర వుంది. మనవైన పాలనా వ్యవస్థలు వున్నాయి. ఉత్పత్తి, రక్షణ, తదితర అక్కరలకు చెందిన ఆ వ్యవస్థలు కులాలుగా గుర్తించబడ్డాయి. వాటి ప్రాతినిధ్యంతో, ఆమోదంతో ఏర్పడ్డ 'శెట్టి సమయాలు'' సామాజిక మనుగడను, నియమాలను, పాలనను శాసించాయి. కొండొకచో అవి శక్తివంతమ్మైన రాజులను, రాజ్యాన్ని శాసించాయి. సీమాంతర సముద్రయానాలు చేసి వ్యాపారాన్ని విస్తరించాయి. సామ్రాజ్యాలనూ స్థాపించాయి. దోపిడీని నిరోధించడమే తప్ప స్వదేశంలో గానీ పరదేశాల్లో గానీ అవి దోపిడీకి పాల్పడలేదు. ఇంతటి ఉదాత్త వ్యవస్థలో భాగంగా వుంటూ తమ పనిని తాము చేసుకుపోతూ సామాజిక అక్కరలను తీరుస్తూ సంపద ఉత్పత్తికి కారణమ్మైన కులాలు ఒక ఆదర్శ సమాజంలో భాగమ్మైనాయి.

ఒక నాటి ఉత్పత్తి కుల వ్యవస్థ చాతుర్వర్ణ సిద్ధాంతంలో భాగం కాదు. చాతుర్వర్ణ సిద్ధాంత ప్రవేశం, దాని అధిపత్య భావజాలం సమాజంలో అనైక్యతను

తీసుకువచ్చింది. నాటి ఉత్పత్తి కుల వ్యవస్థను మోసగించడం, దోచుకోవడం, రెచ్చగొట్టి స్వార్థాలకు వినియోగించు కోవడం వల్ల కుల వ్యవస్థ అతలాకుతలమైంది. ఆ ఆధిపత్య భావజాలానికి విదేశీయుల పాలనలో అండ లభించింది. ఆధిపత్య భావజాల ప్రతినిధులకు, వలస పాలకులకు మధ్య ఏర్పడిన అవగాహన-అవ్యవస్థకు దారులు తెరచింది. సమాంతర దోపిడీ వ్యవస్థలకు తలుపులు తెరిచింది.

నాటి కుల వ్యవస్థలో ఉత్పత్తి కులాల పని విభజనతో పరస్పర సహకారజీవనం, వారి సమైక్య శక్తితో ప్రభుత్వాల నిర్వహణ, రాజ్యరక్షణ వంటి కీలక అంశాలలో పాలుపంచుకున్న పూర్వాచార కులాల సుసంఘటిత వ్యవస్థలే ‘‘శెట్టి సమయాలు‘‘ వీటి పాత్రను ఇంతవరకు భారత చరిత్రకారులు సరిగా గుర్తించ లేదు. అట్టడుగు వర్గాలకు రిజర్వేషన్ల పేర ప్రోత్సాహకాలనివ్వడం తోనే సరి పెట్టుకున్న రాజ్యాంగ నిర్మాతలు, నాటి ఉత్పత్తి కులాల గౌరవాన్ని ఇనుమడింప జేయడానికి, వాటి నైపుణ్యాలను జాతి శ్రేయస్సుకు వినియో గించడానికి ఏం చెయ్యాలో కనీసం ఆలోచించనైనా లేదు. స్వాతంత్ర్యానంతర భారతీయ సమాజ పురోగమనంలో సంస్కర్తలు గాని, నేతలు గాని, రాజ్యాంగ నిర్మాతలు గాని, కుల వ్యవస్థ పోవాలని నినదించే అభ్యుదయ వాదులు గాని వాటి నుంచి గుణాత్మకంగా స్వీకరించదగిన వారసత్వ విజ్ఞానాన్ని కాపాడే ప్రయత్నం ఏమీ చేయకపోవడాన్ని మనం గమనించాలి.

ఇప్పుడు ఉత్పత్తి కులాలు చిన్నాభిన్నమైనాయి. అంటే కులాలు కొనసాగుతున్నాయి గానీ వారి వృత్తులు గాలికెగిరి పోతున్నాయి. పారిశ్రామి కీకరణ ఫలితంగా ఎన్ని మార్పులు వచ్చినా వాటిలోనూ ఉత్పత్తి కులాల, సేవా వృత్తుల కులాల సేవలను ప్రతిభావంతంగా ఇముడ్చుకునేందుకు రాజ్యాంగ రీత్యా కానీ, పాలనలో గానీ ఎటువంటి ఆలోచనలైనా జరిగాయా అనేది ప్రశ్నగానే మిగిలిపోయింది.

‘‘శెట్టి సమయాలు‘‘ అంటే నాటి సామాజిక నాయకత్వ నిర్మాణం. ‘‘శెట్టి సమయా‘‘ లంటే నాటి వికేంద్రీకృత వ్యవస్థ సక్రమవర్తనకు ఒక హామీ. ‘‘శెట్టిసమయా‘‘లంటే నాటి గ్రామ వ్యవస్థకు, నాటి ఉత్పత్తి కులాల మనుగడకు,మర్యాదకు ఒక సామాజిక ఏర్పాటు. రాజ్యాన్ని రక్షించకోవడానికి, అవసరమేర్పడినప్పుడు రాజును నియంత్రించడానికి కూడా శక్తి కలిగిన ఒక

సమాంతర వ్యవస్థ ''శెట్టి సమయాలు''. ఈ ప్రాతిపదికను అధ్యయనం చేయకుండా, దానికి ఆధునిక అవసరాలను మలచుకునేందుకు పూను కోకుండా, మన నవభారత రాజ్యాంగ నిర్మాతలు విస్మరించడం జాతికి ఎంతో నష్టాన్ని కలిగించింది. తరతరాల వారసత్వ విజ్ఞానాన్ని చేజార్చుకోవడానికి, వ్యవస్థల్ని కోల్పోవడానికి మాత్రమే పనికొచ్చింది. ''*మనం మరచిన మహోవ్యవస్థలు శెట్టి సమయాలు*'' అనే ఈ గ్రంథం ఈ అంశాలను అన్నింటినీ వెలుగులోకి తెచ్చింది, చర్చకు పెట్టింది.

''శెట్టి సమయ'' వ్యవస్థలు స్థానికంగా, జాతీయంగా పరిపాలనలోనూ న్యాయవ్యవస్థలనూ ఎంతగా రాణించాయో, వ్యాపారంలోనూ రాజ్య నిర్మాణం లోనూ ఎంతగా ఎదిగాయో, నౌకా నిర్మాణం లో, నౌకా వాణిజ్యంలో దక్షిణ భారతదేశం నుండి సుదూర దేశాలకు ఎలా విస్తరించాయో, జనజీవనంలో ఎంతగా పెనవేసుకుపోయాయో రచయిత వివరించిన తీరు, ఆయన ఇచ్చిన సమాచారం అచ్చెరువు గొలుపుతుంది. భారతదేశానికి సముద్రమార్గాన్ని కను గొన్నవాడు వాస్కోడిగామా కాదని నిరూపించడానికి ఇచ్చిన సమాచారం చాలా మందికి తెలియదు. తూర్పుదేశాలపై ''శెట్టి సమయాల'' ప్రభావం మధ్య యుగాలలో ''శెట్టి సమయాల'' వైభవం వంటి అంశాలను సోదాహరణంగా ఇచ్చారు. ''శెట్టి సమయా'' లలో వీరబలింజల విశిష్ట పాత్రగురించిన వివరాలు ఇచ్చారు. బ్రిటీషు పాలకులు ఏ విధంగా ''శెట్టిసమయా''లను విచ్ఛిన్నం చేసిందీ తెలిపారు.

''శెట్టి సమయాలు'' అనే మాటే నేటి రాజకీయ పాలనా వ్యవస్థల అధ్యాపకులకు గానీ, విద్యార్థులకు గానీ తెలియదు. మొత్తం భారతదేశపు వేలాది సంవత్సరాల పాలనావ్యవస్థలు-విదేశీ ఆక్రమణదారుల పాలనకు లోబడక ముందు ఏవిధంగా నడిచాయన్నదానిని తెలుసుకోవాలంటే-స్థానిక సాంఘిక చరిత్రల్ని అధ్యయనం చేయాలి. స్వాభిమానంతో కూడిన రాజకీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి. ఈ పుస్తకం ఆ దిశగా సర్వసమగ్ర గ్రంథం కాదు. కానీ... ఆలోచనను రేకెత్తించి, ఆ దిశగా మరింత లోతుల్లోకి వెళ్లి అధ్యయనం చేయాలని మనలను పురికొలిపే పుస్తకం ఇది. ఈ పుస్తకంలోని అంశాల వివరణలో అనేక లోటుపాట్లు వుండవచ్చు. రచయిత తానే తెలిపినట్లు తానేమీ చేయితిరిగిన రచయితగానీ, ప్రసిద్ధిగాంచిన చరిత్రకారుడు గానీ కాదు. కాని,

ఒక పౌరుడుగా, ఇంకా చెప్పాలంటే 'శెట్టి సమయాల' నేపథ్యం నుంచి వచ్చిన కుటుంబాలకు చెందిన వాడుగా తన అధ్యయనాన్ని, ఆలోచనలను, ఆవేదనను కాగితంపై పెట్టి ఆలోచనాపరుల ముందు ంచారు. ఆలోచనాపరులు ఈ పుస్తకాన్ని చదివి, రచయిత మనముం దుంచిన సమాచారాన్ని విశ్లేషించి మరింతలోతుగా పరిశీలనకు పూనుకోగలిగితే చాలు.

మరుగున పడిన చరిత్రను త్రవ్వితీసి, ప్రజల ముందు పెట్టడానికి చేసిన మహాప్రయత్నం ఈ రచన. రచయిత *శ్రీ ధూపం అభిమన్యుడు* గారికి హృదయపూర్వక అభినందనలు తెలుపడానికి సంతోషిస్తున్నాను.


భారతీయుల - అందునా మూలజాతికి చెందిన తెలుగువారి చరిత్ర లోతుల్లోకి, వారి సామాజిక వ్యవస్థల లోతుల్లోకి వెళ్ళి అధ్యయనం చేయడంలో ఇంకా మనం ఎంతో ముందుకు సాగాలి. ఈ ప్రయాణం లో ఎవరు నిరుత్సాహపరచినా ఆగకుండా ముందుకే సాగవలసిందిగా అభిమన్యుడు గారిని కోరుతున్నాను.

డా॥సామల రమేష్‌బాబు

సామల రమేష్‌బాబు

తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు
''అమ్మనుడి'' పత్రిక సంపాదకుడు
సెల్ : 9848016136

కులం లేకుండా చరిత్ర లేదు



"మనం మరచిన మహావ్యవస్థలు - శెట్టి సమయాలు"అనే ఈ పుస్తకం ప్రాచీన భారతదేశ చరిత్రకు అద్దం పడుతోంది. కులం లేకుండా చరిత్ర లేదని ఘంటాపథంగా చెబుతూ ఈ దేశంలో కట్టు బాట్లను బ్రిటీషు వారు ఏ విధంగా బ్రష్టు పట్టించారో వివరణాత్మకంగా రాశారు. కులవ్యవస్థే ఆధునిక వ్యవస్థ అని, ఇక్కడ వృత్తులు కుటీర పరిశ్రమలని, బీజక్షేత్ర సిద్ధాంతాన్ని ఉటంకిస్తూ కుల వ్యవస్థ నిర్మాణం ఒక శాస్త్రీయ విధానం అని నిరూపించిన తీరు నిజంగా అభినందనీయం.

శెట్టి సమయాలనే వ్యవస్థలు ఈ దేశం లో అత్యంత కీలక పాత్ర పోషించాయన్న విషయాన్ని ఎన్నో శాసనాలు చెబుతున్నా చరిత్రకారులుఎందుకో వాటిని విస్మరించి చరిత్రను నిర్మించారు. చరిత్రకారులకు ఎన్నో వీరబలింజ శాసనాలు తారసపడినప్పటికీ వీరబలింజలు కేవలం వ్యాపారులు మాత్రమే అని వారి పరిధిని చరిత్రకారులు చాలా తక్కువగా అంచనావేశారు. కొంతలో కొంత మల్లంపల్లి సోమశేఖర శర్మగారు చాలాచోట్ల సందేహాలకు గురైనప్పటికీ వీరబలింజల గురించిన సమాచారం ఇవ్వడంలో ముందువరుసలో నిలిచారనే చెప్పకోవాలి. శెట్టి సమయాలకు సంబంధించిన చరిత్ర సమగ్రంగా ఎక్కడా లభించడం లేదు. పేరుకు 500 వీరశాసనాలు కలిగిన వారిగా చెప్పుకున్నా వీటిలో బయటకు వచ్చినవి మాత్రం చాలా కొద్దిగానే వున్నాయి. వీరబలింజలే ముమూర్మిదండులని కొన్ని శాసనాలు చెబుతున్నా నేటి తరం చరిత్ర విద్యార్థులకు ఇవి అర్థంకాని వ్యవహారాలుగానే వుండిపోయాయి.

తొలిదశ చరిత్ర నిర్మాణం లో పాల్గొన్న చరిత్రకారులు చాతుర్వర్ణ వ్యవస్థ ను మనసులో పెట్టుకుని చరిత్రను సంకలనం చేశారు. వాస్తవానికి ఈ దేశంలో చాతుర్వర్ణ వ్యవస్థ నామమాత్రపు పాత్రను మాత్రమే పోషించిందని చెప్పుకోవాల్సి వుంటుంది. అటు కాకతీయులు, ఇటు నాయకరాజులు వంటి అనేక రాజవంశాలు తమను తాము సూర్య, చంద్ర వంశాలకు చెందిన వారిగా చెప్పుకున్నా సచ్ఛూద్రులుగానే రాజ్యాలేలారు. మొదటి తరం చరిత్రకారులు

ఈ విషయాలలో చాలా గందరగోళాన్నే ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని పాఠకులకు సులభంగా అర్థం కావడానికి కులము, వర్ణము రెండూ వేరు వేరు అంశాలని ఈ పుస్తక రచయిత చాలా చక్కగా వివరించారు.

కుడి, ఎడమ కులాల గురించి చాలా పుస్తకాలలో ప్రస్తావనలు వున్నప్పటికీ వీటి మధ్య పోటీ తత్వం ఎలా చరిత్ర గతిని మార్చివేసిందన్న వాస్తవాన్ని వివరించడంలో పుస్తకరచయిత కృతకృత్యుడయ్యాడనే భావించాల్సి వుంటుంది. నిజానికి ఈ పుస్తకాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అతి ప్రాచీన భారతీయ మానవ నాగరికత ఆరంభం దశ నుండి నిన్నామొన్నటి తెల్లవారి పాలన వరకు జరిగిన సంఘటనలను లీలగా వివరించినట్లు కనిపిస్తుంది. గౌరీపుత్రుల ప్రస్తావన, పూర్వాచార – వామాచార కులాల ప్రస్తావనలను జాగ్రత్తగా గమనిస్తే మానవ సమూహాలు నాగరికత వైపు అడుగులేసే తొలినాళ్లలోనే కులాలు ఏర్పడ్డాయన్న భావనను ఈ పుస్తకం కలిగిస్తోంది. మానవ సమూహాలు ఎదుర్కునే అనేక సవాళ్లను నాటి భారతీయ సమాజం ఎదుర్కొన్న తీరు నిజంగా ఆశ్చర్యంగొలుపుతోంది.

మధ్యయుగాల నాటికి అత్యున్నత నాగరికత ఈ దేశం అనుభవించిందన్న వాస్తవాలు, యురోపియన్ దేశాలు ఇక్కడి ప్రజా సమూహాల స్ఫూర్తితో టెక్నాలజీని స్వంతం చేసుకున్నాయన్న వాస్తవాలు ఈ పుస్తకంలో కనిపించి పాఠకుడిని విస్మయానికి గురిచేస్తాయి. విజయనగర సామ్రాజ్యం గురించి విదేశీయులు రాసుకున్న రాతలు ఇప్పటి తరం లోని చాలామందికి తెలియదు. అదే విధంగా ఇంగ్లీషువారు ఓడలను తయారు చేయడం మన వద్ద నేర్చుకుని మన కళాకారులనే మట్టుపెట్టిన వాస్తవాలను నేటి తరాలు తప్పకుండా తెలుసుకోవాలి.

ఔరంగాజేబు వంటి చక్రవర్తి మెడలు వంచి పన్నులు రద్దు చేయించిన వాస్తవాన్ని శాసనాలతో సహా వివరించడం రచయిత పరిశోధనాపటిమను సూచిస్తోంది. శెట్టిసమయాలు పరిపాలనా వ్యవస్థలుగా, న్యాయవ్యవస్థలుగా ప్రజా సమూహాలను నడిపిన తీరు కళ్లకు కట్టినట్లు వివరించారు. ఇక ప్రాచీన నౌకా వాణిజ్యాలతో మన వారు తూర్పు ఇండియా దీవులను ఎలా ప్రభావితం చేసిందీ చక్కగా వివరించారు. అక్కడి నాగరికతలను ప్రభావితం చేసింది కృష్ణా, గోదావరీ

ప్రాంతం నుండి వెళ్లిన తెలుగువారే అన్న విషయం తెలుసుకున్నప్పుడు ప్రతి తెలుగువాడి హృదయం ఉప్పొంగుతుంది. ఇండోనేషియాలోని బొరాబొదూర్ స్థూపాన్ని నిర్మించిన వారు శ్రీశైలం నుండి వెళ్లిన శైలేంద్ర వంశీయులని, థాయిలాండ్ లో ఒకట వశతాబ్దం నుండి 13వ శతాబ్దం వరకు ద్వారావతి, హరివంశాల వారు రాజ్యాలేలారని, వీరిలో హరివంశాన్ని స్థాపించినది ''చామదేవి'' అనే అచ్చమైన తెలుగురాణి అన్నది చాలా ఆశ్చర్యం గొలిపే విషయం.

ఇక్కడి ప్రజలు ఒకరికి మరొకరు పోటీ కాకుండా అద్భుతమైన పని విభజనతో శెట్టి సమయాలు ఈ దేశాన్ని అత్యున్నత దశకు తీసుకు వెళ్లాయన్న సత్యం స్వాతంత్ర్యం సాధించుకున్న 70 ఏళ్ల తరువాత వెలుగులోకి రావడం నిజంగా ఆనందదాయకం. మనపైన వ్యవస్థలను నాశనం చేసిన వలసపాలకులు తమవైన వ్యవస్థలను మనపై రుద్ది మనల్ని దిగజార్చి వెళ్లారు. ఇప్పటికైనా మనం కళ్లు తెరవాలి మనవైన వ్యవస్థలను మళ్లీ సరికొత్తగా నిర్మించుకోవాల్సిన చారిత్రాత్మక అవసరం మనముందు వుంది.


ఎన్నో మరుగున పడిన వాస్తవాలు చదివినప్పుడు నాకు చాలా ఆశ్చర్యము కలిగింది. మన పూర్వీకుల గొప్పదనం గురించి తెలుసుకున్నప్పుడు చాలా ఆనందం కలిగింది. గతించి పోయిన మన వైభవాన్ని, చరిత్రను వెలికితీసి కళ్లకు కట్టినట్లు చూపించిన ఈ పుస్తక రచయిత ధూపం అభిమన్యుడు అభినందనీయుడు. వీరి కలం నుండి భవిష్యత్తులో మరిన్ని చారిత్రాత్మక రచనలు వెలువడాలని ఆకాంక్షిస్తున్నాను.

భట్టరుశెట్టి పద్మారావు రాయలు

రచయిత, చరిత్రపరిశోధకులు

సెల్ : 90104 29826

మరుగునపడినవాస్తవాలు
వెలుగుచూసిన వైనం



భారతీయ సంస్కృతి ఆకాశమంత విశాలమయింది,మహాసాగరమంత గాంభీర్య మయింది, చైతన్యవంతమయింది. క్రియాశీల తత్వ ప్రధానమయింది. ఇట్టి మహోన్నతమైన వారసత్వానికి మనం వారసులం. దీనిని పరిరక్షించుకోవడం మనం దరి బాధ్యత.

ఎందుకంటే ఈ సంస్కృతిలో ఎన్నో సంస్థలు, సమయాలు వర్ధిల్లాయి. వ్యక్తికి సమాజమునకు శాశ్విత విలువలను ప్రసాదించినాయి. నైతిక విలువల సమన్వయములో జనజీవనాన్ని నియమబద్ధంగా నడిపించాయి. కాలగ మనంలో కొన్ని శాశ్విత విలువలు మరుగున పడిపోతున్నాయి జనజీవనంలో సుఖ శాంతులు సన్నగిల్లుతున్నాయి. ఇట్టి స్థితిని మనం అధిగమించాలి. మరుగున పడిన శాశ్విత విలువలను తిరిగి వెలుగులోకి తీసుకు రావాలి ఇట్టి బాధ్యత మనందరిమీద ఉంది.

ధూపం అభిమన్యుడు గారు తన వంతుగా శెట్టి సమయాలను గురించి పరిశోధన చేశారు. విషయాన్ని మన అవగాహనకు అందే విధముగా అందించారు. అసలు "సమయాలు" అంటే ఏమిటి? శెట్టి సమయాల ప్రయోజనము ఏమిటి? అవి జనజీవనాన్ని ఎలా మెరుగులు దిద్దాయి, పాలనాయంత్రాంగంలో ఎలా పట్టు సాధించాయి, కులాల స్థాయినుండి పృథ్విశెట్టి స్థాయివరకు ఎలా క్రమోన్నతి పొందాయి, ఎంత కీర్తిని ఆర్జించాయి ఉత్పత్తి, విక్రయ స్థాయి నుండి అంతర్జాతీయ వాణిజ్య సంస్థలుగా ఎలా ఎదిగాయి, భారతీయ నౌకా నిర్మాణము, నాటి నాణ్యాల లాంటివి ఎన్నింటినో వివరించారు.

వీరబలిజ సమయాల గురించి చెబుతూ శాసనాధారాలను చూపించారు. నరపతులు, అశ్వపతులు, గజపతులు, బలిజ సింహాసనము ఏర్పాటు చేసిన విధానాన్ని ఉటంకించారు. మీరాపాత్రుని సూచనలతో దుష్ట పాలకుడైన అలంగీరు సైతము శెట్టి సమయాలను, పృథ్వీశెట్టి ఆధికృతను గుర్తించి, గౌరవించి, సన్మానించిన విధమును తేటతెల్లం చేశారు. ఇట్టి విశిష్టమైన శెట్టి సమయాలను బ్రిటీషు ప్రభుత్వం రద్దు చేసిందని, కూకటివేళ్లతో పెకిలించిందని అభిమన్యుడు బాధపడ్డారు.

ఇలాగే ఒక బ్రిటీషు పౌరుడు, రచయిత ఒక వ్యాసములో బ్రిటీషువారి అరాచకాన్ని ఎత్తిపొడిచాడు.

"మన సామ్రాజ్యం ప్రజాభిప్రాయంపై నడిచే సామ్రాజ్యం కాదు. సామ్రాజ్యాన్ని సాధించిందీ, పాలించిందీ బలప్రయోగంతోనే, దేశంలోని ఏ భూభాగమూ స్వచ్ఛందంగా బ్రిటీషు పాలన క్రిందకు రాలేదు. మనకు మొదట సముద్రతీరాన సరకులు అమ్ముకోవడానికి అనుమతి లభించింది. క్రమక్రమంగా దేశాన్ని ఆక్రమించాము. కొన్నిసార్లు బలప్రయోగంతో, మరి కొన్నిసార్లు లంచాలతో ప్రాచీన రాజ్యాలను కూల్చాము. దేశమనరులను, పరిశ్రమలను క్రమక్రమంగా లాగేసు కున్నాము, ప్రజల సంపదను కొల్లగొట్టాము."

బాగా చితికిన చేతివృత్తుల వారు యంత్రాల పోటీకి తట్టుకోలేక నిరాశ్రయులయ్యారు. నిరాశా నిస్పృహలకు లోనయ్యారు. అట్టి చేనేత పనివానికి ఒక రచయితకు జరిగిన సంభాషణను గమనించండి.

ప్రశ్న : నీకు పిల్లలున్నారా ?

జవాబు : అవును దేవునికి కృతజ్ఞతా స్తుతులు. వారి పోషణాభారం నాకు తప్పింది. ఈ పాడులోకపు బాధలు వారికి తప్పాయి.

అతడు అలా మాట్లాడాడంటే అతని మనోస్థితిని మనం అర్థం చేసుకోవచ్చు.

ఇటువంటి స్థితిని మనం అధిగమించాలి. అధిగమించాలంటే మనం ఏమి చేయాలి? మన కర్తవ్యాన్ని ప్రణాళికాబద్ధంగా రూపొందించుకోవాలి. శ్రద్ధ, భక్తి సామర్థ్యాల సమ్మేళనంలో మన వ్యవస్థలను, సమయాలను పున రుద్ధ రించుకోవడానికి కృషిచేయాలి. అప్పుడే సమాజము యొక్క సర్వతో ముఖాభివృద్ధిని సాధించగలుగుతాము. ప్రాచీన వైభవాన్ని ప్రతిష్ఠించు కున్నామనే సంతృప్తిని పొందుతాము.

భవిష్యత్ తరాలు "మనం మరచిన మహావ్యవస్థలు శెట్టి సమయాలు" పుస్తకం నుండి స్ఫూర్తిపొందాలని ఎంతో కృషి చేసి చరిత్రను వెలికితీసిన ధూపం అభిమన్యుడును అభినందిస్తున్నాను. వారి కలం నుండి భవిష్యత్తులో మరిన్ని విలువైన రచనలు రావాలని ఆకాంక్షిస్తున్నాను.

"లోకా సమస్తా సుఖినో భవంతు"

చొక్కాము నారాయణస్వామి
చరిత్రపరిశోధకులు

ముందుమాట

భారతదేశం ప్రపంచానికి జ్ఞాన బిక్షపెట్టిన పుణ్యభూమి. సకల శాస్త్రాలకు జన్మనిచ్చిన కర్మభూమి. ఐదువేలమంది పౌరులు కలిగినది మాత్రమే నగరరాజ్యం, కాదు పదివేలమంది పౌరులు కలిగినది నగర రాజ్యం అంటూ సోక్రటీసు, అరిస్టాటిల్ వంటి వారు అభిప్రాయపడిన కాలం నాటికే మహా సామ్రాజ్యాలు ఇక్కడ విలసిల్లాయి. ప్రపంచం అంటే ఎంత విశాలంగా వుంటుందో తెలియకుండానే ప్రపంచాన్ని జయించడానికి బయలుదేరిన అలెగ్జాండర్ ఇక్కడ వందలాది ఏనుగులను యుద్ధం లో ఉపయోగించడం చూసి తొలిసారి విస్మయానికి లోనయ్యాడు. పురుషోత్తముడిని యుద్ధంలో గెలిచాడు అని గ్రీకు చరిత్రకారు లు గప్పాలు రాసుకుంటే నేడు మనం అది నిజమని నమ్మి చరిత్ర చదువుకుంటున్నాము. పురుషోత్తముడిని ఎదిరించలేక వెనుతిరిగాడన్న సత్యాన్ని గ్రహించలేకపోయాము. ఇలా ఒకటి కాదు అడు గడుగునా భారతీయుల చరిత్ర వక్రీకరించబడింది.

వలసపాలనల అనంతరం అమెరికాతో పాటు అనేక దేశాలు ప్రజాస్వామ్య దేశాలుగా ఏర్పడ్డాయి మనమూ వాటి స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని నిర్మించు కున్నాం. ప్రజాస్వామ్యం అంటే ప్రజలే ప్రభువులుగా తమను తాము ఏలుకునే గొప్ప వ్యవస్థగా అభిప్రాయపడుతున్నాము. కానీ కమ్యూనిస్టులు మాత్రం ప్రజాస్వామ్యాన్ని పరిపూర్ణ వ్యవస్థగా ఒప్పుకోరు. ప్రజాస్వామ్యం లో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయి సంపన్నులు పేదల మధ్య అంతరాలు పెరిగిపోయి విప్లవం వస్తుందని విప్లవానంతరం సోషలిస్టు సమాజం ఏర్పడుతుందని వారి పరిణామ సిద్ధాంతాన్ని వివరిస్తారు. నేటి భారతదేశ పరిపాలనా విధానాన్ని గమనించినప్పుడు వారి వాదన నిజమే అనిపిస్తుంది.

నేడు ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ళను ప్రాచీన ప్రజలు ఎదుర్కోలేదా?

వారికి ఈ సమస్యలు ఎదురుకాలేదా?

రాజరిక వ్యవస్థలో రాజే సర్వోన్నతుడు కావడంతో వారిష్టానుసారమే పాలన సాగుతుంది కాబట్టి ప్రాచీనులకు ఈ సమస్యలు ఎదురు కాలేదని అనవచ్చు . కానీ ప్రాచీన భారతదేశంలో అసలు సిసలైన ప్రజాస్వామ్యం

వర్థిల్లింది అని ప్రకటించడానికి నేను సాహసం చేస్తున్నాను.

ఇక్కడ రాజులున్నారు, చక్రవర్తులున్నారు... కానీ వారిని శాసించగలిగిన ప్రజలు కూడా జీవించారు. అసంబద్ధమైన పన్నులు వేసినప్పుడు వాటిని రద్దు చేయించగలిగారు. ప్రజాకంటకులైన రాజులను సైతం దండించిన ప్రజలు ఈ సమాజం లో జీవించారు. నేను చెప్పే ఈ మాటలు చాలామందికి అతిశయోక్తులుగా అనిపించవచ్చు కానీ నేను చూపించే ఆధారాలు మాత్రం అతిశయోక్తులు కాదు.

తెల్లవారిని వెళ్లగొట్టి మనం స్వాతంత్ర్యం సాధించుకున్నామని సంబరాలు చేసుకుంటున్నాము. వారిని వెళ్లగొట్టిన తరువాత వారు ఏర్పాటు చేసిన వ్యవస్థలను తొలగించి వాటి స్థానంలో మనవైన వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి కానీ ఎందుకు చేసుకోలేకపోయాము? తెల్లవారు వలస పాలకులు వారి సౌలభ్యం కొరకు వ్యవస్థలను చట్టాలను తయారు చేశారు అవి మన జీవన విధానానికి అనుకూలం కాదు... కానీ వాటినే కొనసాగిస్తున్నాము.

పోలీసు వ్యవస్థ అలాగే కొనసాగుతోంది.	
రెవెన్యూ వ్యవస్థ	డిటో
అటవీశాఖ	డిటో
న్యాయ వ్యవస్థ	డిటో
భారత శిక్షాస్మృతి	డిటో
విద్యా వ్యవస్థ	డిటో

ఇక రాజ్యాంగం విషయానికి వస్తే (రాజ్యాంగాన్ని విమర్శిస్తే తప్పుకానీ సమీక్షించడం తప్పు కాదని మనవి చేసుకుంటున్నాను)

1. ఏక పౌరసత్వం	(బ్రిటన్ నుండి).
2. పార్లమెంటరీ విధానం	(బ్రిటన్ నుండి).
3. స్పీకర్ పదవి	(బ్రిటన్ నుండి).
4. ప్రాథమిక హక్కులు	(అమెరికా నుండి).
5. సుప్రీం కోర్టు	(అమెరికా నుండి).
6. న్యాయ సమీక్షాధికారం	(అమెరికా నుండి).

7. ఆదేశిక సూత్రాలు (ఐర్లండ్ నుండి).
8. రాష్ట్రపతి ఎన్నిక పద్ధతి (ఐర్లండ్ నుండి).
9. రాజ్యసభ సభ్యుల నియామకం (ఐర్లండ్ నుండి)
10. ప్రాథమిక విధులు (రష్యా నుండి).
11. కేంద్రరాష్ట్ర సంబంధాలు (కెనడా నుండి).
12. అత్యవసర పరిస్థితి (జర్మనీ నుండి).

మరి భారతదేశంలో పరిపాలన కొరకు భారతదేశం నుండి ఏం తీసుకున్నారు. యురోపియన్ జీవన విధానం వేరు భారతీయ జీవన విధానం వేరు వారి చట్టాలు, వారి పరిపాలనా విధానాలు, వారి నిబంధనలు మన కెలా సరిపోతాయి???జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ అని భావించే భారతీయుడికి, ధర్మోరక్షతి రక్షితః అని నినదించే భారతీయుడికి ధర్మంగా జీవించడం మాత్రమే తెలిసిన భారతీయుడికి కుట్రలు కుతంత్రాలు మాత్రమే తెలిసి, సరైన జీవన విధానమే లేని యురోపియన్ చట్టాలు, విధానాలు ఎలా సరిపోతాయి, ఈ విధానాలు మనల్ని పురోగతికి తీసుకు వెళతాయా తిరోగమనానికి నెట్టివేస్తాయా???

అవును...కచ్చితంగా మనల్ని పతనానికే నెట్టి వేస్తాయి. మరింత పతనానికి... మరింత పతనానికి..మరింత పతనానికి.... ఎలా జీవించాలో నేర్పిన రామాయణ, మహా భారత గ్రంథాలనుండి ఏం తీసుకున్నాం. ప్రపంచంలోనే అత్యున్నతమైన పరిపాలనా విధానాన్ని సూచించిన కౌటిల్యుని అర్థశాస్త్రం నుండి ఏం తీసుకున్నాం. ఇంటర్నేషనల్ లా దొరకని సమయంలో ప్రపంచమే రామాయణ మహా భారత గ్రంథాలను అధ్యయనం చేయగా మరి మనమెందుకు వాటిని విస్మరించాం....వీటి గురించి ప్రస్తావిస్తే ఎక్కడ హిందుత్వం చూపించారని అంటారేమో అన్న కుహనా లౌకికవాదం బహుశా మన పెద్దలను పట్టి పీడించిందేమో... "ధర్మం" అనే చిన్న పదం గురించిన అర్థం యురోపియన్ దేశాలకు తెలుసా ??? ఈ ఒక్క పదంలోనే భారతీయ జీవన విధానం ఇమిడి వుందన్న సత్యం యురోపియన్లదాకా ఎందుకు మనలో ఎంతమందికి తెలుసు? స్వాతంత్ర్యాన్ని అడుక్కుని తీసుకున్న మన దాస్య భావజాలానికి యురోపియన్లు మాత్రమే మేధావులుగా కనిపించారా???

నిన్నటి దాకా ఉద్యోగం చేయడం అంటే దాస్యం అని భావించిన ఈ దేశానికి, నేడు నిరుద్యోగి అంటే బరువైపోయాడు ఎందుకు?

ఈ దేశంలో 85 శాతం మంది ప్రజలు నిజాయితీ పరులు కానీ దేశంలో 85శాతం అవినీతి వుందిఅన్న సెంటర్‌ఫర్ గుడ్ గవర్నెన్స్ మాటలకు అర్థం ఏమిటి?

మనిషిలో నిజాయితీ వున్నా నిజాయితీగా జీవించలేక పోతున్నాడనేగా దీనర్థం. మనల్ని మనలాగా జీవించనీయని ఈ వ్యవస్థని ఇంకా మనం మోయాలా???

పోలీసు స్టేషన్‌లో ప్రాథమిక దర్యాప్తు నివేదిక ***(FIR)*** లో కూడా వాస్తవాలు రాసుకోలేని ఆసహాయస్థితిలో మనం పరిపాలన సాగించు కుంటున్నాము.

ఈ అసంబద్ధ పాలన మిగిల్చిన ఫలితాలు ఎలా వున్నాయంటే....

ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలకు గురిచేసిన భారతీయ వృత్తులు, కళలు సమాధి అయ్యాయి... అవుతున్నాయి...

చేనేత :- రెండు వేల సంవత్సరాల నాడే ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసిన భారతీయ చేనేత కారులు నేడు పది గంటలు పని చేస్తే వారికి కేవలం రూ.50 లకు మించి లభించడం లేదంటే ఎంతటి దౌర్భాగ్య స్థితిని మనం అనుభవిస్తున్నామో తెలుస్తుంది. నేత మాత్రమే తెలిసి మరో పని తెలియని వేలాది కుటుంబాలు నేడు చేనేత పని దొరకక, ఇతర పనుల్లో ఇమడలేక కడుపునిండా అన్నాన్ని కూడా సంపాదించుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే ఎక్కడ లోపం వుందో కూడా తెలియని స్థితిలో వున్నామా మనం.

మేదరలు :- ప్రతి ఏటా విచ్చల విడిగా పెరిగి పడిపోయే గడ్డి పంట వెదురు. మన అడవుల్లో పుష్కలంగా లభిస్తుంది. వెదురుతో ఎన్నో నిత్యావసర వస్తువులు, కళారూపాలను తయారు చేసే మేదర్ల కుటుంబాలు నేడు పనిలేక పస్తులుండే పరిస్థితులు కల్పించాము. వెదురు కొరకు అడవిలోకి వెళ్లే పరిస్థితే లేకుండా చేశాము. నేడు నల్లమల శివారు గ్రామాలలో వున్న వేలాది వెదురు కార్మిక కుటుంబాలు తిండిలేక, సంపాదనలేక, మరో వృత్తి తెలియక పస్తులుంటున్నాయని ఎంతమందికి తెలుసు. పులులకు నీటి కొరకు వాటర్‌పాండ్స్ నిర్మిస్తున్నాము, మొక్క నాటినా పెరగని భూముల్లో మొక్కలు నాటడం కొరకు

కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నాము. ప్రభుత్వం పర్యావరణం, జీవకారుణ్యం అంటూ చేస్తున్న ప్రకటనలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాము. మరి ఆ జీవకారుణ్యంలో ఈ బడుగుజీవులు లేరా....?

సుగాలీలు, చెంచులు :- వీరు అడవులే ఆవాసాలుగా అటవీ సంరక్షకులుగా జీవించారు. వేలాది ఆవుల మందలను అడవిలో మేపుకుంటారు. ఈ రోజు ఆవులు అడవిలో మేపుకోకూడదు అంటూ ఆంక్షలు విధిస్తున్నారు. మరి గోవులను ఎక్కడ మేపుకోవాలి. గోవులు చెట్లను తింటాయా ? గడ్డిని తింటాయా? గోవులను అడవిలో మేపుకో నివ్వకపోతే కబేళాలకు తరలించాలా ఏమిటీ అసంబద్ధ నిర్ణయాలు. వీరికంటే తెల్లవాళ్లే నయం ఆవుకు రెండు రూపాయలు పుల్లరి కట్టించుకుని మేపుకోనిచ్చేవారు...

చెంచులు :- అడవుల్లో జీవించినా ఆత్మగౌరవం కాపాడుకునే బడుగుజీవులు. తమ సంస్కృతిని, తమ ఆచారాలను ఎట్టి పరిస్థితిలోనూ వదులుకోరు. నాగరిక జాతులను నమ్మితే ప్రాణమిస్తారు...అనుమానించారా దగ్గరకు కూడా రానివ్వరు. అడవితల్లి వీరిని ఏ రోజూ పస్తులు పడుకోనివ్వలేదు. తన ఒడిలోకి వస్తే ఏదో ఒకటి పెట్టి కడుపు నింపుతుంది. కానీ అడవులనుండి జనావాసాలకు వీరిని బలవంతంగా తరలించారు. మన నాగరిక వాసన తగిలి ఆత్మగౌరవాన్ని వదిలేశారు. వీధుల వెంట అన్నం పెట్టమని అడుక్కుంటున్నారు. శ్రీశైలం అడవుల్లో దోర్నాల-ఆత్మకూరు రహదారిపై అడుక్కునే చెంచు మహిళలు వృద్ధులు కనిపిస్తారు. ఇలా గతంలో ఎన్నడైనా కనిపించారా....? మన పాలన ఇలాంటి వారి స్థితిగతులను మెరుగుపరుస్తోందా లేక దిగజారుస్తోందా...?

ఇక రైతు పరిస్థితి మరింత దయనీయం... ఏ వస్తువైనా తయారు చేసే ఉత్పత్తి దారుడు ధరను నిర్ణయిస్తాడు కానీ ధాన్యం ధరను మాత్రం వ్యాపారులు నిర్ణయిస్తారు. బయటి మార్కెట్ లో కిలో బియ్యం ధర రూ.40 వుంటుంది కానీ 75 కిలోల ధాన్యం బస్తా కొనుగోలు ధర మాత్రం వెయ్యికి మించదు. మార్కెట్‌యార్డులకు చేరిన పంటలకు గంట గంటకు ధరలు మారిపోతుంటాయి. వీటిని ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తారో ఎవరికీ తెలియదు. ఆరుగాలం కష్టపడిన రైతుకు కనీసం పెట్టుబడి రాదు. అప్పులబాధ తాళలేక వందలాది మంది ప్రతిఏటా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారం నిజంగా మనకు తెలియదా...?

రజకులు అనేక చోట్ల ఇతర కులాల వారు పెట్టిన ల్యాండ్రీలలో రోజు కూలీలుగా పని చేస్తున్నారు,

నాయీ బ్రాహ్మణులు గతంలో మిరాశి వుండడం వల్ల ఏ నాడూ తిండికి ఇబ్బంది పడలేదు. నేడు స్వంతంగా సెలూన్ పెట్టుకుంటే కానీ జీవించలేని పరిస్థితి. పెట్టుబడులు పెట్టి పెద్ద పెద్ద క్షౌరశాలలు పెట్టుకోలేక ఇతరులు పెట్టిన క్షౌరశాలలో కమీషన్లకు పని చేస్తున్నారు. రిజర్వేషన్లతో ఉద్యోగావకాశాలు కల్పించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ కనీసం ఒక్కశాతం కూడా ప్రభుత్వ ఉద్యోగాలకు నోచుకోలేదంటే పరిస్థితి ఏవిధంగా వుందో ఊహించుకోవచ్చు.

గంగపుత్రులు చేపలవేటే వృత్తి అత్యంత సాహసోపేతమైన జాతి. ఎంతటి జలాలలోనైనా సరే నాటుపడవలతో చేపల వేట సాగించగల సాహసులు. కానీ నేడు ఇతర కులాలకు చెందిన కాంట్రాక్టర్ల వద్ద దినసరి కూలీలుగా పని చేస్తున్నారు. చేపల వేట వీరి హక్కు నేడు ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల చేపలవేటకు సంబంధం లేని ఇతర కులాలు వీరికి ఇబ్బందిగా పరిణమిస్తున్నారు. తమ మత్స్య సంపదను ఇతర కులాలకు చెందిన వారు దోచుకు పోతుంటే ఏమీ చేయలేని నిస్సహాయతతో జీవిస్తున్నారు...రిజర్వేషన్లు వున్నా ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం 0.001శాతానికి మించి లభించడం లేదు.

ఒకటి కాదు రెండు కాదు ఎన్నో కులాలు ఈ రోజు తమ కులవృత్తులను వదిలి తమకు సంబంధం లేని ఇతర వృత్తులలోకి వెళుతున్నారు అక్కడ వారికి నైపుణ్యం లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరి ఈ విషయాలేవీ మనకు తెలియవా...పాలకులుగా వున్నవారికి తెలియవా....?

అభివృద్ధి అంటూ చెవులు దద్దరిల్లేలా ప్రసంగాలు చేస్తుంటారు. అసలు అభివృద్ధి అంటే ఏమిటి? కొద్దిమంది కార్లలో తిరిగి... మరికొందరు కూటికిలేక అల్లాడడమా అభివృద్ధి.

ఇవన్నీ ఒక ఎత్తయితే పేదలు, ధనికులు అని తేడా లేకుండా అందరూ ఎదుర్కొంటున్న సమస్యలు కోకొల్లలు. మాటలు సరిగా రాని పసిపిల్లలు బడికి వెళితే ఫీజు అరలక్షా....కడుపునొప్పి అని ఆసుపత్రికి వెళితే కేవలం రోగధృవీకరణ పరీక్షలకే ఆస్తులమ్ముకోవాల్సిన పరిస్థితి. వందల సంఖ్యలో కూడా లేని విఆర్ఓ, విఆర్ఎ పోస్టులకు లక్షల్లో దరఖాస్తులు. ఎందుకింత పోటీ....?

ఇక విద్యావ్యవస్థ తీరు ఎలావుందంటే ఈ దేశంలో ఇంజనీరింగ్ చదివిన

విద్యార్థిని ఇతర దేశాలు ఇంజినీర్‌గా గుర్తించవు. ఇంజినీరింగ్ చదివి బ్యాంకు ఉద్యోగం చేస్తారు. డాక్టరేట్ చేసి గుమస్తాగా పని చేస్తారు. మెకాలే విద్యా విధానం తెల్లవారికి ఉద్యోగులను తయారు చేసేందుకు ఏర్పాటు చేసిందన్న విషయాన్ని ఈ నాటికీ గ్రహించలేకుండా వున్నామా...? ఈ నాడు ఎంబీబీఎస్ చదవాలంటే డొనేషన్ కోటి రూపాయలా...కోటి రూపాయలు పెట్టి డాక్టరైనవాడు ప్రజలకు నిజంగా సేవ చేస్తాడా.....? సేవ చేస్తే తాము పెట్టిన కోటి రూపాయల పెట్టుబడిని ఎలా తిరిగి తీసుకోగలుగుతాడు. మనకు సరిపోని, అక్కరలేని ఈ రకమైన విద్యావిధానాన్ని వదలిపెట్టడం మనకు సాధ్యం కాదా....?

పసిపిల్లలు త్రాగే పాల దగ్గర నుండి పెద్ద లు వాడే వంట నూనెల వరకు కల్తీ...ఇవి అసలు కాదు కల్తీ... అని చెప్పి మరీ నిర్భయంగా అమ్ముతున్నారు. మరి వీటిని నిరోధించేవారు ఎవరు?

ప్రజల చేత ఎన్నుకోబడి ప్రజల కొరకు పనిచేస్తున్న ప్రభుత్వం ఎందుకు సమర్థవంతంగా పనిచేయలేకపోతోంది? ఈ రకమైన ప్రజాస్వామ్యంలో ప్రజలు నిజంగా ప్రభువులా? ఐదేళ్లకోసారి ఓటు వేసి ఐదేళ్లూ అర్భకులుగా మిగిలి పోతున్నారు. తాము ఎన్నుకున్న ప్రతినిధులు పనిచేయలేకపోతే పదవుల నుండి దించలేక పోతున్నారు, కనీసం ప్రశ్నించలేకపోతున్నారు. అబద్ధాలు చెప్పి ప్రతిసారీ మోసం చేస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయులవుతున్నారు.

మరి ప్రాచీన భారతీయులు ఇలాగే జీవించారా? అసలు సిసలైన ప్రజాస్వామ్యాన్ని వారు చవిచూశారు. నాటి వ్యవస్థ తీరుతెన్నులు నేటి నవతరానికి పరిచయం చేయడమే ఈ పుస్తకం ఉద్దేశ్యం. ప్రతి సమస్యకూ పరిష్కారం ప్రాచీన భారతీయులకు తెలుసు. వారి వారసులుగా మన వ్యవస్థలను మనమెందుకు ప్రక్షాళన చేసుకోలేము? అన్నదే నాప్రశ్న...అందుకే నాటి తరాల జీవన విధానాన్ని పరిశోధించి మరీ ప్రజల ముందుకు తెస్తున్నాను. నాటి తరాల జన్యువులు నేటి తరాలలో ఉంటాయని అవి స్పందించగలు గుతాయని ....నాటి తరాల స్ఫూర్తితో నేటి సమస్యలకు సరికొత్త పరిష్కారాలను కనుక్కుంటాయని ఆశిస్తున్నాను.

తప్పు చేయని వాడు తలెత్తుకు తిరగాలి.... తప్పు చేసేవాడు భయం భయంగా తిరగాలి. తనకు అన్యాయం జరగదు అన్న ధీమాతో సామాన్యుడు జీవించాలి. అదే అత్యుత్తమ పాలన.

–రచయిత

ఒక పౌరుడుగా, ఇంకా చెప్పాలంటే "శెట్టి సమయాల" నేపథ్యం నుంచి వచ్చిన కుటుంబాలకు చెందిన వాడుగా తన అధ్యయనాన్ని, ఆలోచనలను, ఆవేదనను కాగితంపై పెట్టి ఆలోచనాపరుల ముందు ంచారు. ఆలోచనాపరులు ఈ పుస్తకాన్ని చదివి, రచయిత మనముం దుంచిన సమాచారాన్ని విశ్లేషించి మరింతలోతుగా పరిశీలనకు పూనుకోగలిగితే చాలు.

మరుగున పడిన చరిత్రను త్రవ్వితీసి, ప్రజల ముందు పెట్టడానికి చేసిన మహాప్రయత్నం ఈ రచన. రచయిత *శ్రీ ధూపం అభిమన్యుడు* గారికి హృదయపూర్వక అభినందనలు తెలుపడానికి సంతోషిస్తున్నాను.

భారతీయుల - అందునా మూలజాతికి చెందిన తెలుగువారి చరిత్ర లోతుల్లోకి, వారి సామాజిక వ్యవస్థల లోతుల్లోకి వెళ్లి అధ్యయనం చేయడంలో ఇంకా మనం ఎంతో ముందుకు సాగాలి. ఈ ప్రయాణం లో ఎవరు నిరుత్సాహపరచినా ఆగకుండా ముందుకే సాగవలసిందిగా అభిమన్యుడు గారిని కోరుతున్నాను.

డా॥సామల రమేష్‌బాబు

సామల రమేష్‌బాబు

తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు
"అమ్మనుడి" పత్రిక సంపాదకుడు
సెల్ : 9848016136

మనం మరచిన మహా వ్యవస్థలు శెట్టి సమయాలు

మనం నివశిస్తున్న ఈ దేశాన్ని పూర్వం ఏమని పిలిచేవారు? ఈ దేశం మొత్తం ఒకే దేశంగా వుండేదా? అసలు ఇక్కడ పరిపాలన ఏ విధంగా వుండేది? ప్రపంచ దేశాల ముందు మనం ఉన్నతంగా జీవించామా...లేక అనాగరికంగా జీవించామా... ఇక్కడి ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఎలా వుండేవి? కళలు, సంస్కృతి ఎలా వుండేవి ? ఇలాంటి సందేహాలను కొన్నింటినైనా నివృత్తి చేసి నాటి సాంఘిక, చారిత్రక అంశాలను నేటి తరానికి పరిచయం చేయాలన్న తపన నన్నీ పుస్తకం రాయడానికి పురికొల్పింది.

చరిత్ర నిర్మాణం గతంలో ఒకలాగా, తెల్లవాళ్ల పరిపాలనలో మరోలాగా జరిగింది. ఈ దేశాన్ని పరిపాలించిన ముస్లిం చక్రవర్తులు కేవలం వారి మతాన్ని మాత్రమే మనపై రుద్దడానికి ప్రయత్నించారు. మన వ్యవస్థను భ్రష్టుప ట్టించలేదు. కానీ రెండు వందల సంవత్సరాల బ్రిటీషు పరిపాలన కుక్కలు చింపిన విస్తరిలా మన వ్యవస్థలను నామరూపాలు లేకుండా చేసింది, మన మూలాలనే ఛిన్నాభిన్నం చేసింది.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత మనపైన వ్యవస్థలను పునరుద్ధరించు కోవడానికి కనీస ప్రయత్నాలు జరగలేదు. తెల్లవాళ్లు మనపై రుద్ధి, విడిచి పెట్టిపోయిన వ్యవస్థలనే మనం కొనసాగిస్తూ వస్తున్నాము. తెల్ల వారి మానస పుత్రులు రాజకీయ నాయకులుగా రూపాంతరం చెంది మనపై పెత్తనం చలా యిస్తూ మన అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నారు మనల్ని మరింత బానిసలు గా దిగజారుస్తున్నారు. నేటి తరాలు ఖచ్చితంగా నాటి తరాల జీవనవిధానాన్ని తెలుసుకోవాలి... అర్థం చేసుకోవాలి... దాని నుండి స్ఫూర్తి పొందాలి.

1415 నాటికి హిందూదేశానికి సముద్రమార్గాన్ని కనుక్కోవాలని యూరప్‌లోని అన్ని దేశాలూ ఎందుకు ప్రయత్నించాయి?

1492 లో స్పెయిన్ నావికుడు కొలంబస్ యూరప్ నుండి ఇండియాను కనుక్కోవాలని బయలుదేరి అమెరికా ఖండాన్ని కనుక్కున్నాడు. అది కూడా హిందూదేశమని పొరపాటు పడ్డాడు. తరువాత అది భారతదేశం

కాదని మరో కొత్త ఖండమని యురోపియన్లు గుర్తించారు.

జులై 8, 1497 వాస్కోడాగామాను హిందూదేశానికి సముద్రమార్గం కనుక్కునే సాహసయాత్రకు సారధిగా పోర్చుగీసు రాజు ప్రకటించాధు. యూరప్ నుండి ఇండియాకు యాత్ర. ఎందుకు ఇంతటి సాహసానికి యురోపియన్లు పూనుకున్నారు?

20-9-1519 ఫెర్డినాండ్ మాజిల్లాన్ పోర్చుగీసు నావికుడు హిందూ దేశానికి దగ్గరి దారి కనుక్కోవడానికి పడమటి దిక్కుగా 237 మంది నావికులతో ఐదు ఓడలతో బయలుదేరాడు. కానీ భారతదేశాన్ని మాత్రం కనుక్కోలేక పోయాడు. చివరికి 6-9-1522 న మూడు సంవత్సరాలకు స్వదేశానికి చేరారు. 237 మందిలో కేవలం 18 మంది మాత్రమే చావు తప్పి కన్ను లొట్టబోయి స్వదేశానికి చేరారు. మిగిలిన వారందరూ మృత్యువు వాతబడ్డారు.

ప్రపంచంలో పై మూడు యాత్రలూ చాలా ప్రసిద్ధమైనవి. ఈ మూడు కూడా భారతదేశానికి సముద్రమార్గం కనుక్కోవడానికే యురోపియన్లు పంపించారు.

ఇంతకష్టనష్టాలకోర్చి ఈ యాత్రలను యురోపియన్లు ఎందుకు చేశారు?

మనం చదువు కున్న చరిత్రలో భారతదేశం లో చదువుకున్న వారు చాలా తక్కువ, నాగరికత పెద్దగాలేదు, అంతా బ్రిటీషువారు నేర్పించినదే.....

మరి అంత అనాగరికమైన భారతదేశానికి రావడానికి ఎంతోడబ్బు ఖర్చు పెట్టాల్సినంత అవసరం యురోపియన్లకు ఎందుకు కలిగింది?

వారు మనల్ని ఉద్ధరించడానికి వచ్చారా....?

అడవుల్లో గిరిజనుల్లా జీవిస్తున్న భారతీయులను వెతికి మరీ పట్టుకుని నాగరికత నేర్పడానికి వచ్చారా...???

14 వ శతాబ్ధం వరకు ''నూలుపోగు'' గురించి అవగాహన లేనివారు.(ఇండియాలో ఉన్ని చెట్టు (పత్తిమొక్క) పెరుగుతుందని దాని చివర ఒక చిన్న గొర్రెపిల్ల పెరుగుతుందని దానికి ఆకలి వేసినప్పుడు నేలమీదకు ఒంగుతుందని గొర్రెపిల్ల గడ్డి మేసిన తరువాత పైకి లేస్తుందని 14 శతాబ్ధం

నాటి గ్రంథాలలో రాసుకున్నారు) ఆఫ్రికా కొమ్ము దాటితే ఓడలు క్రింద పడిపోతాయని యురోపియన్లు నమ్మేవారు. భూమి నీటితో నిండిన పళ్లెం లా వుంటుందని ఆఫ్రికా కొమ్ము భూమికి చివర అనీ అది దాటితే ఓడలు తలక్రిందులవుతాయని నాటి యురోపియన్ వైజ్ఞానికులు సైతం నమ్మేవారు. వాస్కోడాగామా హిందూదేశానికి వచ్చి పోయిన తరువాతనే యూరప్ లో సాంకేతిక ఆవిష్కరణలు జరిగాయి. అది కేవలం భారతదేశంతో జరిగిన వాణిజ్య సంపర్కం వల్లనే అనడానికి ఇక్కడ నేను సాహసిస్తున్నాను. ఇలాంటి వారా మనకు నాగరికత నేర్పేది... సాంకేతికతను నేర్పేది.....సంస్కృతిని నేర్పేది...

ఏది నిజం...???

ఆ కాలంలో ప్రపంచంలోనే నభూతో నభవిష్యత్ అనిపిం చుకున్న తెలుగు వారి సామ్రాజ్యం విజయనగరం గురించి విదేశీ యాత్రికులు ఏమని రాసుకున్నారో ఒక సారి చూద్దాం...

నికోలోకోంటి ఇటలీ దేశస్తుడు(1420) :- విజయనగరము పర్వతముల సమీపమున కట్టబడినది. చుట్టు కొలత 20 మైళ్లు. కొండలమధ్య పల్లపు ప్రదేశములో జననివాసాలు వున్నాయి. ఉద్యానవనములు, ఫలవృ క్షములు, పంటకాలువలు ఎక్కువగా కలవు, ఆచ్చటచ్చట ప్రసిద్ధ దేవాల యములు కూడా కలవు.

అబ్దుల్ రజాక్ (1443 ఏప్రిల్) :- విజయనగరము వంటి మహా నగరమును మెమెన్నడూ చూసి వుండలేదు.అటువంటి నగరము ప్రపంచమున ఒకటి వున్నట్లు కూడా వినియుండలేదు. ఇది ఏడు ప్రాకారముల మహానగరం. మొదటి మూడు ప్రాకారములలో పంటపొలములు, గృహములు, ఉద్యానవనములతో నిండియుండెను. ఇందు బజారులు విశాలముగా వున్నవి. అందు ముత్యములు, కెంపులు, నీలములు,వజ్రములు మొదలగునవి బహిరంగముగా విక్రయించుచుండిరి.

డొమింగో పేస్ (1520) :-హంపి విజయనగరం గురించి. ఈ నగరంలో వజ్రాలు, ముత్యాలు వంటి విలువైన వ్యాపారం జరుగుతున్నందువలన అనేక ఇతరదేశవాసులు కూడా కనిపిస్తున్నారు. ఈ నగర వైశాల్యం గురించి నేను చెప్పను ఎందుకంటే ఏ ఒక్క ప్రదేశం నుండి ఈ నగరాన్ని చూడ వీలుకాదు.

నేను ఒక కొండనెక్కాను అక్కడి నుండి నగరం చాలావరకు కనిపించింది. ఈ ప్రాంతమంతా కొండలమయమైనందున నగరమంతా కనిపించలేదు. నాకు కనిపించిన నగర భాగమే రోమ్‌నగరమంత వుంది. ఈ నగర జనాభాను లెక్కించడం సాధ్యం కాదు. జనాభా గురించి రాస్తే కట్టుకథలాగ అనిపిస్తుంది కనుక రాయలేను. విజయనగరము వంటి నగరము ప్రపంచంలో మరియొకటి యున్నదని చూడలేదు... వినియుండలేదు.

న్యూనిజ్ (1535-1537) :- ఈ రాజుల వద్ద 10 లక్షల సైన్యం వుంది ఏ క్షణం లో నైనా ఈ సైన్యం యుద్ధానికి సిద్ధంగా వుంటుంది. విజయ నగరంలో వంటపాత్రలు అన్నీ బంగారంతో చేసినవి అవి ఎంత పెద్దవంటే ఒక్కొక్క దాంట్లో ఆవు వంటి జంతువును సగం ఒకేసారి వండవచ్చు.

ఇంత గొప్ప దేశాన్ని కేవలం సందర్శించడానికైతే ఎవరూ ప్రాణాల మీదకు తెచ్చుకోరు కదా... మరి ఎందుకు యురోపియన్లు ఇంత సాహసాలకు ఒడిగట్టారు.???

ఇక్కడ వున్న సంపదను స్వంతం చేసుకోవాలన్న ఒకే ఒక తలంపుతో యూరోపియన్లు భారతదేశానికి సముద్రమార్గాన్ని అన్వేషించారు.

మరి ఇంతగొప్ప సామ్రాజ్యాల నిర్మాణం వెనుక వున్న ప్రజలు ఎవరు?

ఇంత సంపదను ఎలా కూడబెట్టారు?

500 సంవత్సరాల క్రితమే ప్రపంచంలోనే అత్యున్నత నాగరికతను, సంపదను మన పూర్వులు అనుభవించారా...? ఇది నిజమేనా...?

అవును యావత్ ప్రపంచమే ఔరా... అని ఆశ్చర్య పడేలా...జీవితంలో ఒక్క సారైనా చూడాలనిపించేలా...తరతరాలు కథలు కథలు గా చెప్పుకునేంతగా అభివృద్ధి చెందిన ప్రాంతం మన మాతృభూమి.

ఈ వైభవం దేశాన్ని తెల్లవాళ్లు ఆక్రమించుకునే వరకూ కొనసాగింది.

ముస్లింల దండయాత్రలలో కోల్పోయిన సంపద పోగా...చాలా వరకు సంపద దేశం దాటలేదు ఏదో రూపంలో ఇక్కడే వుండిపోయింది.

కానీ తెల్లవాళ్ల పాలనలో దేశం ఎలా వీలైతే అలా దోచుకోబడింది.

కేవలం సంపద మాత్రమే దోచుకోబడితే ఇక్కడి ప్రజలకు పెద్ద నష్టమేం

లేదు. మళ్లీ సంపాదించుకునే సామర్థ్యం ఇక్కడి ప్రజలకు వుంది. కానీ తెల్లవారు చేసినది దోపిడీ మాత్రమే కాదు ...విధ్వంసం... సాంకేతిక విధ్వంసం...

ఇక్కడి ప్రజలు తరతరాలుగా సంపాదించుకున్న సాంకేతిక నైపుణ్యం...చరిత్ర....విజ్ఞానం...

తెల్లవారి ఓర్వలేని తనానికి బలైపోయాయి.

ఇంత గొప్ప సంపదను కూడబెట్టడమే కాదు గొప్ప సంస్కృతిని, సామ్రాజ్యాలను తీర్చి దిద్దిన ప్రజా సమూహాలే "శెట్టిసమయాలు"

"శెట్టి సమయం" అంటే ఏమిటి?

శెట్టి అంటే శ్రేష్ఠుడు, ఉన్నతుడు, ఉత్తముడు, ముఖ్యుడు అనే అర్థాలున్నాయి. శ్రేణి అంటే ఒక వర్గం ఒకే వృత్తి కలిగిన వివిధ కుటుంబాలను శ్రేణి అని పిలిచే వారు. ఈ శ్రేణి పెద్దనే శ్రేష్ఠి అంటారు. శ్రేష్ఠుడు, శ్రేష్ఠి అనే పదమే వాడుకలో "శెట్టి" అనే పదంగా స్థిరపడింది. ఆ విధంగా శ్రేణులే కులాలు గా ఏర్పడడం కుల పెద్దలే శ్రేష్ఠులుగా వుండే వారు. వారినే కులశెట్టి గా పిలిచేవారు.

ఉదాహరణకు :- చాకలిశెట్టి, మంగలిశెట్టి, కుమ్మరిశెట్టి అనే వ్యవహార పదాలు.

"సమయం" అంటే ఏమిటి?

"సమయం" అంటే తెలుగు నిఘంటువులలో వున్న అర్థం యూనియన్ (సమూహం)అని అర్థం.

సమయం :- వ్యవధి, వేళ, తగిన కాలం, శపథం, ఆజ్ఞ, సిద్ధాంతం,బుద్ధి, ఆచారం, సంకేతం, ఒప్పుకోలు, సంపద, నియమం. అనే అర్థాలు వున్నాయి.

సమయజ్ఞుడు :- సమయం తెలిసిన వాడు, ఆచారం తెలిసిన వాడు

సమయ పరిరక్షణ :- ఒడంబడికను పాటించడం.

భావ సారూప్యత కలిగిన పూర్వాచార కులాలన్నీ ఒక సమూహంగా, వామాచార కులాలన్నీ ఒక సమూహంగా ఏర్పడ్డాయి. ఇలా ఏర్పడిన పూర్వాచార కులాల సమూహాలనే శెట్టి సమయాలు అన్నారు. (సమూహం అనే పదం నుండే సమయం అనే పదం పుట్టి వుండవచ్చేమో...)

ఈ శెట్టి సమయాలనే, వీరబలింజ సమయాలు అని శాసనాలలో వ్యవహరించారు. వీరబలింజ ధర్మం అంటే కట్టుబాట్లను ఖచ్చితంగా పాటించడం. తన గుంపులో ఒకరికి అన్యాయం జరిగితే అందరూ వారికి మద్దతునివ్వడం. తమ హక్కుల కొరకు యుద్ధాలు చేయడానికి సైతం వెనుకాడకపోవడం.కుల పంచాయితీలు, వ్యక్తిగత సమస్యలు పరిష్కరించుకోవడం. తమకు వ్యతిరేకంగా చట్టాలు చేసి పన్నులు వేసిన రాజులను సైతం గద్దె దించడం. కులసంకరాలను వ్యతిరేకించడం వంటి కట్టుబాట్లు హక్కుల పరిరక్షణే వీరబలింజ ధర్మం..

వీరబలింజ సమయాలు అంటే వీరబలింజ ధర్మాన్ని అనుసరించే కుల సమూహాలు అని చెప్పుకోవాలి. బలింజ లేదా బలిజ అనే పదాలు ‘‘వణిజ‘‘ అనే సంస్కృత పదం నుండి ఉద్భవించినవిగా కనబడుతున్నాయి. (ఇది చాలామంది చరిత్రకారులు వెలిబుచ్చిన అభిప్రాయం ఈ వాదనను తోసి పుచ్చడానికి నాకు సహేతుకమైన కారణాలు కనిపించలేదు) వాణిజ్యం చేసే వారు వణిజులు. అంటే వ్యాపారులు. కొన్ని భాషలలో ‘వ‘ అనే శబ్దం ‘బ‘ గా మారిని సందర్భాలు కనిపిస్తాయి. మనం తెలుగులో ‘రవీంద్రనాథఠాగూర్‘ అనే పదాన్ని బెంగాలీలో ‘రబీంద్రనాథఠాగూర్‘ అనడం గమనించవచ్చు. ఆ విధంగానే ‘‘వణిజ‘‘ అనే పదం బణిజ, బణిజిగ, బలింజ, బలిజ, అనే పదాలుగా పరిణామం చెంది వుండవచ్చు. ఈ క్రమంలోనే ఈ సమయాల్లో వుండే చాలా కులాలు తమ కులం చివరన బలిజ అని చేర్చుకోవడం కనిపిస్తుంది. (ఆధారం 1901 మద్రాస్ సెన్సస్ రిపోర్టు, థర్‌స్టన్-కేస్ట్స్ ఆండ్ ట్రైబ్స్ ఆఫ్ సౌత్ ఇండియా).

శెట్టి సమయాలు చట్టాలు చేశాయి ఆ చట్టాలే కులాల కట్టుబాట్లు, హద్దులు. పరిపాలనను నిర్వహించాయి. పన్నులు వసూలుచేయడం, వర్తక వాణిజ్యాలను నిర్వహించడం, తగాదాలు పరిష్కరించడం వంటి పనులన్నీ శెట్టి సమయాలే చేశాయి. వాస్తవానికి నాటి రాజులు కూడా శెట్టి సమయాలలో అంతర్భాగాలే తప్ప బయటివారు కాదు. ఈ కట్టుబాట్లకు వారు అతీతులేం కాదు. వీరు చేసే ఏ పనైనా అంతిమంగా ధర్మాన్ని రక్షించేదిగా వుండేది. తనకు అన్యాయం జరిగితే ప్రశ్నించే హక్కు ప్రతి సామాన్యుడికీ వుండేది. వృత్తుల వారీగా కులాలు ఏర్పడితే, ఆ కులాల మధ్య పోటీ లేకుండా అద్భుతమైన పని విభజనతో ఎవరి విధులను వారికి కేటాయించి సర్వజనసామరస్యాన్ని వేల

సంవత్సరాల క్రితమే భారతీయులు సాధించారు. అందుకే భారతదేశం భూగోళంపైన వున్న అన్ని దేశాలకంటే ముందు వుండగలిగింది.

ఈ శెట్టి సమయాలు క్రీ.శ. మొదటి శతాబ్దం వాడైన కరికాళచోళుని కాలంలో ఏర్పడినట్లు కొన్ని ఆధారాలు కనిపిస్తున్నప్పటికీ కరికాళ చోళుని కంటే ముందే ఈ సమయాలు వున్నట్లు తెలుస్తోంది. క్రీస్తుకు పూర్వమే శెట్టి, శ్రేణులు అనే పదాలు పలు శాసనాలలో కనిపిస్తాయి. (ఆధారం ఆంధ్ర ప్రదేశ్ సమగ్ర చరిత్ర - సంస్కృతి-2, తొలి చారిత్రక ఆంధ్రప్రదేశ్, క్రీ.పూ.500 నుండి క్రీ.శ 624 దాకా, పేజీ నెం. 20) కానీ శెట్టి సమయాలు కరికాళ చోళుడు ఏర్పాటు చేశాడు అని చాలా వంది గ్రంథకర్తలు అభిప్రాయపడుతున్నారు. కానీ అది వాస్తవం అయి వుండకపోవచ్చు బహుశా కరికాళ చోళుని కాలంలో జరిగిన మహానాడులో కొన్ని కట్టుబాట్లు, వాటిల్లో సవరణలు ఏర్పడి వుండవచ్చు. అతి ప్రాచీనమైన ఈ ఆధారాల కంటే ముందు వున్న ఆధారాలు లభించక పోవడంతో వారు ఆ అభిప్రాయానికి వచ్చి వుండవచ్చు. ఏది ఏమైనా శెట్టి సమయాలు అతి ప్రాచీన భారతీయ వ్యవస్థలు అని చెప్పడానికి నేను గర్విస్తున్నాను.

కులం చాలా అధునాతన వ్యవస్థ

కుల వ్యవస్థ చాలా అధునాతన వ్యవస్థ అన్న విషయాన్ని మనమే అర్థం చేసుకోలేక పోతున్నాము. కుల వ్యవస్థ ఒక అద్భుతమైన పని విభజన ఒకరికి మరొకరు పోటీ లేకుండా ఎవరి బాధ్యతలు వారే నిర్వహించే విధంగా కులవ్యవస్థ నిర్మించబడింది. నిజానికి ఇది చాలా ఆరోగ్యకరమైన వ్యవస్థ కానీ సమాజంలో అసమతుల్యత ఏర్పడడానికి కారణం మనుషుల ప్రవర్తనలే తప్ప మరొకటి కాదు. ఒకరు తక్కువ, ఒకరు ఎక్కువ అనే వ్యవహారమే నాటి వ్యవస్థలో ఏర్పాటు చేయబడలేదు. కాల క్రమేణా మనుషులలో ఏర్పడే అహంభావాలు సాటి మనిషిని మనిషిగా చూడలేని స్థితికి దిగజార్చాయి. అందువల్లనే పెద్ద కులాలు, చిన్న కులాలు అన్న అంతరాలు ఏర్పడ్డాయి. నిజానికి ప్రాచీన భారతీయ కుల వ్యవస్థలో పెద్దా, చిన్న అన్న భావనలు లేవు. (ఇప్పటి వ్యవస్థలో సైతం ఇలాంటి వ్యవహారాలు మనకు చాలా కనిపిస్తాయి. రిజర్వేషన్ వల్ల

ఉన్నతోద్యోగం సంపాదించుకున్న వ్యక్తి తన క్రింది సిబ్బందిని ప్రొటోకాల్ పేరుతో అణచిపెట్టడం కనిపిస్తుంది. ఇలాంటి వ్యవహారాలు వ్యక్తులకు ప్రవర్తనలకు సంబంధించినవే కానీ వ్యవస్థకు సంబంధించినవి కావు). వ్యక్తుల స్వార్థపూరిత తత్వాన్ని వీలైనంత తగ్గించి ముందుకు సాగే వ్యవస్థే అత్యున్నత వ్యవస్థ. ఏది ఏమైనా ఇప్పటి వరకు కులవ్యవస్థ ఏర్పాటు గురించి సరైన నిర్వచనాలు రాలేదనే నేను భావిస్తున్నాను. నా దృక్కోణంలో కులవ్యవస్థ గురించి వివరించడానికి ప్రయత్నిస్తాను.

లక్షణాలు అనువంశికంగా సంక్రమిస్తాయని "గ్రెగర్ జోహాన్ మెండల్" ప్రతిపాదనల తరువాతనే ఆధునిక ప్రపంచానికి తెలిసింది. 19 వ శతాబ్దం వరకు పాశ్చాత్య ప్రపంచానికి ఈ విషయం తెలియదు.

కానీ ప్రాచీన భారతీయులకు కొన్ని వేల సంవత్సరాల క్రితమే ఈ విషయం తెలుసు.

ఇక్కడ వృత్తులు కుటీర పరిశ్రమలు. వృత్తుల వారీగా కులాలు ఏర్పడ్డాయి. ఇక్కడ ప్రతి కులానికీ ప్రత్యేక వృత్తి వుండేది. ఈ వృత్తి నైపుణ్యం ఒక తరం నుండి మరో తరానికి సంక్రమిస్తుంది. అందుకే వృత్తుల వారీగా కుటుంబాలు ఏర్పడ్డాయి. కుటుంబాలు కులంగా వృద్ధి చెందాయి.

ఇక్కడ మనం ఒక చిన్న విషయం గమనించాలి.

వ్యవసాయంలో విత్తనాల గురించి మాట్లాడేటప్పుడు జన్యుస్వచ్ఛత గురించి మాట్లాడతాము. వరి విత్తనాన్ని అభివృద్ధి చేసే క్షేత్రంలో ప్రక్కన మరో వంగడాన్ని సాగు చేయరు ఎందుకంటే సంకరం జరిగితే ఆ విత్తనం తన సహజ లక్షణాలను కోల్పోతుంది.

ఇక్కడ కూడా కులాలు కుల సంకరం జరిగితే వృత్తినైపుణ్యం కోల్పోతారు. అందువల్లనే కులసంకరాన్ని చాలా కులాలు కఠినంగా నిషేధించాయి.

అలా ఈ దేశంలో కులాలు జీవం పోసుకున్నాయి. ఇది ఎప్పుడు జరిగిందో చెప్పడం నిజానికి చాలా కష్టం.

భారతదేశం లో కులం లేకుండా చరిత్రలేదు. కొన్ని ప్రసార మాధ్యమాలు కులం వెనుకబాటుతనం కులం గోడల్ని బద్దలు కొడదాం అంటూ చేసే ప్రచారాలు చూస్తున్నప్పుడు నాకు నిజంగా నవ్వు వస్తుంది. నిజంగా కులం వెనుకబాటుతనమా...? కులం గోడలు లేని దేశాలు మనకంటే ముందు

న్నాయా...? ఇవి మన స్వంత పదాలా లేక విదేశీయుల గళాల నుండి పెల్లుబికిన విషపు బాంధాలా...? ఈదేశంలో కులాలను, కట్టుబాట్లను భ్రష్మ పట్టించడం ఈ తెల్ల మానస పుత్రులకు సాధ్య మౌతుందా...? ఈ దేశం లో ఇంకా కొన్ని వేల సంవత్సరాలకైనా కులం గోడలను బ్రద్దలు కొట్టడం సాధ్యపడుతుందా...?

బీజక్షేత్ర సిద్ధాంతం

తెలుగు వారిలో ప్రతి వ్యక్తికీ ఇంటి పేరు వుంటుంది. ఇది ఖచ్చితంగా తండ్రిదే అయి వుంటుంది. తల్లి ఇంటి పేరు పిల్లలకు సంక్రమించదు. ఆడ పిల్లలకు పెళ్లయ్యేంతవరకు తండ్రి ఇంటి పేరు ఆ తరువాత భర్త ఇంటి పేరు వస్తుంది. ఎందుకు ఇలా ఏర్పాటు చేశారు?

విత్తనం ఏ మొక్కదైతే ఆ విత్తనం లోనుండి ఆ మొక్కే జన్మిస్తుంది. అంటే మొక్క విత్తనాన్కి సంబంధించిందే కానీ నేలకు సంబంధించింది కాదు. ఇక్కడ పురుషుడు విత్తనం, స్త్రీ క్షేత్రం. దీన్నే బీజక్షేత్ర సిద్ధాంతం అంటారు.

ఇదే సూత్రం మనుష్యులకు కూడా వర్తిస్తుందని ఋషులు గుర్తించారు. అందుకే ఇక్కడ పితృస్వామ్యం వర్థిల్లింది. మొక్క విత్తనానికి చెందినదైతే క్షేత్రం ఎలాంటి ప్రభావం చూపించదా అంటే ఖచ్చితంగా చూపిస్తుంది. నేల మంచిదైతేనే మొక్క ఆరోగ్యంగా బలంగా పెరుగుతుంది. అదే విధంగా తల్లి నుండి కూడా జన్యువులు సంక్రమిస్తాయని మన పెద్దలు తెలుసుకున్నారు. దాని కారణంగానే ఒకే రకమైన వృత్తుల వారి మధ్యే వివాహ సంబంధాలు వుండే విధంగా చర్యలు తీసుకున్నారు. దాని విధి విధానాలు కూడా ఏర్పాటు చేశారు. జన్యుపరంగా ఏర్పడే సమస్యల పై కూడా భారతీయులకు ఖచ్చితమైన అవగాహన వుంది. వివాహం ఎవరెవరికి జరగాలి, ఎవరెవరికి జరగకూడదు అన్న విధానం ప్రపంచం లోనే అత్యంత భిన్నమైనది. స్వగోత్రీకుల మధ్య వివాహం నిషిద్ధం. కాలక్రమేణా కుటుంబాలు పెరిగి దూరమైనా ఒకే రక్త సంబంధీకుల మధ్య వివాహం జరగ కూడదన్న కారణంతో గోత్రాలను ఏర్పాటు చేశారు. కులము, గోత్రము ఈ రెండూ వివాహ వ్యవస్థను పటిష్టం చేశాయి (ఈ వివాహ వ్యవస్థే నేడు ప్రపంచ దేశాల ముందు భారతావనిని అత్యున్నత స్థానంలో నిలిపింది).

గోత్ర వ్యవస్థ

ప్రతి కుటుంబానికీ గోత్రం వుంటుంది. అసలు ఈ గోత్రాలేంటి అనే సందేహాలు చాలామందికి వుంటాయి. గోత్ర పరంపరను వంశాలుగా చాలామంది చెప్పుకుంటుంటారు. కానీ అది వంశాలకు సంబంధించినది గా కనిపించదు. జాగ్రత్తగా పరిశీలిస్తే ఇది గురుపరంపరగా కనిపిస్తుంది. వసిష్ఠ, భరద్వాజ, అత్రేయ, కౌశిక వంటి సప్తర్షి గోత్రాలు ఎక్కువగా బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలను అనుసరించిన కులాలలో ఎక్కువగా కనిపిస్తాయి. దీనిని బట్టి ఇది గురుపరంపర అయివుండవచ్చని అనుకుంటున్నాను.

ఇతర కులాలలో గవనించినప్పుడు రకరకాల వస్తువులపేర్లు కనిపిస్తాయి. ఎందుకిలా అంటే పూజల సందర్భాలలో గోత్రం తెలియని వారికి పూజారులు ఏదో ఒక గోత్రాన్ని అంటగట్టేస్తారని విమర్శలు కూడా వున్నాయి. ఇది కూడా వాస్తవమే. ఎలా ఏర్పాటు అయినా కానీ గోత్రనామం వల్ల నష్టమనేది జరగదు. ఒకే వంశం వారికి ఒకే గోత్రం వుంటుంది. కాలగమనం లో ఆ వంశం విస్తరించి వారు సుదూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు వారి ఇంటిపేర్లు మారిపోయే అవకాశాలు ఎక్కువగా వుంటాయి. ఉదాహరణకు వెలుగోడు నుండి వలస వెళ్లిన వారు వెలుగోటి వారయ్యారు. నంద్యాల నుండి వలస వెళ్లిన వారు నంద్యాల వారయ్యారు. ఇంటి పేరు మారినా గోత్రం వల్ల వారి వంశాన్ని తెలుసుకునే అవకాశం వుంటుంది.

కులం ఒకటే అయివుండి రక్తసంబంధీకులు అయివుండి దూరం కావడంవల్ల ఇంటిపేర్లు మారిపోయిన వారు స్వంత రక్తసంబంధీకులతో వివాహం చేసుకునే సందర్భం ఏర్పడి నప్పుడు ఈ గోత్రం ద్వారా వారిని గుర్తించడం సాధ్యపడుతుంది. స్వగోత్రీకులు కావడంతో వారు ఒకే కుటుంబం అయివుండే అవకాశాలు ఎక్కువగా వుండడంతో వారి మధ్య వివాహం జరిగే ప్రమాదాన్ని నివారించే వీలు వుంటుంది. అందు వల్లనే ప్రాచీన శాసనాలలో వంశం, గోత్రాన్ని మాత్రమే చెప్పుకున్నట్లు కనిపిస్తుంది. ఇంటిపేర్లు అంతగా కనిపించవు. ఈ గోత్ర నామాలు వివాహ వ్యవస్థను పటిష్ఠం చేయడానికే ఏర్పాటు చేసినట్లు కనిపిస్తోంది.

ఏ వృత్తి చేసే వారి పిల్లలు అదే వృత్తిని స్వీకరించాలి అనే నియమం వున్నప్పటికీ అది బలవంతంగా అమలు జరిగిన దాఖలాలు కనిపించవు. కానీ తండ్రి వృత్తి ని కొనసాగించాల్సిన బాధ్యత మాత్రం పిల్లలకు వుండేది. తండ్రి తరతరాలుగా తనకు సంక్రమించిన వృత్తి నైపుణ్యాన్ని (టెక్నిక్‌ను) తన పిల్లలకు అందజేసేవాడు. ఇతరులకు చెప్పేవారు కాదు. అలా ఆయా కుటుంబాలు మాత్రమే ఆయా రంగాల లో నైపుణ్యం కలిగివుండేవారు. దీని వల్ల అనేక కళాఖండాల తయారీ సంబంధిత కుటుంబాలకు మాత్రమే పరిమితమై పోయింది.

ఇలా ఒకే వృత్తి కలిగి బంధుత్వాలు కలిగిన అనేక కుటుంబాలు ఒక కులంగా ఏర్పడ్డాయి.

ఆ కాలంలో ఒకే వృత్తి కలిగిన కులాలు చాలా వుండేవి. వీరిలో పరస్పరం వృత్తి పరమైన అసూయ,ద్వేషం సహజంగా ఏర్పడుతుండేవి.

వారు తయారు చేసిన ఉత్పత్తులను అమ్ముకునే క్రమంలో ఘర్షణలకు సైతం వెనుకాడే వారు కాదు. వృత్తి కళాకారుల మధ్య ఏర్పడే ఘర్షణలు, వైషమ్యాలు కులాలు వర్గాలుగా చీలిపోవడానికి కారణమయ్యాయి. అలా ఏర్పడినవే కుడి, ఎడమచేతి కులాలు.

ఈ రెండు వర్గాలు కులాల సమూహాలు. భావసారూప్యత కలిగిన వారు ఒకటయ్యారు. ఈ వర్గాలు పటిష్టంగా వుండడానికి వారి మధ్య తలెత్తే భేధాభిప్రాయాలను నివారించడానికి వారి మధ్య రాజీ ఒప్పందాలు ఏర్పడానికి ప్రశాంతమై జీవనం కొరకు సమయాలు ఏర్పడ్డాయి.

కులము - వర్ణము

కులము, వర్ణము అనే వాటి గురించి చాలామంది లో అనేక ఆపోహలున్నాయి. వాస్తవానికి కులం వేరు, వర్ణం వేరు. ఒకే వృత్తి చేసే వివిధ కుటుంబాల సమూహం కులమైతే ఒకే ధర్మానికి కట్టుబడిన కులాల సమూహం వర్ణం. ఇది చాలామంది కి కొంత గందరగోళంగా అనిపించ వచ్చు నాకు చేతనైనంతలో వివరించడానికి ప్రయత్నిస్తాను.

జన్మనాజాయతే శూద్రః
కర్మణాజాయతే ద్విజః
వేదపఠనంతు విప్రానాం
బ్రహ్మజ్ఞానంతు బ్రాహ్మణే
అంటే జన్మించుట వలన ప్రతి ఒక్కడూ శూద్రుడుగానే జన్మిస్తాడు.
కర్మలు చేయుటవల్ల ద్విజుడగుచున్నాడు
వేదాలు పఠించిన వాడు విప్రుడు అని పిలువబడుతాడు
బ్రహ్మజ్ఞానం సంపాదించిన వారు బ్రాహ్మణులు

ఉపనయనం ద్వారా జంధ్యాన్ని ధరించడం, జంధ్యం అంటే కర్మపాశం కర్మపాశం వల్ల బంధనుడై, తాను ఎంచుకున్న కర్మను ఆచరించేవాడే ద్విజుడు. ప్రతి ద్విజుడూ బ్రాహ్మణుడు కాడు.

వేదాధ్యయనం ఆచరించే వారు విప్రులు
బ్రహ్మజ్ఞానం సంపాదించిన వారు బ్రాహ్మణులు
బ్రహ్మ అనే శబ్దానికి అనంతమైన అనే అర్థం వుంది. అనంతమైన విజ్ఞానాన్ని సముపార్జించిన వారే బ్రాహ్మణులు అని అర్థం.

ప్రాచీన వ్యవస్థలో అంటే మనువు కంటే ముందు కేవలం మూడే మూడు వర్ణాలు మాత్రమే వుండేవి. అవి బ్రాహ్మణ, క్షత్రియ,వైశ్య అనే వర్ణాలు మాత్రమే. వాస్తవానికి ఈ వర్ణం అనేది సమాజం పట్ల వారు వారు ఆచరించాల్సిన బాధ్యతలు.

వేదాధ్యయనం, జ్యోతిషం, వైద్యం, విద్యాభివృద్ధి వంటివి నిర్వహించాల్సిన బాధ్యతలు బ్రాహ్మణులవి.

క్షేత్రం అంటే భూమి, భూమి కలిగిన వాడు క్షేత్రీయుడు. ఉపనయనం ద్వారా క్షాత్ర ధర్మాన్ని స్వీకరించి పాటించడం అంటే తన రాజ్య పరిధిలో వుండే ప్రజలను రక్షించడం, వారిని క్రమ పద్ధతిలో నడిపించడం, దుష్టులను శిక్షించడం, శిష్టులను రక్షించడం క్షాత్రధర్మం. దీన్ని ఆచరించే వారు క్షత్రియులు.

వ్యవసాయాన్ని చేయించడం, వృత్తులను ప్రోత్సహించడం, వర్తక వాణిజ్యాలను చేయడం దేశ సంపదను నియంత్రించగలిగిన వ్యవస్థే వైశ్య ధర్మం.

మనువు కంటే ముందు ఈ మూడు వర్ణాశ్రమ ధర్మాలు మాత్రమే

వున్నట్లు తెలుస్తోంది. మనువు కాలం నాటికి ప్రజలు తమ తమ బాధ్యతలను విస్మరించి చరించడం. చాలామంది సంధ్యానుష్ఠానాలను ఆచరించకుండా చరించడం జరిగివుండవచ్చు. ఈ క్రమంలోనే ప్రజలు కట్టుబాట్లను విస్మరిస్తున్నారని మనువు భావించాడు. వీరిని మళ్లీ క్రమబద్ధీకరించినదే మను ధర్మశాస్త్రం.

వాస్తవానికి అప్పట్లో ప్రజలందరికీ ఉపనయనం వుండేది. పూర్వసంధ్య, ప్రాతఃసంధ్యలలో క్రమం తప్పకుండా సంధ్యానుష్ఠానాలు చేయవలసి వుండేది. ఎన్ని పనులున్నా ప్రక్కకు పెట్టి సంధ్యానుష్ఠాలను ఆచరించాల్సివుండేది. దీంతో వ్యవసాయం, ఇతర వృత్తులు చేసే వైశ్యులు చాలామందికి ఈ విధానం ఇబ్బంది కలిగించి వుండవచ్చు. ఎందుకంటే వ్యవసాయదారుడు ఉదయం తెల్లవారక మునుపే పొలం దగ్గర వుండేవాడు. సాయంత్రం పొద్దుపోయిన తరువాత ఇంటికి చేరే వాడు. ఈ క్రమంలో సంధ్యానుష్ఠానాలు ఇబ్బందిగా పరిణమించి వుండవచ్చు.

కర్మానుష్ఠానాలను అచరించడం లో కలుగుతున్న ఇబ్బందుల వల్ల చాలామంది వాటిని ప్రతిబంధకంగా భావించి వుండవచ్చు, వాటి ఆచరణను అలక్ష్యం చేసి వుండవచ్చు. ఈ ఇబ్బందుల వల్లనే త్రివర్ణ వ్యవస్థను మనువు చాతుర్వర్ణ వ్యవస్థగా సంస్కరించి వుండవచ్చు. వ్యవసాయం ఇతర వృత్తులు చేసేవారికి సంధ్యానుష్ఠానాలు ఆచరించడం లో కలుగుతున్న ఇబ్బందులను గమనించి వారికి ఉపనయనం అవసరం లేదని వుండవచ్చు ఈ క్రమంలో మూడు వర్ణాలు నాలుగుగా మారి నాలుగవ వర్ణానికి ఉపనయనం లేకుండా శూద్ర వర్ణంగా ఏర్పాటు చేసివుంటారు.

(విష్ణువు ముఖం నుండి బ్రాహ్మణులు, భుజముల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు జన్మించారని అంటుంటారు. బహుశా ఈ వర్ణన వక్రీకరణ అయి వుంటుంది. వ్యవస్థ ఒక మానవాకృతి అయితే చాతుర్వర్ణ వ్యవస్థ అందులోని నాలుగు ప్రధాన అవయవాల వంటిది అని వర్ణించాలి. ఎందుకంటే బ్రాహ్మణ వర్ణం వినడం, చూడడం, జ్ఞానాన్ని సముపార్జించడం, నిక్షిప్తం చేయడం వంటి భాధ్యతలను కలిగివుంది. విద్య, జ్ఞాన సముపార్జన చేసే వర్ణం బ్రాహ్మణులు. శరీరంలో ఇలాంటి బాధ్యతలను

చేసే అవయవం తల కాబట్టి దానితో పోల్చవచ్చు.

ఇక సమాజ రక్షణ శరీరాన్ని రక్షించేవి చేతులు కనుక సమాజాన్ని రక్షించే బాధ్యత క్షత్రియులది కనుక వీరు భుజములవంటివారు. ఆర్థిక పరిపుష్టి వాణిజ్యం వల్ల కలుగుతుంది. శరీరము బరువు మొత్తం బలమైన తొడలపై ఆధారపడి వుంటుంది కనుక వాణిజ్య వ్యవస్థను తొడలతో పోల్చారు. ఇక చివరిదైన శూద్రం పాదాల వంటిది పాదాలు లేని శరీరం స్థిరంగా నిలబడలేదు. (అతి తక్కువ స్థలాన్ని మాత్రమే ఉపయోగించుకుని అతి పెద్ద శరీరాన్ని పడిపోకుండా నిలబెట్టేవి మానవ పాదాలు. ఇలాంటి సౌలభ్యం సృష్టిలో మరేజీవికీ లేదు. మరి ఇంతటి ప్రాధాన్యత కలిగిన పాదాలు మిగిలిన అవయవాలకంటే ఎలా తక్కువ అవుతాయి...?) ఇలా శరీరంలోని అవయవాలతో వ్యవస్థలను పోల్చారు. వాస్తవానికి ఇందులో ఏ అవయవమూ తక్కువ కాదు ఏ అవయవమూ ఎక్కువ కాదు. పైన వున్న తల గొప్పదని క్రింద వున్న పాదాలు తక్కువ అని అన్నారంటే వారు చాతుర్వర్ణ వ్యవస్థను సరిగా అర్థం చేసుకోలేక వక్రీకరిస్తున్నారని అనుకోవాల్సి వుంటుంది.)

ఇలా ఏర్పడిన చాతుర్వర్ణ వ్యవస్థ కేవలం వైదిక మత కాలంలో మాత్రమే తన ఉనికిని నిలుపుకున్నట్లు కనిపిస్తుంది. తరువాత బౌద్ధం, జైనం వంటి మతాలు చాతుర్వర్ణ వ్యవస్థను ప్రక్కకు నెట్టి వేశాయి. బౌద్ధం రాజ్యమేలిన కాలంలో ఈ చాతుర్వర్ణ వ్యవస్థకు సమాజంలో పెద్దగా ప్రాధాన్యత వున్నట్లు కనిపించదు.

అందుకే అప్పటి రాజులు ఉపనయనం లేకుండానే రాజ్యాలు చేశారు. వర్ణాలు లేక పోయినా ఈ కాలంలో కులాలు మాత్రం యథావిధిగానే కొనసాగాయి.

రాజులు తాము క్షత్రియులము అని చెప్పుకోలేదు. కానీ అదే వంశాలే రాజ్యాలు ఏలాయి. అలా యజ్ఞోపవితానికి దూరమైన క్షత్రియులు వీరశైవం, విశిష్టాద్వైతం, అద్వైతం నాటి వరకు యజ్ఞోపవీతాలు లేకుండానే కొనసాగారు. ఆ తరువాత బౌద్ధం, జైనం కనుమరుగవగా మళ్లీ వేదమతం తన సరికొత్త రూపంతో జన బాహుళ్యంలోకి వచ్చింది. అలా కొనసాగిన రాజవంశాలే కాకతీయులు, విజయనగర, మధుర, తంజావూరు రాజులు.

ఇలా ఎందరో రాజులు తాము చంద్ర, సూర్య వంశాలకు చెందిన వారిగా చెప్పుకున్నారు కానీ యజ్ఞోపవీతాలు లేకుండా సచ్ఛూద్రులు గానే రాజ్యాలేలారు. ఈ పరంపరను అర్థం చేసుకోలేని చాలామంది చరిత్రకారులు క్షత్రియత్వాన్ని కులంగా భావించడం వల్ల పై రాజులందరినీ శూద్రులుగా పరిగణించారు. కులం ఒకటే అయినప్పటికీ వివిధ వర్ణాశ్రమ ధర్మాలను ఆచరించిన దాఖలాలు చాలా కనిపిస్తాయి.

అయినా ఇక్కడ మను ధర్మ శాస్త్రాన్ని యథాతథంగా ఆచరించడం కనిపించదు. క్షత్రియ అనేది కులమే అయి వుంటే నేడు అత్యధిక జనాభా కలిగిన కులంగా వుండాల్సి వచ్చేది. వాస్తవానికి క్షత్రియులు ఒక కులంగా తమను తాము విడదీసుకున్న కాలం కేవలం మూడు వందల సంవత్సరాలకు మించి వుండకపోవచ్చు. కులసంకరం కలిగిన రాజులను ఇక్కడి సమాజం అంగీకరించేది కాదు... అన్న వాస్తవాన్ని మనం ఒప్పుకుని తీరాల్సిందే.

కాకతీయుల కాలంలోని చాలా శాసనాలలో "చాతుర్వర్ణ సముద్ధరణ" అనే బిరుదులు కనిపిస్తాయి. బౌద్ధ, జైన మతాల అనంతరం వేదమతం వేళ్లు పాదుకుంటున్న సమయంలో మళ్లీ చాతుర్వర్ణ వ్యవస్థను అమలు చేయడానికి ప్రయత్నం జరిగివుండవచ్చని తెలుస్తోంది. ఆ కాలంలోనే రాజులకు ఉపనయనం చేసి వివిధ రాజవంశాలను వారికి అంటగట్టారన్న విమర్శకుల వాదనలో కూడా కొంత నిజమున్నట్లు తెలుస్తోంది.

పూర్వాచార, వామాచార కులాలు

ప్రాచీన ఋషులు ఏర్పరిచిన ఆచారాలను తు.చ తప్పకుండా పాటించడం, ఒక క్రమబద్ధమైన జీవన విధానాన్ని, కట్టుబాట్లను పాటించే కులాలను పూర్వాచార కులాలని, ధైవాచార కులాలని, మహానాటి వారని, కుడిచేతి వారని పిలిచేవారు.

ప్రాచీన ఆచారాలు, కట్టుబాట్లు అన్నీ పాటించాల్సిన అవసరం ఏమీ లేదు అంటూ ఆధునిక పోకడల కు పోయిన కులాలను వామాచార కులాలు అని పిలిచేవారు. హేతుబద్ధంగా పరిశీలించినప్పుడు సభ్య మతాచారాలు ఆచరించేవారిని పూర్వాచార పరాయణులు అని తాంత్రిక పద్ధతులను ఆచరించేవారిని

వామాచారులని అన్నట్లు తెలుస్తోంది. మతాచారాలను అనుసరించే మొదటి దశలోనే ఈ బేధాలు ఏర్పడి వుండవచ్చు. పూర్వాచారాలను పాటించేవారినే దేవాచార, మహానాటి,కుడిచేతి కులాలని పిలిచారు. వామాచారాలను పాటించేవారినే ఎడమచేతి కులాలుగా పరిగణించినట్లు తెలుస్తోంది.

ఈ కుడి ఎడమ కులాలనే తమిళంలో ''వలంగై'' ''ఇడంగై'' అని పిలిచే వారు.

(కరికాళ చోళుని కాలంలో బలిజ కులస్తులు, పాంచాననం వారు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణలు పడుతుండగా బలిజ వారి వైపు కొన్ని కులాలు, పాంచాననం వారి వైపు కొన్ని కులాలు విడిపోయి ఈ గొడవల్లో పాల్గొన్నారని వారి మధ్య సయోధ్య కుదిర్చిన కరికాళ చోళుడు కుడిచేత్తో తాంబూలం ఒకరికి, ఎడమచేత్తో తాంబూలం ఒక వర్గానికి ఇవ్వడం వల్ల వారు కుడి, ఎడమ కులాలుగా పిలువ బడ్డారనే కథలు ప్రచారం లో వున్నాయి, బహుశా ఇది కూడా కట్టుకథ అయి వుండవచ్చు).

పూర్వం కులాలపై ఆధిపత్యం రథకారులకు ఉండేది.

ఈ కుడి ఎడమ కులాల గురించి ప్రాఁచీన గ్రంథాలలో వున్న విశేషాలను ఒక్కసారి పరిశీలిద్దాం.

కుడి, ఎడమ కులాల గురించి గౌరీపుత్ర చరిత్ర

గౌరీపుత్ర చరిత్రము ఈ విధంగా చెబుతోంది.

గర్వముతో విర్రవీగే వాడు, వర్ణసంకరుడు, అయిన రథకారుడు ఒకడు కాశీ మొదలైన క్షేత్రములను తిరుగుతుండగా ఒక చోట రాక్షస శిల్పాచార్యుడు మయుడు కనిపించాడు. అంతలో రథకారుడు ఆయనకు నమస్కరించి ఆయన వద్ద శిష్యుడిగా చేరాడు. ఆయన నుండి సకల శిల్పవిద్యా రహస్యాలను గ్రహించాడు. ఆ తరువాత మయుడి పైనే తిరుగబడి, నిందించి తిరస్కరించాడు. దీంతో మయుడు కోపించి ''ఓరీ మూర్ఖా నావలన విద్యలనెల్లనూ గ్రహించి గురువునైన నన్ను ధూషించితివి. ఈ పాపము వలన నీవు లోకములన్నిం టిలోనూ ధూషింపబడతావు. నావిద్యలు నీకు ఫలించకపోవుగాక'' అని

శపించాడు. శాపతప్తుండైన రథకారుడు అనేక దేశాలూ తిరుగుతూ ఒక రోజు హిమాలయాలలో తిరుగుతుండగా అక్కడ హిమవంతుని పుత్రియైన గిరిజ చెలికత్తెలతో విహరిస్తూ వుండడం గమనించాడు. ఆమె వద్దకు వెళ్లి తన వద్ద వున్న నవరత్నఖచితములైన భూషణములను ఆమెకు సమర్పించి చేతులు జోడించి తల్లీ నాకు సకల దేశాధిపత్యపట్టంబును ప్రసాదించమని వేడుకున్నాడు. అప్పుడు గౌరీదేవి అతడిని చూసి '' నిన్ను చూడగా గురుశాపం తో, అతి దుష్టత్వంతో ప్రవర్తిస్తున్నట్లు తోచుచున్నది, నీవుఅట్టి పదవికి అర్హుడవు కావు. అయినా నీవు నీ దుష్టత్వమును వదలి సచ్చరిత్రునిగా ప్రవర్తించినట్లయితే నీవు కోరినట్లు నీకు దేశాధినాథపట్టం సమకూరును'' అని వ్యాఖ్యానించింది. అలా గౌరీదేవి ఇచ్చిన దేశాధిపత్య పట్టమును నుదుట ధరించి సకల భూమండల మంతా తిరుగుతూ అమితమైన గర్వంతో రథకారుడు తిరుగుతుండేవాడు.

ఇంతలో పరమశివుడు అమ్మవారిని చూడడం అయ్యవారితో కళ్యాణం జరగడం వెనువెంటనే జరిగిపోయాయి. కైలాసంలో తీరికగా వున్న సమయంలో అమ్మవారు మంగళ వస్తుసముదాయములను ధరించాలనే కోరికతో గౌరీపుత్రుని తలచుకొంది. ఆమె తలచుకున్న మరుక్షణమే అమ్మవారి సన్నిధికి వచ్చిన గౌరీపుత్రుడు అమ్మవారి పాదాలకు నమస్కరించాడు. భయభక్తులతో రెండుచేతులూ నుదుటిని తాకుతుండగా వినయంగా తల్లీ నాపై పుత్ర వాత్సల్యముంచి నాపలుకులను అంగీకరించి మన్నించాలని వేడుకున్నాడు. నేను మీకు అత్యంత ఆప్తుడైన పుత్రుడనై వుండగా కనకమయ భూషణములను మీకు ఇచ్చిన అల్పుడైన రథకారునికి దేశాధిపత్యం ఇవ్వడం సమంజసమా తల్లీ అని ప్రార్థించాడు. అనంతరం గాజులు, పసుపు కుంకుమ, నల్లపూసలు, కస్తూరి,పునుగు,జవ్వాది వంటి సుగంధ ద్రవ్యాలను, నవరత్న ఖచితమైన ఒక చిన్న పెట్టెను ఇచ్చి వినయంగా నమస్కరించాడు. వాటన్నింటినీ అలంకరించుకున్న అమ్మవారు సంతోషంతో కూర్చుని యుండగా త్రిలోక సంచారి అయిన నారదుడు అక్కడికి వచ్చి అమ్మవారికి నమస్కరించి ఆసీనవుతుండగా రథకారుడు అతి వేగంగా కోపంతో అక్కడికి వచ్చాడు. తాను అమ్మవారికి ఇచ్చిన మణిమయ ఆభరణాలు గౌరీపుత్రుడు సమర్పించిన మంగళకరమైన వస్తువుల ముందు వెలవెల బోతుండడం గమనించాడు. గౌరీ పుత్రుని పట్ల

అసూయాపరుడై ఎలాగైనా అతడిని అవమానించాలని గర్వోద్రేకముతో కన్నుల నుండి నిప్పులు రాలుతుండగా కోపంతో గౌరీపుత్రుని గాజుల మలారం ను పట్టుకుని "ఓరీ బలిజకులాధవమా నేను సకల దేశాధిపత్యంబును వహించియుండ నా యుత్తరము లేక నిమ్మలారమును ఇచ్చటికి దెచ్చితివి గాన దీనికి సుంకము గట్టి పిమ్మట నీ మలారమ్మును గొనిపొమ్ము" అని అతి కఠినంగా మాట్లాడి నిర్బంధించగా ఆ మాటలకు గౌరీపుత్రుడు రోషముతో నీచాధమా తరతరాలుగా ఈ ప్రపంచమంతా తిరుతున్నాము ఎన్నడూ లేనిది మలారమునకు సుంకము కట్టమని అడుగుతున్నావు చాలు మలారమును అక్కడ పెట్టి ప్రక్కకు పొమ్మన్నాడు. దానికి కోపగించిన రథకారుడు గౌరీపుత్రుని తలపై ఒక్కగుద్దు గుద్దాడు. దానితో తోకతొక్కిన కాలనాగువలె గౌరీపుత్రుడు రథకారుని తల పగులగొట్టాడు. దానితో రథకారుడు మూర్ఛపోయాడు. అత్యంత ఆవేశంతో వున్న గౌరీపుత్రుడు తన వద్ద వున్న ఖడ్గంతో రథకారుని తల నరుకబోగా గౌరీదేవి తటాలున లేచి గౌరిపుత్రుని చేతిని పట్టుకుని నిలబెట్టింది. నాయనా నిన్ను ఎదిరించగల వారెవరూ ఈ లోకములో లేరు. నీవనుకున్న భూమి ఆకాశములను తాళపు బిళ్లలుగా జేసి వాయించగల సమర్థుడివి. శాంతించు అని చెప్పగా అమ్మ పాదాలకు నమస్కరించి, ప్రక్కనే వున్న నారదమునికి నమస్కరించి మలారాన్ని భుజాన వేసుకోబోతుండగా మూర్ఛనుండి తేరుకున్న రథకారుడు మళ్లీ గౌరీపుత్రుని పైకి కోపంతో వెళుతుండగా నారద మునీంద్రుడు కోపంతో "ఓరీ మూర్ఖుడా కృతఘ్నుడవు, మదమెక్కి విర్రవీగుతున్నావు, అన్యాయవాదివి, దుష్టవర్తనుడవగుటచే నీకు శాపమిస్తున్నాను వినుము, నీవెల్లప్పుడూ పరులు చెప్పిన పనులు చేయుచూ పట్టణంబులు, యూళ్లను, పల్లెలునూ సంచరించుచూ కల్లలాడుతూ అపకీర్తి నొందుతూ పంచమహాపాతకులలో ఒకడివై మోసకృత్యములచే ఇతరుల ధనములపహరించుచు బ్రతుకుచుందువు గాక" అని శపించాడు. గౌరీ దేవి వైపు చూసి " అమ్మా ఇలాంటి గర్వాంధునికి ఎలా రాజ్యపాలనా,ధికారాన్ని చ్చావు ? అని ప్రశ్నించాడు. అప్పుడు గౌరీదేవి నారదునితో " వీడు అక్రమస్థుడ నియు, క్రూరుండనియు నేను చక్కగా నెరంగినదానను. అతివినయం ధూర్త లక్షణం అను వాక్యానుసారముగా వీడు అతి వినయంతో మాట్లాడితే నీవు

గర్వంతో ప్రవర్తించినట్లయితే నీవు రాజ్యభారాన్ని కోల్పోతావని ముందే హెచ్చరించి వరమిచ్చాను. కనుక వీడు ఇక రాజ్యభారపట్టమును భరియింప అర్హుడు కాడు'' అని చెప్పింది. వెంటనే రథకారుడు నుదుటిపై ధరించిన పట్టము నేలపై పడిపోయింది. అప్పుడు అమ్మవారు తన తనయుడైన గౌరీ పుత్రునితో ఈ పట్టమును ధరించు అనగా అమ్మా సంకర వర్ణుడైన రథకారుడు ధరించిన బిరుదు పట్టమును తలపై ధరించలేననగా నీ యిష్టము వచ్చిన చోట ధరించమని అమ్మవారు ఆజ్ఞ ఇచ్చారు. ఆ పట్టికను గౌరీపుత్రుడు తన మోకాలికి కట్టుకున్నాడు అప్పటి నుండి అతడు ''మోకాలి పట్ట భద్రుడు'' అని పిలువబడ్డాడు. అప్పుడు అమ్మవారు ఎడమచేతితో రథకారుని తోసివేసి ఈ నాటితో నీ అధికారము నేలగలసినది ఫో అన్నది. తన కుడి హస్తముతో బలిజకులాంకడిష్ణుండగు గౌరీపుత్రుని చేరదీసి చుంచుందుమ్మ్వచూ కనికరించింది. అప్పటి నుండి బలిజవారితో చేరిన వారు కుడిచేతి వారనియు, రథకారునితో చేరిన వారు ఎడమచేతి వారనియూ పిలువబడినారు. (గౌరీపుత్ర చరిత్రము)

అమ్మవారి కళ్యాణం జరుతుండగా ఆమెకు అవసరమైన ఆభరణాలను తయారు చేసి ఇవ్వడంలో రథకారులు నిర్లక్ష్యం వహించి పార్వతీదేవి ఆగ్రహానికి గురయ్యారని, అదే సమయంలో నేడు మహిళలు వాడే మట్టి గాజులు, పసుపు, కుంకుమ లను సకాలంలో వినయంగా అందజేసిన బలిజ కులస్తులను అమ్మ వారు దత్తత తీసుకుని కులాలపై అధికారాన్ని రథకారుల నుండి బలిజలకు ఇచ్చిందని అందువల్లనే బలిజలను గౌరీపుత్రులు అంటారని గౌరీపుత్ర చరిత్ర పరమార్థం.

ఈ కథలో నిజానిజాలను ప్రక్కకు పెట్టి హేతుబద్ధంగా తర్కిస్తే ప్రాచీన ఋషులు ఏర్పాటు చేసిన కట్టుబాట్లు, ఆచారాలను యథాతథంగా అనుసరించే వారు పూర్వాచార కులాలు, ధైవాచార కులాలు, మహానాటి కులాల వారిగా పిలువబడ్డారు. వీరే కుడిచేతి కులాలు. వీరి ఆచారాలను, కట్టుబాట్లను వ్యతి రేకించిన వారు వామాచార కులాలుగా పిలువబడ్డారు. ఎందుకంటే పూజలు ఆచారాల వంటివి పూర్వాచారాల కు వ్యతిరేకంగా చేసే వాటిని వామాచారాలుగా పిలుస్తారు. వీటిని అనుసరించే వారిని వామాచార కులాలుగా పిలిచి వుండవచ్చు.

మహానాటి వారి శాసనాలలో కూడా ''పాంచాణనం వారికి ఋషులు

పెట్టిన శాపం వున్నందువల్ల" అనే సందర్భాలు కనిపిస్తాయి. దీన్ని బట్టి మొదట్లో అధికారాన్ని కలిగిన రథకారులు తరువాత కాలంలో అన్ని వర్గాలనుండి వ్యతిరేకతలు ఎదుర్కొని అధికారభ్రష్టులైనారని అనుకోవచ్చు. కట్టుబాట్లే జీవితంగా వినయ సంపన్నతతో గౌరీపుత్రులైన బలిజలు అధికారాన్ని జేజిక్కించుకుని వుండవచ్చు.

ఈ శెట్టి సమయాలు ప్రారంభమయ్యే నాటికి కుడిచేతి వైపు 18 కులాలు, ఎడమచేతివైపు 9 కులాలు వుండేవంటారు. ఆ తరువాత కాలంలో కులాలకు ఉపకులాలు ఏర్పడి 19వ శతాబ్దం నాటికి బ్రిటీషు వారి సర్వే ప్రకారం కుడిచేతి వైపు 60 కులాలు, ఎడమచేతివైపు ఆరు కులాలు మాత్రమే మిగిలాయి.

ఇలా శెట్టి సమయాలు చాలా బలమైన వ్యవస్థలుగా సమాజాన్ని విపరీతంగా ప్రభావితం చేశాయి.

ప్రాచీన శాసనాలలో చప్పన్న దేశాలుగా పిలువబడిన ప్రాంతం మొత్తం ఒకే సంస్కృతి, ఒకే ఆచారాలు, కట్టుబాట్లతో సాగేది.

చప్పన్న దేశాలు (56దేశాలు)

అంగ, వంగ, కళింగ, కాశ్మీర, కాంభోజ, కేదార, కల్హార, కళ్యాణ, కర్ణాటక, కుంతల, కుబ్జ, కేరళ, కైకేయ, కదంబ, హూణ, గౌహతి, గౌడ, ఫ్రిండ, గాంధార, కురు, పాంచాల, నేపాల, భూపాల, అయోధ్య, విదేహ, విదర్భ,బాహ్లిక, హోయసల, పాటలీపుత్ర, ఘూర్జర, బృహద్ధధ, త్రిగర్త, మహారాష్ట్ర, గుజరాత, టెంకణ, కొంకణ, మగధ, మాళవ, రాజస్థాని, అవంతి, యవన, ద్రవిడ, బర్బర,ఛేది, చోళ, పాండ్య, ఉజ్జయిని, హణ, మంగి, వేంగి, బిజ్జల, సౌరాష్ట్ర సింహళ, తుండి, ఉత్కళ, దశార్ణవ అను 56 దేశాలను చప్పన్న దేశాలు అని పిలిచేవారు.

పృథ్వీశెట్టి

ఈ 56 దేశాలలో వుండే ప్రజలకు కట్టుబాట్లు ఎలా ఏర్పాటు చేయాలి? వాటిని ఎవరు అమలు చేయాలి అనే అంశాలపై "మహానాడు" అనే సమావేశాల

లో నిర్ణయాలు చేసేవారు. ఈ మహానాడు లలో 56 దేశాలకు చెందిన రాజ ప్రతినిధులు హాజరై తీర్మానాలు చేసేవారు. ఆ తీర్మానాలను శాసనాలుగా అమలు పరిచేవారు. ఈ మహానాడులలోనే పృధ్వీశెట్టి నియామకం జరిగేది.

ఈ పృధ్వీశెట్టి పదవి లోని వారికి వివిధ దేశాల రాజులు, చక్రవర్తులతో సమానమైన గౌరవం లభించేది. చాలా శాసనాలలో గజపతి, నరపతి, అశ్వపతి సింహాసనాలతో పాటు బలిజ సింహాసనం అన్న సమానార్థక పదాలు కనిపిస్తాయి. 56 దేశాలలో పరిపాలనా యంత్రాగాన్ని, వర్తక వాణిజ్యాలను, పన్నుల వసూళ్లను నిర్వహించే వ్యవస్థ కనుక ఈ గౌరవం దక్కి వుండవచ్చు. యుద్ధాలతో రాజులు మారినా ఈ వ్యవస్థ మారకుండా తన పని తాను చేసుకు పోయేది.

చాలామంది చరిత్రకారులు ఈ " పృధ్వీశెట్టి" అనే పదాన్ని పేరుగా భావించడం జరిగింది. మరి కొందరైతే దాన్ని కేవలం బిరుదుగానే అభిప్రాయపడ్డారు. క్రీ.శ 1240 నాటి చింతపల్లి శాసనంలో మహామండలేశ్వర చాగి దొరయరాజు పృధ్వీశెట్టి అని వుంది. మల్లంపల్లి వారు దొరయరాజు క్షత్రియుడు లాగా వున్నాడు కానీ ఈయన పృధ్వీశెట్టి కావడమేమిటని కాస్త గందరగోళానికి గురైనట్లు కనిపిస్తుంది. వీరబలింజ సమయాల గురించి ప్రత్యక్ష అవగాహన ఆయనకు లేకపోవడంతో బహుశా ఈ సందేహానికి ఆయన గురై వుండవచ్చు (నేను ఇలాంటి విషయాల్లోనే చరిత్రకారులు పొరబడ్డారని అభిప్రాయపడుతుంటాను).

సాగి వంశస్తులు బ్రహ్మబాహువుల నుండి పుట్టిన వారిగా వారి శాసనాలలో చెప్పుకున్నారు. కాబట్టి క్షత్రియులు కదా అని వీరి సందేహకారణం. బలిజల్లో కోటబలిజ వర్గానికి చెందిన వారు క్షత్రియులు సూర్య, చంద్ర, శేషనాగ,యదువంశాలకు చెందిన 96 తెగలు బలిజలే ఈ చర్చ ఇక్కడ అప్రస్తుతం కాబట్టి ఇంతటితో వదిలేద్దాం. కానీ వాస్తవానికి 56 దేశాల శెట్టి సమయాల పెద్దనే పృధ్వీశెట్టి అనేవారు. కాలక్రమేణా ప్రతి స్వతంత్ర రాజ్యంలో ఒక పృధ్వీశెట్టి ని ఏర్పాటు చేసినట్లు కనిపిస్తోంది. కొందరు పృధ్వీశెట్లే పాలకులుగా వున్నట్లు తెలుస్తోంది. ఎంతమంది పృధ్వీశెట్లు వున్నా వారంతా సమయ కట్టు బాట్లు నడిపించడానికే ఏర్పాటు చేయబడేవారు. బహుశా పరిపాలనా విస్తృతి వల్ల అలా ఏర్పాట్లు జరిగి వుండవచ్చు.ఇలా అధికారాలు

చలాయించే పథ్విశెట్లు మహానాడులు అనే సమావేశాలు నిర్వహించి కులాలకు కట్టుబాట్లు ఏర్పాటు చేసేవారు. ఆయా కులాలు కట్టుబాట్లను అతిక్రమిస్తే కఠిన దండన లుండేవి.

విజయనగర రాజు రెండవ హరిహరిరాయలు యిచ్చిన క్రీ.శ.1379 నాటి కన్నడ శాసనం లో పృథ్విశెట్టికి లభించే గౌరవాలు యేమిటో వున్నాయి. ఒక దేశం ''పృథ్విశెట్టి'' మరో దేశం వెడితే ఆ దేశ అధికారులు మొదట అతనికి తాంబూలం యివ్వాలి. బట్టలు పెట్టాలి, భోజనం సమకూర్చాలి. యితర గౌరవాలు పాటించాలి.

ఈ మహానాటి పెద్దలు గ్రామ పెద్ద (శెట్టి, దేశాయి) లను నియమించేవారు. వీరు గ్రామాలలో పన్నులు వసూలు చేయడం నుండి తీర్పులు చెప్పడం, శిక్షలు వేయడం వంటి పనులు చేసేవారు.

యుద్ధాలలో రాజులు మారినా ఈ వ్యవస్థలు మాత్రం మారేవి కావు. రాజ్యానికి ఏరాజు వచ్చినా ఈ వ్యవస్థల సలహా సంప్రదింపులతోనే రాజ్యపాలన చేయవలసి వచ్చేది. ఈ పద్ధతిని ముస్లిం చక్రవర్తులు సైతం అంగీకరించి గౌరవించినట్లుగా తెలుస్తోంది.

రాయనమంత్రి భాస్కరుడు

శెట్టి సమయాలకు చెందిన వివిధ వీరబలింజ శాసనాలలో రాయన మంత్రి భాస్కరుడు అనే పేరు తరచుగా కనిపిస్తుంది. ఈ పేరు వివిధ కాలాలలో వివిధ శాసనాలలో కనిపిస్తుంది. వాస్తవానికి చాలామంది చరిత్ర కారులు ఈయన ఒక వ్యక్తిగా పొరపడ్డారు. ఒకే వ్యక్తి వివిధ కాలాలలో జీవించి వుండడం అసంభవం. రాయన మంత్రి భాస్కరుడు అనేది ఒక పదవి అయి వుండవచ్చు.

ఎందుకంటే క్రీ.శ.1524 నాటి తిరుమల శాసనము బొల్లెద్దు అన్నంశెట్టి దేశాయిని తిరుమల సంబంధిత స్థలాలపై పెద్దగానియమిస్తూ శ్రీ కృష్ణదేవరాయలు చేసిన శాసనము. దీనిలో రాయనమంత్రి భాస్కరన్న పేరు ప్రస్తావించారు. అదే విధంగా క్రీ.శ. 1601-02 నాటి ప్రొద్దుటూరు తాలూకా గుడిపాడు దానశాసనంలో వెంకటపతిరాయలు విజయనగరం

పరిపాలిస్తుండగా గుడిపాటి చెన్నకేశవస్వామికి ఇచ్చిన దానశాసనము, దీనిలో కూడా రాయనమంత్రి భాస్కరన్న అనే పేరు కనిపిస్తుంది.

క్రీ.శ.1687 లో ఔరంగాజేబు గోల్కొండ గెలిచిన సందర్భంలో పన్నుల రద్దు చేస్తూ కొత్తపన్నులు వేసిన మహానాటివారి శాసనము దీని లో కూడా రాయనమంత్రి భాస్కరన్న అనే పేరు కనిపిస్తుంది. 1524 నుండి 1687 వరకు అంటే 163 సంవత్సరాలు ఒక వ్యక్తి జీవించి వుండడం అసంభవం.

(పూర్వాచార కులాల సమయాలలో వాస్తవానికి బ్రాహ్మణులకు చోటు లేదు కానీ రాయన భాస్కరుడు అనే వ్యక్తి పేరుతో అనేక శాసనాలు వున్నాయి. ఎర్రం శెట్టి మీరా పాత్రుడు పృథ్వీశెట్టి గా వున్న కాలంలో భాస్కరుడు పన్నుల రద్దు చేయించడానికి ఆయన వంతు కృషి చేసినట్లు తెలుస్తోంది. అందు వల్ల శెట్టి సమయాలలో రాయనమంత్రి పదవిని వారికుటుంబీకులకే ఇచ్చివుండవచ్చు. అ కుటుంబమే తరతరాలుగా రాయనమంత్రీ భాస్కరుడు పేరుతో వ్యవహరించివుండవచ్చనే వాదనలు సైతం వున్నాయి. లేదా ఆయనపై గౌరవంతో రాయనమంత్రి భాస్కరుడు అనే పదవిని ఏర్పాటు చేసివుండవచ్చు. బ్రాహ్మణులు మొదట వామాచార కులాల గుంపులో వుండే వారు. ఆ తరువాత వేద,శాస్త్రాధ్యయనానాలలో, ఇతర వ్యవహారాలలో పాంచాణాణం వారు పెట్టే బాధలు తాళలేక బయటకు వచ్చివుంటారు. పూర్వాచార కులాల వైపు వెళ్లడానికి కూడా మనస్కరించక తటస్థంగా వుండిపోయి వుంటారు. అందువల్ల వారికి శెట్టి సమయాలలో బాధ్యతలు లభించలేదు.)

56 దేశాల పైన అధికారిగా వున్న '' పృథ్వీశెట్టి'' వద్ద శాసనాలు రాయడానికి ఒక వ్యక్తి వుండేవాడు ఆయననే రాయన మంత్రి అని పిలిచేవారు. (నేటి ఛీఫ్ సెక్రెటరీతో పోల్చవచ్చు) వాస్తవానికి సమయ మంత్రి కట్నం అని ప్రత్యేక సుంకాన్ని వీరి కొరకు వసూలు చేసేవారు. ఈయన వివిధ ప్రాంతాలపై దేశాయిశెట్టి లకు అధికార పత్రాలనుపంపడం, దేశాయిశెట్ల అధికారాలను బదలాయించడం. వాటిని రిజిస్టరు చేయడం వంటి పనులు వీరి కార్యాలయంలోనే జరిగేవి. ఈ సమయాలకు పృథ్వీశెట్టి సర్వాధికారి అయితే

ఆయనకు సలహాలు, కార్యాలయ పర్యవేక్షణ రాయనమంత్రి పర్యవేక్షణలోనే జరిగేది.

పృథ్వీశెట్టి రాయనవమంత్రి భాస్కరుడు అంటే "పృథ్వీశెట్టి వద్ద రాయసకాడైన మంత్రి భాస్కరుడు " అని అర్థం. రాయనమంత్రి భాస్కరన్న అనే పదాలు కూడా శాసనాలలో కనిపిస్తాయి. ఈ పరంపరనే తరువాతి కాలంలో దేశాయిశెట్లకు సలహాలు ఇవ్వడానికి రాత పనులు నిర్వహించడానికి కరణాలను ఏర్పాటు చేయడానికి కారణమై వుంటుంది. ఈ పదవులను ఇతరులు నిర్వహించినా సరే వారిని కరణాలుగానే సంబోధించినట్లు కనిపిస్తుంది. (శెట్టి సమయాలకు చెందిన కార్యాలయాలలో పని చేసినా శెట్టి సమ యాల కట్టుబాట్లు, ఇతర విషయాలలో బ్రాహ్మణులను నిర్బంధించిన సందర్భాలు కనిపించవు. కనుక వీరు తటస్థంగానే వున్నట్లు తెలుస్తోంది).

సంతల ఏర్పాటు

ఆ కాలం లో ఉత్పత్తులు అవసరానికి మించి తయారు కావడంతో వాటిని అమ్ముకునే వెసులుబాటు కలిగింది. ఎంతటి ఉత్పత్తి అయినా అమ్ముడు కాకపోతే దాని వల్ల ఫలితం లభించదు. గ్రామీణ ప్రాంతాలలో తయారయ్యే ఉత్పత్తులను అమ్ముకునేందుకు వారాంతపు సంతలను ఏర్పాటు చేశారు. ఈ వారపు సంతలు ఒకదాని తరువాత మరొకటిగా జరిగేవి. ఆదివారం ఒక గ్రామంలో జరిగితే సోమవారం మరో గ్రామం లో సంత, మంగళ వారం మరో గ్రామంలో సంత, ఇలా ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట సంత ఉండే విధంగా (గొలుసు క్రమం) చర్యలు తీసుకున్నారు.

ఈ సంతలలో ఒకే ఉత్పత్తి చేసే వామాచార, పూర్వాచార కులాల మధ్య ఘర్షణలు చోటు చేసుకునేవి. ఈ ఘర్షణలు కొట్టుకోవడం దగ్గర నుండి చంపుకోవడం వరకు కూడా వెళ్లి పోయేవి. అప్పుడు అటు వైపు కొన్ని కులాలు, ఇటువైపు కొన్ని కులాలు ఈ తగాదాలలో పాలు పంచుకునేవి. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు రాజులు తలదూర్చి వారి మధ్య సయోధ్య కుదిర్చేవారు. ఇలాంటి సందర్భాలలో పూర్వాచార కులాల గుంపు మెజారిటీ గుంపు కావడంతో వారిదే పైచేయి అయినట్లు కనిపిస్తుంది.

ఇంగ్లీషు వారు దేశం లోకి వచ్చిన తరువాత ఈ వర్గాల మధ్య తగాదాలను పెంచి పోషించి లాభపడ్డారు. రాజుల కాలంలో చివరికి నవాబుల కాలంలో సైతం మెజారిటీ ప్రజల అభిప్రాయాలకు విలువనిచ్చి తగాదాలను పరిష్కరించేవారు. ఈ కాలంలో కట్టుబాట్లను కఠినంగా ఆచరించిన పూర్వాచార కులాలకు సమాజంలో ఉన్నతస్థానం దక్కింది. ఉన్నత స్థానంతో పాటు గౌరవమూ లభించింది.

వాణిజ్యం లో శెట్టి సమయాలు

దేశంలో వృత్తులు ప్రధానంగా గ్రామాలలో నే వుండేవి. ఈ వృత్తులు అన్నీ దాదాపుగా కుటీర పరిశ్రమలు గానే వుండేవి. నిజానికి ఈ కుటీర పరి శ్రమల ఉత్పత్తులన్నీ కలిపితే నేటి పెద్ద పెద్ద పరిశ్రమల ఉత్పత్తులకేమీ తీసి పోయేవి కావు.

ఉదాహరణకు చేనేత పరిశ్రమనే తీసుకుంటే ఇది చాలా పెద్ద పరిశ్రమ. ఇది ఎలా వుండేదంటే...

గ్రామాలలో రెతులు ప్రత్తి పండించేవారు. ఈ ప్రత్తిలో విత్తనాలు తీసి దూదిని ఏకులుగా చేసే కుటుంబాలు వుండేవి. అలా ఏకులుగా చేసిన దూదిని దారంగా వడికే రాట్నాలు దాదాపుగా ప్రతి ఇంట్లో వుండేవి. పనులు లేని ఖాళీ సమయాల్లో గ్రామీణ మహిళలు (రైతుకుటుంబాలే) తమ ఇళ్లలోనే ఈ దూదిని వడికి దారపు కండెలు తయారు చేసేవారు. ఈ దారపు కండెలను జొన్న దంట్లు (ఎండిన జొన్న మొక్క కాండం) కు చుట్టి పెట్టే వారు.

ఇలా తయారు చేసిన దారపు కండెలను నేత పని వారు తూకం వేసి కొనుక్కు వెళ్లేవారు. అలా సేకరించిన దారపు కండెలను అన్నింటినీ ఏకం చేసి ఇళ్ళలో వుండే మగ్గాలపై బట్టగా నేసేవారు.

ఆ కాలంలో ప్రతి చేనేత కుటుంబానికి పది లేక అంతకంటే ఎక్కువ మగ్గాలున్నట్లు విదేశీయుల రాతల వల్ల తెలుస్తోంది.

ఇలా వారం రోజులు ఇంటిల్లిపాదీ నేసిన వస్త్రాలను ఎద్దుల బండిపై వేసుకుని సమీపంలోని సంతలకు వెళ్లి విక్రయించుకునేవారు.

ఈ సంతలు కూడా ఎలా వుండేవంటే ఆదివారం ఒక గ్రామంలో

సంత వుంటే, సోమవారం ఆ సమీపం గ్రామంలోనే సంత వుండేది. మంగళవారం మరో గ్రామంలో సంత వుండేది. ఇలా ఒక ప్రాంతంలో ఒక వారం లోని అన్ని రోజుల్లో సంతలు వుండేవి.

ఈ సంతలు ఏర్పాటు విషయం లో కూడా ఈ శెట్టి సమయాలు ఒక క్రమపద్ధతిని అనుసరించారు.

తన ఉత్పత్తులను మొత్తం ఒక సంతలో అమ్ముకోలేని ఉత్పత్తి దారుడు, మిగిలిన ఉత్పత్తులను తీసుకుని మరో సంతకు వెళ్లి అమ్ముకునేవాడు. ఇలా వారం రోజులు అమ్ముకోగల అవకాశాలు నాడు వుండేవి.

ఇలా తన ఉత్పతత్తులను అమ్ముకున్న ఉత్పత్తి దారుడు, తిరుగు ప్రయాణంలో ఆయా గ్రామాల్లో వడికిన దారపు కండెలను, ముడి సరకులను కొని అదే బండిపై వేసుకుని ఇంటికి చేరేవాడు.

(గతంలో గ్రామాలలో పండించిన ప్రత్తిని దూదేకుల వారు దూదిని విత్తనాలను వేరు చేసి దూది ఏకులను తయారు చేసేవారు. అలా తయారు చేయబడిన ఏకులను గ్రామాలలోని మహిళలు రాట్నాలపై వడికేవారు. ఇలా రాట్నాలపై దారపు కండెలను అన్ని కులాల వారూ చేసినట్లు కనిపిస్తోంది. ఇలా వడికిన దారపు కండెలను నేతపని వారు ఇండ్ల వద్దకే వచ్చి కొనుగోలు చేసేవారు. వాటిని ముడిసరుకుగా వాడి బట్టలు నేసేవారు.)

ఈ పద్ధతి ఒక చేనేత పనివారికే కాదు....

కమ్మరం, కుమ్మరి, వడ్రంగి, వ్యవసాయం వంటి అన్నిరంగాలకూ వర్తించేది.

ఈ సంతలు ఉత్పత్తి దారులకే కాకుండా దళారులకూ, వ్యాపారులకూ అనుకూలంగా వుండేవి.

ఇలా నేరుగా తమ ఉత్పత్తులను అమ్ముకునే ఉత్పత్తిదారులు తమకు గిట్టుబాటు ధరకు అమ్ముకునే వెసులుబాటు ఉండేది.

ఈ సంతల ద్వారా శిస్తు రూపంలో ఆదాయం లభించేది. ఈ సంతలను గ్రామంలోని పాలక శెట్టి ఆధ్వర్యంలో వేలం వేసేవారు ఒక సంవత్సరానికి గాను వేలంలో సంత పై హక్కులను కొనుగోలు చేసేవారు గ్రామ శెట్టికి రెండు, మూడు వాయిదాలలో డబ్బు చెల్లించేవారు. సంతలో తమ వస్తువులు అమ్ముకునే వారి నుండి అమ్మకపు సుంకాన్ని వసూలు చేసేవారు. దీనిని పెంటసుంకం

అని పిలిచేవారు. దీనిని వేలంలో హక్కులు కొనుగోలు చేసిన వ్యక్తులు మాత్రమే వసూలు చేసేవారు. ఎలాబడితే అలా ఈ సుంకాన్ని వసూలు చేయకుండా ఒక క్రమ పద్ధతిలో వసూలు చేసినట్లు కనబడుతుంది.

(ఇలా ఇతర ప్రాంతాల నుండి వచ్చి వ్యాపారం చేసుకునే వ్యాపారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆ ప్రాంత దేశాయిశెట్టిదే... ఒక వేళ ఏ వ్యాపారి అయినా దోపిడీకి గానీ మోసానికి గానీ గురయితే వారికి నష్టపరిహారం చెల్లించాల్సిన బాధ్యత కూడా దేశాయిశెట్టికే వుండేది).

ఇలా సంతలలో తమ ఉత్పత్తులను అమ్ముకునే విషయంలో ఒకే రకమైన ఉత్పత్తుల తయారు చేసే వారి మధ్య అభిప్రాయభేదాలు తలెత్తేవి. ఈ క్రమంలో వారి మధ్య ఘర్షణలు కూడా చోటు చేసుకునేవి.

ఈ ఘర్షణలు ఎక్కువగా కుడి ఎడమ కులాల వృత్తి వ్యాపారుల మధ్యనే తరచుగా జరిగేవి. ఇలా తమ వర్గాన్ని బలోపేతం చేసుకోవడం కొరకే పూర్వాచార కులాలన్నీ ఒక గుంపుగా స్థిరపడిపోయి వుండవచ్చు. ఈ సమయాలు ప్రతి వ్యక్తినీ తనకొరకు అందరూ - అందరి కొరకు తాను అనుకునే విధంగా ప్రభావితం చేశాయి.

ఇలా ప్రారంభమైన శెట్టి సమయాలు ఒక క్రమబద్ధమైన, క్రమశిక్షణాయుతమైన జీవనంతో దేశాన్ని ఉత్కృష్ఠ దశకు తీసుకు వెళ్లాయి.

బౌద్ధ, జైన మతాలు రాజ్యమేలుతున్న కాలంలో కూడా కులాలు తమ వృత్తులను మార్చుకోలేదు. వర్ణాలు మాత్రం సమాజంలో లేకుండా పోయాయి. ఈ కాలంలో చాతుర్వర్ణ వ్యవస్థ అమలు జరిగనట్లు కనిపించదు. కానీ కులాలుమాత్రం తమ ఉనికిని నిలకడగా కాపాడుకున్నట్లు కనిపిస్తాయి.

వర్తక బిడారులు (సాటులు)

ప్రాచీన సమాజంలో వర్తకాన్ని నిర్వహించాలంటే వివిధ సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సివచ్చేది. వర్తకాన్ని సాగించేవారు అందరూ కలసి ఒక సమూహం (సమయం) గా ఏర్పడి దూరప్రాంతాలకు వెళ్లి వ్యాపారాలు చేసేవారు. ఇలా వ్యాపారాలకు తరలే సమూహాలనే వర్తక బిడారులు అనేవారు.

దండకవిలె చెబుతోంది.

నకరాలు

గ్రామీణ ప్రాంతాలలో కులాల కట్టుబాట్లను వారి వృత్తి వ్యాపారాల ను నియంత్రించే వ్యవస్థలుగా శెట్టి సమయాలు తన పాత్రను అద్వితీయంగా నిర్వహిస్తున్న కాలంలో అభివృద్ధి చెందిన నగరాలు, పట్టణాలు అనే జనావాసాలు ఏర్పడ్డాయి. సాధారణంగా నౌకాశ్రయ ప్రాంతాలనే పట్టణాలు అన్నట్లుగా కనిపిస్తుంది. మచిలీపట్నం, విశాఖ పట్నం, కృష్ణపట్నం, చెన్నపట్నం మొదలైన పేర్లను గమనించినప్పుడు ఎగుమతులు దిగుమతులు జరుగుతున్న ప్రాంతాలలో వ్యాపార కార్యకలాపాలను చేపట్టే సమయాలనే పట్టిణాలు, నకరాలు అన్నట్లు తెలుస్తోంది. గ్రామాలలో పన్ను వసూళ్లు, వివాదాల పరిష్కారాలు చేసే వ్యవస్థలు శెట్టి సమయాలని పిలువబడగా నగరాలలో వున్న వ్యవస్థలను నకరాలనే పేరుతో పిలిచినట్లు తెలుస్తోంది. వాస్తవానికి నగరాలు అనే పదం వల్ల ఈ సమయాలకు నకరాలు అన్న పేరు వచ్చిందా లేక నకరాలు అనే సమయాల వల్లనే నగరాలు అనే పేరు స్థిరపడి పోయిందా అన్నది చరిత్రకారుల ఎదుట పెద్ద ప్రశ్నగానే మిగిలిపోయింది.

సంచార వర్తక సంఘాలు సమయాలని నిలకడగా వాణిజ్యాన్ని చేసే సంఘాలను నకరాలని అంటారని చాలామంది చరిత్రకారులు అభిప్రాయ పడ్డారు. ఈ భావనలో వాస్తవం వున్నట్లు కనిపించదు.

గ్రామాలలోని సమయాల నిర్వహణ కంటే నకరాల నిర్వహణ కొంత సంక్లిష్టంగా వున్నట్లు తెలుస్తోంది. నకరాలు కూడా పరిపాలనా యంత్రాంగం లో బాధ్యతలు నిర్వహించినట్లు తెలుస్తోంది. గ్రామాలలోని వాణిజ్యానికి నగరాలలోని వాణిజ్యానికి స్వల్పమైన బేధాలుండడం వల్లనే ఈ నకరాలు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుని వుంటాయి. శెట్టిసమయాల ఐక్యత వల్ల గ్రామాధిపత్యం దక్కినట్లే నకరాలపై కూడా పూర్వాచార కులాల వారు పట్టు సాధించుకున్నారు.

ఈ నకరాలు వున్న ప్రాంతంలో విదేశీ వాణిజ్యం, చుట్టు ప్రక్కల రాజ్యాలతో వర్తకం బాగా జరిగినట్లు తెలుస్తోంది. గ్రామాలలోని సమయాలలో ప్రత్యేక కార్యాలయం, సిబ్బంది వంటి వారు కనిపించరు. కానీ నకరాలలో కార్యనిర్వహణకు కార్యాలయాలు వున్నట్లు తెలుస్తోంది. సమయాలలోని కులాలే ఇక్కడ కూడా తన ప్రాభవాన్ని చాటుకున్నాయి.

నిజానికి నగర పాలనా వ్యవహారాలలో అత్యధిక భాగం ఈ నకర కార్యాలయాలనుండే జరిగినట్లు తెలుస్తోంది. ఈ నకరాలు ప్రధానంగా విదేశీ వ్యాపారులు, వివిధ ప్రాంతాలనుండి వచ్చే వ్యాపారుల నుండి సుంకాలు వసూలు చేయడం, వివాదాలను పరిష్కరించడం, నియమాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవడం తో పాటు రక్షణ వ్యవస్థను సైతం నడిపించినట్లు తెలుస్తోంది. గ్రామాలలోని సమయాలకు నకరాలకు వున్న తేడా ప్రధానంగా వాటి వ్యాపార విస్తృతి మాత్రమే గ్రామాలలోని సమయాలకు వుండే అన్ని అధికారాలు, బాధ్యతలు ఈ నకరాలకు వుండేవి.

ఈ నకరాలు కేవలం కుడిచేతి కులాలకు మాత్రమే సేవలు అందించ కుండా అన్ని వ్యాపార కులాలు, వృత్తి కులాలపై అజమాయిషీ చేసినట్లు తెలుస్తోంది. ఈ నకరాలు కూడా శెట్టి ఆధ్వర్యంలోనే నడిచేవి. శెట్టి తో పాటు వివిధ రికార్డులు నిర్వహించడానికి కరణాలను, రాయసకాండ్రను ఉపయోగి ంచుకునే వారు. వీరికి జీత భత్యాలను అందజేసినట్లు తెలుస్తోంది. వ్యాపారులకు సంబంధించిన సేవలు అందించినందుకు కమీషన్లను సైతం ఈ నకరాలు స్వీకరించినట్లు తెలుస్తోంది. సుంకాల వసూళ్లు సైతం వీరే చేశారు. వీరిని సుంక గుత్తగాండ్రు, ఇజారాదార్లు అని కూడా పిలిచేవారు.

స్థానిక వర్తకానికి బయటి వర్తకులకులకు దళారులుగా వ్యవహరించి వుంటారని పలువురు చరిత్ర కారులు అభిప్రాయపడ్డారు. నకరం పరిధి కేవలం ఆ నగరానికి మాత్రమే పరిమితమై వుండేది తప్ప మరో ప్రాంతం పై ఈ నకరాలు అధికారం చలాయించినట్లు కనిపించదు. పన్ను వసూళ్లు, పరిపాలనా బాధ్యతలు, తీర్పులు ఇవ్వడంతో పాటు తమకు చెందిన ధనాన్ని లేదా రాజ్యానికి చెల్లించాల్సిన ధనాన్ని దేవాలయాలకు దానాలుగా ఇచ్చినట్లు కనిపిస్తోంది. అలా ఇవ్వబడిన దానాలు సంబంధిత రాజు లేదా పాలక నాయకుడి సమ్మతితో చేసినట్లు కనిపిస్తుంది.

వీటిని తెలుగులో ''సాటు'' లు అని పిలిచేవారు. ఇలాంటి బిడారులు వందల సంఖ్యలో వ్యాపారులను, రవాణా వాహనాలను (ఎద్దుల బండ్లు) కలిగివుండేవారు. ఈ రవాణా ఎక్కువగా ఎద్దులు, గాడిదలు, బండ్లపై జరుగుతుండేది. (సుగాలీల ఆవుల మందలను సైతం రవాణాకు వినియోగించుకున్నట్లు తెలుస్తోంది) ఈ రవాణా వృత్తిని చేసేవారిని ''పెరిక బలిజలు'' అనేవారు. ఈ సమూహాలు ఒక సంత నుండి మరో సంతకు ప్రయాణాలు చేసే క్రమంలో అడవుల గుండా ప్రయాణాలు సాగించాల్సి వుండేది.

ఈ అడవి మార్గాలు దోపిడీ దొంగలకు ఆలవాలంగా వుండేవి.ఈ దోపిడీ దొంగల బారి నుండి తమను రక్షించుకోవడం కొరకు ఈ వ్యాపార సమయాలు ప్రైవేటు సైన్యాలను ఏర్పాటు చేసుకునేవారు. ఈ రక్షకులు వ్యాపారుల బిడారులను దొంగల నుండి రక్షించేవారు (వీరే ముమ్మూరి దండులు, వీరబలిజలు). అందుకు గాను ఈ బిడారి వర్తకులు వీరికి కొంత ధనాన్ని ముట్టజెప్పే విధానం వున్నట్లు తెలుస్తోంది. కాలక్రమేణా బిడారులకు, వర్తక సమాజాలకు రక్షకులే కార్యనిర్వాహకులుగా మారినట్లు కనిపిస్తోంది.

అలా పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసిన ఈ సమయాల సభ్యులు మరింత విస్తృతమైన వాణిజ్యంలో భాగంగా సముద్ర వ్యాపారాలకు ఎదిగి వుంటారు. సుదూర ప్రాంతాలతో చేసే వాణిజ్యం బాగా లాభాలను అందిస్తుండడంతో సాగర వాణిజ్యం ఊపందుకున్నట్లు తెలుస్తోంది. ఇలా తమ రక్షణ కొరకు ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు సైన్యాల వల్లనే తూర్పు దేశాలపై పట్టు సాధించుకున్నారు. (రాజ్యం వీరభోజ్యం అన్న నానుడి ప్రకారం నాటి కాలంలో తమను కాపాడే వీరులకు ఈ సమాజం విపరీతమైన గౌరవాన్ని ఇచ్చి వుండవచ్చు, అందుకే ఈ వర్తక బిడారుల రక్షక సైన్యాల నాయకులే రాజులుగా రాజ్యాలేలారు). ఇక్కడ పాలకులుగా ఈప్రైవేటు సైన్యాల నాయకులే నియమితులయ్యారు. (ఎంతటి రాజైనా సరే అతడు సమయం లో అంతర్భాగమే తప్ప సమయ కట్టుబాట్లకు అతీతుడు కాదు. అందు వల్లనే సమయాలు అనంతమైన అధికారాలను అనుభవించాయి). ఈ సమయాల అధికార పరాకాష్ఠ ను గురించి చాలా శాసనాలు తెలియజేస్తున్నాయి.

వీరికి సంబంధించి కాకతీయుల చివరనాటివి, 14 వ శతాబ్ధం మొదటి నాటివి అయిన రెండు రాగిశాసనాల గురించి మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు

వారు తన రెడ్డిరాజ్యాల చరిత్ర లో ప్రస్తావించారు. ఈ శాసనాల గురించి ఆయన మాటలు.....

పైన చెప్పిన రెండు తామ్రశాసనాల్లోనూ ఒకటి సుంకం మినహాయింపులకు సంబందించింది. కొన్ని వస్తువులమీద ఆ సుంకం మినహాయింపు పులియామశెట్టి అనే అతనికి ఇచ్చారు. అతను "సమయన" కు ద్రోహి అయిన కారాపాకాల కొటినాయకుడనే అతన్ని సంహరించాడు......

రెండవదీ యిలాంటిదే యిదే వర్తక సంస్థ(చాలుమూల పదునెనిమిది సమయాల సంస్థ పెక్కండ్రు) అత్తెన అనే ఆయనకు యిచ్చినది. అతను సుంకకరణాలు (సుంకగణకులు) అయిన పెడకంట సీమ చెరునూరు లో అన్నమరాజు, సింగరాజు అనే వాళ్లని హతం చేశాడు.

" ఇప్పుడు ప్రస్తావించుకున్న పత్రాలు నిజమే అయితే ఈ వ్యాపార సంస్థలు చెలయించే గొప్ప అధికారానికి దాఖలాగా వున్నాయని చెప్పవచ్చు, వీటిని బట్టి రాజు ఈ సంస్థల అంతర్గత వ్యవహారాల్లో వేలు పెట్టే వాడు కాదనీ, వాళ్ల ఇష్టానుసారం నడుచుకునేట్టు అనుమతి ఇచ్చాడని మనం ఊహించవచ్చు. వాళ్లు తమ వ్యవహారాలకి సంబంధించి పూర్తి స్వేచ్చను అనుభవించారు. యీ సంస్థల మండళ్లు యెవళ్లకైనా మరణదండన విధించినా రాజు ఏమీ చెయ్యలేక పోయేవాడు. ఎవళ్లన్నా "సమయ" కు ద్రోహం చేస్తే వాళ్లు అలాంటి దండననీ విధించేవారు".

ఒక్క సమయద్రోహులకేనా...రాజులను సైతం పంచాయితీలో నిలబెట్టి మరణదండన అమలు చేశారు. దీన్ని నేను కూడా నమ్మలేదు కానీ "కొండవీటి దండకవిలె" అబద్ధం చెప్పదుగా ...

క్రీ.శ.1420 నుండి 1424 వరకు కొండవీడును పరిపాలించిన రాచవేముడు (రాచవేమారెడ్డి) పరిపాలనలో తన పూర్వులు, తన తండ్రి అనుసరించిన మార్గాన్ని అనుసరించచక ప్రజలపై కొత్తపన్నులు విధించాడు. దానితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాటిలో పురిటి సుంకము అనేది ఒకటి. ఇది అసంబద్ధమైన పన్ను అని ప్రజలు తీవ్ర నిరసనలు తెలిపి నప్పటికీ రాచవేముడు పట్టించుకోలేదు. ఈ పన్ను విషయంలో ముత్యాలమ్మ గుడి వద్ద పంచాయితీ జరిగింది. పంచాయితీని ధిక్కరించిన రాచవేముడిని వీరబలింజ వీరుడు సవరము ఎల్లయ్య కఠారితో పొడిచి చంపాడని కొండవీడు

ప్రాచీన సమాజంలో బలం వున్నవాడిదే రాజ్యం కావడంతో ఈ సమయాలకు చెందిన వారే మూకుమ్మడిగా రాజ్యాలను సైతం ఆక్రమించుకున్నట్లు తెలుస్తోంది. అలా బర్మా, థాయిలాండ్ వంటి తూర్పు దేశాలకు వెళ్లిన శెట్టి సమయాల సైన్యాల అధిపతులే ఇక్కడ వలసరాజ్యాలను స్థాపించిన తలైంగులు అని తెలుస్తోంది. (అక్కడి స్థానిక భాషల్లో ''తలాయి'' అంటే తండ్రి లేకుండా పుట్టినవాడని అర్థం తలైంగులు అనే పదం తలాయి అనే పదానికి ఉచ్ఛారణలో చాలా దగ్గరగా వుండడంవల్ల అక్కడి స్థానికులు వీరిని అవమానకరంగా సంబోధించి వుండవచ్చు ఇది నచ్చక నే ఈ తలైంగులు '' మూన్'' జాతీయులుగా చెప్పుకుంటారు.

వీరే తూర్పు దేశాల నాగరికతల పై, భాష, సంస్కృతులపై విపరీతమైన ప్రభావాన్ని చూపించారు. ఇప్పటికీ ఇక్కడి మూన్‌జాతీయుల పేర్ల ముందు ''నాయి '' అనే ఉపనామం (ఉదాః-నాయిథీన్, నాయిపాన్‌అంగ్) వుంటుంది. బహుశా ఇది నాయకుడు, నాయుడు అనే తెలుగు పదాలకు సంబంధించినది అయివుండవచ్చు. వందల సంవత్సరాలుగా జరిగిన ఉచ్ఛారణా పరిణామంలో ఇలా రూపాంతరం చెంది వుండవచ్చు). ఈ సమయాల సైన్యాలు యుద్ధ సమయాలలో రాజులకు ఉపయోగపడేవి.

ఒక వైపు ఆర్థిక బలం, మరో వైపు సైనిక బలాలను అందించే ఈ సమయాలు నాటి రాజకీయాలలో ప్రధాన పాత్ర పోషించాయి. ఈ సమయాలు కేవలం భారతదేశంలోనే కాక తూర్పు దేశాలలో కూడా తమ ఉనికిని చాటుకున్నాయి. కాకతీయ గణపతిదేవుని కాలం నాటికి తవాయిద్వీపకల్పం (థాయిలాండ్) లో కూడా ఈ వ్యాపార నకరాలు వున్నట్లు తెలుస్తోంది.

అయ్యావళి-500

అయ్యావళి - 500 అనే వర్తక సంఘం ప్రస్తావన లేకుండా భారతదేశంలో వర్తక వాణిజ్యాల గురించి చెప్పడం అసాధ్యం. దీని గురించిన శాసనాలను పరిశీలించిన చరిత్ర కారులు ''చాలా శక్తివంతమైన, పెద్దదైన, సంపద, సమృద్ధి కలిగిన వర్తక సంఘం'' అని అభిప్రాయపడ్డారు. ఇది వీరబలింజ సమయానికి చెందిన వర్తక సంఘం. దీనిలో మొత్తం బలిజలే

వుంటారని చరిత్రకారులు అభిప్రాయం అయినప్పటికీ అది వాస్తవం అయి వుండకపోయి వుండవచ్చు. ఎందుకంటే బలిజ కులస్తులు రక్షకులుగా, నాయకులుగా వ్యవహరించినందువల్ల వీరబలింజ సమయాలు అని పిలువబడి వుండవచ్చు.

అదే విధంగా వీరు ఉత్పత్తి దారులను ప్రోత్సహించి వాణిజ్యం చేసి వుండవచ్చు. అయ్యావళీ అంటే నేటి కర్నాటకలోని ఐహోలు పట్టణమే. అతి ప్రాచీన కాలంలో (త్రేతాయుగం) రాజ్యాలు కోల్పోయిన క్షత్రియ కుటుంబాలే ఈ అయ్యావళీ-500 కుటుంబాలు అంటారు. రాజ్యాలు కోల్పోయిన తరువాత వాణిజ్యంలోకి వచ్చారని పలువురి అభిప్రాయం. ఇక్కడి నుండి 500 మంది వ్యాపారులు దేశం నలువైపులలకు వెళ్లారని ప్రతీతి. ''తిచ్చైయంయేం రెత్తైన్నూరువర్'' అని తమిళంలో ఈ సంస్థను పిలుస్తారు ఈ తమిళ పదానికి అర్థం వెయ్యిదిక్కులకు చెందిన ఐదు వందల వర్తకులు అని అర్థం.

వీరి గురించి చింతపల్లి శాసనంలో వున్న విషయాన్ని మల్లంపల్లి వారు చాలా చక్కగా వివరించారు.

వాళ్లు ''సాహసికులు కృతయుగ ఆది నుంచీ ఎన్నో శతాబ్దాలపాటు సంచరించడానికే పుట్టిన వాళ్లు'' అని అయ్యవోవలుల కన్నడ పత్రాలు చెపుతున్నాయి. ''నవరత్న పరీక్షా నిపుణులు , అశ్వగజానివాహన పరీక్షా నిపుణులు వ్యాపారంలో సిద్ధహస్తులు'' అనీ వుంది. వాళ్లు ఏనుగులు, అశ్వాలు, ఎద్దులు, దున్నలు, ఆవులు, బళ్ళ, కెంపులు, ముత్యాలు, పగడాలు, పచ్చలు,మణులు, వజ్రాలు, నీలమణులు, అగేటేలు, లాప్సిలాజులి, చంద్రవంకలు, నగలు, జౌళి, నూలు లాంటి వ్యాపారం చేసేవారు. దేవుళ్ల వస్తువులు జవాజి, పునుగు, కర్పూరం, కస్తూరి యితర సుగంధ ద్రవ్యాల వ్యాపారం చేసేవారు. పోక, ఉప్పు, దాన్యాలు, పుష్పలు, మిరియాలు, వగైరా వస్తువుల వ్యాపారం చేసేవాళ్లు. ఎద్దుల్ని, గాడిదల్ని, దున్నల్ని వీటిని మోసేందుకు వినియోగించేవారు. యీ జంతువులకు ''ఎర్రటి కుచ్చులు అలం కరించేవారు''. మువ్వల గంటలు కట్టేవారు. ఈ వస్తువుల్ని మొత్తంగా కానీ చిల్లరగాగాని అమ్మేవారు. భుజాలమీద మోస్తూ వీధులు తిరిగీ అమ్మేవారు. ముప్పైరెండు ఓడరేవుల్లో వ్యాపారం సాగించేవారనీ (వేలాంగర/వేలోమ) పద్దెనిమిది నగరాల్లో

ఇలా చేసేవారని 64 యోగపీఠాల్లో, 64 ఘటికా స్థానాల్లో యిది సాగేదని వుంది. వీరికి స్వంత పతాకం వుండేదిట. కొందరు వ్యక్తులకు తన అధికారం లో వున్న కొన్ని బిరుదుల్ని, హక్కుల్ని ప్రసాదించే హక్కు కూడా ఈ శ్రేణికి వుండేదిట.

చప్పన్న దేశాలుగా పిలువబడిన 56 దేశాలలో ఈ అయ్యావళీ వ్యాపారులు వ్యాపారాన్ని శాసించారు అనడానికి ఎన్నో ఆధారాలు లభిస్తున్నాయి. ఈ అయ్యావళీ వ్యాపారులే అంతర్జాతీయ వాణిజ్యాన్ని శాసించారని తెలుస్తోంది. వీరే మొదటి సైనిక వ్యాపారులని చరిత్రకారులు అంటారు. 56 దేశాలలో వీరు వ్యాపారం చేయని ప్రాంతం లేదు, వీరు చేయని వ్యాపారం లేదని తెలుస్తోంది. ఈ సమయాలను వీరబలింజ ధర్మాన్ని పాటించేవారు అంటారు. అంటే కట్టుబాట్లు, వ్యాపారం లో ఒక క్రమబద్ధమైన నియమావళిని అనుసరించినట్లు కనిపిస్తోంది. ఈ వర్తక సంఘాలు పరిపాలనపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. అందుకే ఈ వ్యాపార సమయాలు రాజులను సైతం శాసించగలిగాయి.

ముమ్వత్తూర్ బీడు ముమ్మూరి దండలు

అయ్యావళీ ఐన్నూరు తో పాటు "ముమ్వత్తర్ బీడు ముమ్మూరి దండ" లను కాలచురి అహవమల్లుని (క్రీ.శ.1181) కన్నడశాసనం పేర్కొంటోంది.

ముమ్వత్తర్ అంటే 36 అని అర్థం, ముమ్వత్తర్ బీడు అంటే 36 ప్రాంతాలై వుండవచ్చు లేదా 36 రాజ్యాలైనా అయివుండవచ్చు, 36 సంత స్థలాలైనా అయివుండవచ్చు. ఎందుకంటే బీడు అంటే స్థలం అనే అర్థం వస్తుంది. ముమ్మూరి దండ అంటే మూడుమూరల కర్ర ను ఆయుధంగా ఉపయోగించే యోధులు అని ప్రముఖ చరిత్ర కారులు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు అభిప్రాయపడ్డారు. (దండ అంటే కర్ర, దండు అంటే గుంపు అనే అర్థం వున్నాయి. దండు వెడలె...దండెత్తారు...దండయాత్ర అనే పదాలను గమనిస్తే ఇది సైనికుల గుంపు అని అర్థమౌతోంది. ఈ ముమ్మూరి దండులే నేటి

మున్నూరు కాపులుగా పిలువబడినట్లు అర్థమౌతోంది).

వాస్తవానికి ఈ ముమ్మూరి దండ లేదా ముమ్మూరి దండు అనే వారు వర్తక సంఘాలను దోపిడీ దొంగల నుండి కాపాడే సైనికులు. మొదట్లో కేవలం జీతాలు తీసుకుని రక్షణ కల్పించడానికి ఒప్పందాలు చేసుకునే ఈ ప్రత్యేక సైన్యాలు తరువాత కాలంలో సమయాల లాభాలలో వాటాలు తీసుకునే స్థాయికి ఎదిగారు. తరువాత జరిగిన పరిణామంలో వీరే సమయనాయ కులయ్యారు. ఈ వీరబలింజ ముమ్మూరి దండు లలో వంద మంది దొంగలను ఒక్కడే ఎదిరించగలిగిన సైనికులు వుండేవారు. వీరంతా యుద్ధ విద్యలలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన వారు కావడం విశేషం. 32 రకాల ఆయుధాలను ప్రయోగించ గలిగే యుద్ధ నైపుణ్యాన్ని ఈ దండులు కలిగి వుండేవి.(బత్తీస ఆయుధప్రవీణులు)

ఈ ముమ్మూరి దండులు కాపలాగా వున్నప్పుడు దాడి చేయలేని దొంగలు చెట్టు పుట్టల చాటునుండి రాళ్లతో బిడారులపై దాడి చేసేవారు అప్పుడు ఈ ముమ్మూరి దండులు తమ చేతులలో వుండే మూడు మూరల కర్రలను తిప్పుతూ బిడారులకు కవచంగా వుండేవారు. వీరు కర్రను తిప్పితే దొంగలు విసిరే ఒక్కరాయి కూడా వీరిని దాటి బిడారి వైపు పడేది కాదంటారు. వీరు కేవలం కర్రసాము, కత్తి తిప్పడం వంటి యుద్ధ విద్యలలోనే కాకుండా మార్షల్ ఆర్ట్స్ లో సైతం ప్రావీణ్యం కలిగి వుండేవారు. ఈ సైన్యాలలోనే ''ఎక్కటి వీర పరివారం'' (స్పెషల్ కమాండో ట్రూప్స్) అనే వారు వుండేవారు వీరు ఒంటరులు. ఈ సైన్యం యుద్ధం లోకి వెళితే విజయం తథ్యమని నాటి రాజులు భావించేవారు. యుద్ధ సమయాలలో ఈ సైన్యం రాజుకు సహకరించేది.

ఒక్క ఓరుగల్లు నగరంలోనే 15,000 మంది వీరబలింజలు నివశిం చేవారని సిద్దేశ్వర చరిత్ర చెబుతోంది. వీరు దారిదోపిడీ దొంగల నుండి బిడారులను రక్షించడానికి ఎప్పుడూ సశస్త్రులై వుండేవారు.

నానాదేశి పెక్కండ్రు

పెక్కండ్రు, నానాదేశి పెక్కండ్రు వంటి సంస్థల గురించి అనేక శాసనాలు చెబుతున్నాయి. ఈ పెక్కండ్రు వర్తక సంస్థల గురించి ఖచ్చితమ్మైన వివరాలు తెలియడం లేదు. బహుశా ఇవి వివిధ కులాలకు చెందిన, వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపార సంస్థలై వుండవచ్చని పలువురు చరిత్రకారులు అభిప్రాయ పడుతున్నారు.

మన దేశం లోనికి వచ్చే ఇతరదేశాల వ్యాపారులను అనుసంధానం చేసే సంస్థలు అయివుండవచ్చు. వివిధ దేశాల నాణేల విలువలను, ఆయాదేశాల సరుకుల విలువలను స్థానిక వర్తకానికి అన్వయించే వ్యవస్థలై వుంటాయి. వీటికి ఇక్కడి కట్టుబాట్లతో సంబంధాలు వుండవు కనుక వారితో సజావుగా వర్తకం చేయాలంటే వారికి సంబంధించిన అవగాహన ఖచ్చితంగా వుండి వుండాల్సిందే. అలా ఇతర దేశాల వ్యాపారులతో సంబంధాలు నెరిపే ఐక్య వాణిజ్య సంస్థలనే సంస్థలనే నానాదేశి పెక్కండ్రు అన్నట్లు తెలుస్తోంది. ప్రపంచం లోని వివిధ దేశాలకు చెందిన ఐక్య వాణిజ్య వేదికలే నానాదేశి పెక్కండ్రు అయి వుండవచ్చు.

అంతర్జాతీయ వాణిజ్యం

ఈ శెట్టి సమయాలు దేశీయ వాణిజ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకు వెళ్లాయి.

క్రీస్తు పూర్వం మొదటి శతాబ్దం నుండి దేశం లో గణితశాస్త్రం, జ్యోతిష శాస్త్రం తో పాటు అన్ని రంగాలను బౌద్ధులు ఉచ్ఛస్థాయికి తీసుకు వెళ్లారు. దేశంలో యుద్ధాలు తక్కువ కావడం ప్రజలు శాంతియుతంగా జీవిస్తుండడంతో శాస్త్ర విజ్ఞాన రంగాలలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి.

ఈ క్రమంలోనే నౌకా వాణిజ్యం ఊపందుకుంది.

ఇక్కడ మనం జాగ్రత్తగా గమనిస్తే సముద్ర జలాలలో ప్రయాణం సాగించాలంటే కనీసం దిక్కూ, దిశ కనిపించవు. ఎటు వెళ్లాలో కూడా అర్థం కాదు. క్రీ.పూ.6,000 సంవత్సరాల నుండీ భారతీయులు సముద్రయానం చేస్తున్నట్లు ఆధారాలు వున్నాయి. (వాస్తవానికి భారతదేశంలో మొహంజదారో,

కాదు. క్రీ.పూ.6,000 సంవత్సరాల నుండీ భారతీయులు సముద్రయానం చేస్తున్నట్లు ఆధారాలు వున్నాయి. (వాస్తవానికి భారతదేశంలో మొహంజదారో, హరప్పా నాగరికతల కాలం నాటికే నౌకాయానం వుంది. లోథాల్ నౌకాశ్రయం తవ్వకాలలో బయట పడింది. ఇప్పటి అధునాతన నౌకాశ్రయాలకు ఏమాత్రం తీసిపోని విధంగా అద్భుతంగా నిర్మించారు).

అంటే అప్పటికే దిక్సూచి ని భారతీయులు ఉపయోగించి వుండాలి. నక్షత్ర గమనం పై స్పష్టమైన అవగాహన కలిగి వున్నారు అనడానికి ఇవి నిదర్శనాలుగా కనిపిస్తున్నాయి. అంతే కాదు సముద్రం ఏ ఏ కాలాలలో అల్లకల్లోలంగా వుంటుంది, ఎప్పుడు ప్రశాంతంగా వుంటుందనే అంశాలపై అవగాహన కలివుండేవారన్నది స్పష్టమౌతోంది. అంతే కాదు ఏ ఋతువులో తూర్పుకు ప్రయాణించాలి, ఏ కాలంలో పశ్చిమానికి ప్రయాణించాలి అన్న విషయాలపై కూడా వీరికి చాలా పరిజ్ఞానం వున్నట్లు కనిపిస్తుంది. రుతుపవన గాలులను తమ ప్రయాణాలకు అనుకూలంగా మలచుకున్నట్లు కనిపిస్తుంది.

ఇలా సముద్ర వ్యాపారాలకు తెరతీసిన శెట్టి సమయాలు తూర్పున వున్న ద్వీపాలపై తమ పట్టు సాధించారు. శాతవాహనుల కాలంలో రోమ్ సామ్రాజ్యంతో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసినట్లు తెలుస్తోంది. భారతదేశం మొత్తం పైన రోమ్ పాలకుల బంగారు నాణాలు ఆంధ్రప్రదేశ్ లో లభించినన్ని మరెక్కడా లభించకపోవడం వల్ల తెలుగు ప్రజలకు నేరుగా రోమ్ తో వ్యాపార సంబంధాలుండేవని తేటతెల్లమౌతోంది.

రోమ్ లో భారతదేశం నుండి దిగుమతి అయ్యే అతి పలుచటి వస్త్రాలకు మంచి గిరాకీ వుండేదని తెలుస్తోంది. '' హిందూదేశం నుండి దిగుమతి అయ్యే అతి పలుచటి వస్త్రాలను ధరించి రాజరికపు స్త్రీలు సిగ్గులేకుండా తిరుగుతున్నారు'' అని రోమ్ శాసన సభ్యుడు, రచయిత ''ప్లినీ'' క్రీ.శ.70 లలో వ్రాసాయాడు. దీన్ని బట్టి మన నూలు, పట్టు వస్త్రాలకు రోమ్ సామ్రాజ్యంలో మంచి గిరాకీ వున్నట్లు తెలుస్తోంది.

వీరబలింజ సమయాలు

శెట్టి సమయాల గురించిన సమాచారం ఎక్కువగా వీరబలింజ శాసనాలలో కనిపిస్తుంది. వీరబలింజ ధర్మ ప్రతిపాలకా, వీరబలింజ్య ధర్మోపదేశ

కర్త, అయ్యావళీ పంచాశత విరసనన (500 వీరశాసన), సహస్త్ర గుణాలం కృత, అంటూ సంబోధనలు కనిపిస్తాయి. ఈ సమయాలు బలిజకులస్తుల ఆస్థులు కాదు. బలిజ వీరుల రక్షణలో వుండే సమయాలు కాబట్టి వీటికి "వీరబలింజ సమయాలు" అనేపేరు వచ్చి వుండవచ్చు.

వీరబలింజ ధర్మం అంటే ఈ సమయాలు ఏర్పాటు చేసిన కట్టుబాట్లు. ఈ కట్టుబాట్లను తు.చా తప్పకుండా పాటించే కులాలను వీరబలింజ సమయాలుగా పరిగణించి వుంటారు. ఈ బలిజ వీరులలో ఒంటరులు అనేవారు వుండేవారు వీరు వందమంది దొంగలు దాడి చేసినా ఒక్కరే ఎదుర్కొని పారద్రోల గల సమర్థులు అని తెలుస్తోంది. వీరు కత్తి తిప్పడంలోనే కాదు మార్షల్ అర్ట్స లో కూడా ప్రవీణులై వుండేవారని తెలుస్తోంది. వీరి వల్లనే ప్రాచీన భారతీయ యుద్ధ విద్యలు తూర్పుదేశాలకు చేరాయి. ఈ వీరత్వం వల్లనే వీరు ఈ సమయాల పై పెద్దరికాన్ని సంపాదించి వుండవచ్చు.

వీరబలిజలకు సంబంధించి 500 వీర శాసనాలు వున్నట్లు తెలుస్తోంది. ఈ శాసనాలలో చాలా తక్కువ శాసనాలు మాత్రమే ప్రచురితమ య్యాయి. గుంటూరు జిల్లా చింతపల్లిలో క్రీ.శ.1240 నాటి శాసనం లభించింది. ఇది ప్రచురితం కాలేదు దీన్ని బట్టి ఉభయ నానాదేశులు, గవరేలు, ముమ్మొరిదండులు అంతా ఒకటే అని తెలుస్తోంది. దీని లోనే వీరు పంచాశత (500) వీరశాసనాలు అందుకున్నట్లు వ్యక్తమైంది.

వీరబలింజ ధర్మ రక్షకులు వీళ్లేనట అని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు అంటారు. వీరి గురించి కన్నడ శాసనాల్లో " సాహసవంతుల్లో సాహస వంతులు, సన్మార్గులకు సన్మార్గులు, దుర్మార్గులకు సింహస్వప్నం, శత్రు భయం కరులు" అని వుందని మల్లంపల్లి సోమశేఖర శర్మగారు తన "రెడ్డి రాజ్యాల చరిత్ర" గ్రంథంలో తెలిపారు.

ఈ సమయాలకు సంబంధించిన కులాలలో "తొగట" కులస్తు లు కూడా రక్షకులుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. అందువల్లనే వీరికి తొగటవీర క్షత్రియులు అనే పేరు వచ్చివుండవచ్చు. చౌడేశ్వరీ దేవి ఉత్సవాలలో వీరు కత్తులతో చేసే విన్యాసాలు వుండడం దీనికి ఊతమిస్తోంది. కానీ వీరి కులవృత్తి చేనేత కావడంతో వీరు ప్రత్యేక సైనిక వ్యవస్థగా మారిన ఆధారాలు కనిపించవు.

శెట్టి సమయాలలోని అన్ని కులాలలో కాస్తో కూస్తో కత్తి తిప్పగలిగిన యువకులు వుండే వారని తెలుస్తోంది.

వాస్తవానికి భారతదేశంలో అంతర్జాతీయ వాణిజ్యం ఎక్కువగా దక్షిణ భారతదేశం నుండే జరిగినట్లు కనిపిస్తుంది. యూరప్ తో కూడా వీరే అత్యధికంగా వ్యాపారం చేసినట్లు కనిపిస్తోంది.

తాజాగా మెసపటోమియా నాగరికత కాలం నాటివిగా భావిస్తున్న కాల్చిన మట్టి ఫలకాలలో అచ్చమైన తెలుగు లేఖలు దొరికాయి. వాటిలో ఒక వ్యాపారి రాసి న లేఖ కూడా దొరికింది.

ఇంత ప్రాచీన మైన వ్యవస్థలో ప్రతి కులానికి ఒక వృత్తి వుంది కానీ బలిజ అనే కులానికి అలా ప్రత్యేకమైన వృత్తి చరిత్రలో కనిపించదు. మరి ఏ వృత్తి లేకుండా ఈ కులం ఎలా రాణించగలిగింది? ఈ సమయాలను ఎలా శాసించ గలిగింది ? అని నాకు చాలా సందేహాలుండేవి. ధైర్యసాహసాలు కలిగిన ఈ జాతి వ్యాపార సమయాలకు మొదట్లో రక్షకులుగా వ్యవహరించారు. రాజ్యం వీరభోజ్యం అన్న చందంగా వీరి ధైర్యసాహసాలే వీరి పెట్టుబడులుగా సమయాల లాభాల్లో వాటాలు స్వీకరించారు.

ఈ సమయాలను రక్షించే ప్రైవేటు సైన్యాలు గా ప్రస్థానం ప్రారంభించి వుంటారు. వీరి రక్షణలోనే సుదూర తీరాలతో వర్తక,వాణిజ్యాలు జరిగాయి. సంపద వున్న దీవులలో వున్న పాలకులు ఈ సమయాలకు సహకరించకపోతే ఈ సైన్యాల అధిపతులే ఆ ప్రాంతాలను ఆక్రమించుకుని వలస రాజ్యాలను స్థాపించారు. అలా ఏర్పడినవే తూర్పున వున్న బర్మా, థాయిలాండ్ వంటి దేశాలలోని ప్రాచీన తలైంగుల రాజ్యాలు. బలిజ కులంలో తెలగాలు, ఒంటరి అనే తెగలు వృత్తి సైనికులుగా మనుగడ సాగించినట్లు చరిత్ర చెబుతోంది.

దేశం లో కూడా నాలుగైదు సమయాల సైన్యాలు కలిస్తే చిన్న చిన్న రాజ్యాలను కబళించ గలిగే సామర్థ్యం కలిగి వుండేవి. అందు వల్లనే తమ మాట వినని రాజ్యాలను ఈ సమయాలు హస్తగతం చేసుకున్నాయి.

అప్పటి శాసనాలలో 1.సెలగోలబలం, 2.విలుకాండ్రు, 3.కైజీతగాండ్రు, 4.ఎక్కట్లు వీరందరూ కాల్బలంలోని సైనిక విభాగాలు. వీరిలో సెలగోల బలం అంటే ఈటెలను ఆయుధాలుగా వాడేవారు. ఈ బల్లేలను నేజ అని కూడా అనేవారని తెలుస్తోంది.

రెండవ వర్గం విలుకాండ్రుు విల్లుల ద్వారా బాణాలను సంధించే సైనికులు. వీరు బాణాలపై తమ పేర్లు చెక్కించుకునేవారట. మూడవ వర్గం కైజీత గాండ్రుు వీరే వీరబలింజ సమయాలకు చెందిన సైనిక విభాగం. తాత్కాలికంగా యుద్ధ సమయాల్లో మాత్రమే పాల్గొనే సైనికులు అని చరిత్రకారులు రాశారు. ఈ వివరాలు 12 వ శతాబ్దం నాటి మొదటి విజయభాను పొన్నారువ శాసనంలో వేలైక్కార దళం గురించి ప్రస్తావించబడింది. ఇందులో మహాతంత్ర, వలాంజియార్(వీరబలింజ), నాగరతార్ (నకరసైన్యం).

ఇవే కాకుండా తమిళ రాజుల సైన్యంలో వలాంగై సైన్యాలు (కుడిచేతి కుల సైన్యాలు) ఎక్కువగా వుండేవి అని చోళరాజుల శాసనాలను బట్టి తెలుస్తోంది. కైజీతం అంటే శపథాయుధానిసేవి అని ఆంధ్ర భాషార్ణవం లో కోటి వెంకనార్య పేర్కొన్నారు. అంటే యుద్ధభూమి నుండి వెనుదిరగను అని శపథం చేసిన సైనికులన్న మాట. విజయమో.వీరస్వర్గమో తప్ప మరో మాట వీరెరుగరని చరిత్రకారులు అంటారు.

ఇక ‘‘ఎక్కట్లు‘‘ వీరు ఒంటరులు అరివీర భయంకరులు. వీరి గురించి చెప్పాలంటే ఎంత చెప్పినా తక్కువే...ఒక్కొక్కడూ వందమంది సైనికులు పెట్టు. యుద్ధం చేజారి పోతోంది అన్న సమయంలో చివరగా యుద్ధానికి వెళ్లే స్పెషల్ ఫోర్సులు ఈ ఎక్కట్లు. వీరు ద్వంద యుద్ధానికి సైతం ఎప్పుడూ సిద్ధంగా వుండే వారు. అన్నిరకాల ఆయుధాలను అలవోకగా ఉపయోగించడం మేకాకుండా మార్షల్ ఆర్ట్స్ లో కూడా వీరు సిద్ధహస్తులు.

ఈ సమయాల నుండి పుట్టుకొచ్చినవే దక్షిణాదిన వున్న నాయకరాజ వంశాలు. ఈ నాయకరాజ వంశాలలో కూడా పేరెన్నికగన్న వ్యాపారులు చాలామంది వున్నారు. వీరిలో ప్రధానంగా చెప్పుకోదగ్గ కుటుంబాలు మధురను పాలించిన విశ్వనాథనాయకుని తండ్రి కొటికం నాగమనాయకుడు, ఈయన వంశీకులు గాజుల వ్యాపారులుగా ప్రస్థానం ప్రారంభించి, వజ్రాల వ్యాపారులుగా, సైన్యాధిపతులుగా ఎదిగినట్లు కొటికంవారి కైఫీయత్ ద్వారా తెలుస్తోంది. శ్రీకృష్ణదేవరాయల తల్లి నాగాంబ పిన తండ్రి కుమారుడే నాగమనాయకుడు. తూర్పు, పశ్చిమ తీరాలలోని వాణిజ్యాన్ని శాసించాడు. జింజి కోటను పాలించిన తుపాకుల కృష్ణప్ప నాయకుడు, అతడి అన్న కుమారుడు అచ్యుతప్ప శెట్టి వంటి వారు అంతర్జాతీయ వాణిజ్యాన్ని శాసించారు.

అచ్యుతప్ప శెట్టి కోరమాండల్ తీరాన్ని మొత్తం శాసించినట్లు చారిత్రక ఆధారాలు కనిపిస్తున్నాయి. ఈయన కు పలు దేశీ విదేశీ కంపెనీలలో వాటాలు ండేవని తెలుస్తోంది. అచ్యుతప్ప తరువాత ఈయన తమ్ముడు చిన్నన్నకు కోరమాండల్ షిప్పింగ్ కంపెనీ తోపాటు రాయల్ షిప్పింగ్ కంపెనీలో వాటా వుండేదని తెలుస్తోంది. ఈ కుటుంబాలు మొత్తం శెట్టిసమయాలకు చెందినవే కావడం గమనించదగ్గ విషయం. ఈ కుటుంబాలు విజయనగర రాజుల బంధువులు కావడంతో విదేశీ వ్యాపారులు సైతం వీరి అండ లేకుండా వ్యాపారాలు చేసుకోలేక పోయారు. పోర్చుగీసు వారికి అచ్యుతప్పశెట్టి నమ్మకమైన దళారిగా ఉండేవాడని పోర్చుగీసు వారి డైరీల వలన తెలుస్తోంది.

ఈ సమయాల స్ఫూర్తితోనే యురోపియన్ వ్యాపారులు ప్రైవేటు సైన్యాల ను సమకూర్చుకోవడం నేర్చుకున్నారు. ఈ క్రమంలోనే భారతదేశంలోని ఉపాధికోల్పోయిన వృత్తి సైనికులకు ఉద్యోగాలు ఇచ్చి ఈస్టిండియా కంపెనీ తన సైన్యాన్ని పెంచుకుంది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలలో బ్రిటీషు సామ్రాజ్యం తరపున దేశ విదేశాలలో పోరాటం చేసిన తెలగరెజిమెంట్స్ ఈ సమయ పాలకుల వారసులే. ఈ సైన్యాల వల్లనే భారతదేశం మొత్తాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకుంది ఈస్టిండియా కంపెనీ. ఈ సైన్యాలనే నిజాం నవాబు వంటి వారికి అద్దెకు ఇచ్చి (సైనిక సహకార పద్ధతి) దత్తమండలాల వంటి అనేక ప్రాంతాలలో పన్ను వసూలు చేసుకునే అధికారాన్ని బ్రిటీషువారు దక్కించుకున్నారు.

కాపులు

కాపు అంటే వ్యవసాయదారుడని తెలుగు నిఘంటువులు పేర్కొం టున్నాయి. చాలా మంది కూడా కాపు అంటే రైతు అనే అర్థం తోనే ఈ పదాన్ని వాడుతున్నారు. కాపు(రాయలసీమ రెడ్లు కూడా కాపులమని చెప్పుకుంటారు ఈ ప్రస్తావన వారి గురించి కాదు) కులస్తులను కూడా వ్యవసాయదారులు కాబట్టే వీరిని కాపులన్నారని అంటారు. నిజానికి ఈ భావన తప్పు. దేశ వ్యాప్తంగా వ్యవసాయం చేసే అనేక కులాలు వుండగా ఒక కులస్తులు మాత్రమే కాపులు గా ఎందుకు పిలువబడ్డారు.

వ్యవసాయం చేసే వారంతా కాపులేగా...మరి ఆయా కులాలు ఎందుకు కాపులుగా పిలువబడలేదు? ఈ కాపులు రక్షకులు కాబట్టే కాపులుగా పిలువబడ్డారు. ప్రస్తుత గుంటూరు, విజయవాడ ప్రాంతాల లో నివసించే వారిని పెదకాపులని, మహానాటి కాపులని పిలుస్తారు. ఈ కాపు అనే పేరు వీరు రక్షకులుగా వ్యవహరించినందు వల్ల వచ్చిందే కానీ మరొకటి కాదు. ప్రాచీన భారతీయ వ్యవస్థలో ప్రతి కులం ఒక బాధ్యతను తలకెత్తుకుంటే కాపులు అరాచక శక్తుల నుండే సమాజాన్ని కాపాడే రక్షణ బాధ్యతలను నెత్తికెత్తుకున్నారు. వీరబలింజ ధర్మరక్షకులమని శాసనాలలో చెప్పుకున్నారు.

అందువల్లనే తెల్లపాలన వచ్చే వరకు ఈ కులస్తులే గ్రామాధికారులుగా, సమాజ రక్షకులు గా వ్యవహరించారు. 56 దేశాలను పరిపాలించిన 96 తెగలలో ''నాయక''అనే తెగకు చెందిన బలిజ కులస్తులు ఒకరు.(థర్‌స్టన్ కేస్ట్స్ అండ్ ట్రైబ్స్, బాంబే గెజిట్ ఆధారం) ఈ 96 తెగలే దేశ వ్యాప్తంగా గ్రామ పరిపాలనను నిర్వహించాయి. రాజులు మారినా గ్రామాధిపత్యం గ్రామాలలో కట్టుబాట్లు మారేవి కావు. సమాజంలో కులాలు ఎవరి బాధ్యతలను వారు కట్టుబాట్లకు లోబడి నిర్వహించేవారు. ఈ 96 తెగలు ఒకే మూలం కలిగిన జాతి లోని విభాగాలు. వివిధ భాషల్లో వివిధ పేర్లతో పిలువబడిన ఒకే కులంగా ప్రాచీన శాసనాలు సైతం చెబుతున్నాయి.

కులాల ఐక్యత

ఈ శెట్టి సమయాలలో వుండే కులాలన్నీ పరస్పరం సహకరించు కునేవి. వీరు సముద్ర వ్యాపారం చేయడానికి వెళ్లేటప్పుడు నావలను నిర్వహించే వారంతా సమర్థులైన యుద్ధవీరులై వుండేవారు.

వీరు తక్కెడతో వ్యాపారం నిర్వహించడమే కాకుండా, కత్తిపట్టి యుద్ధం చేయడంలో కూడా నైపుణ్యం కలిగివుండేవారు.

ఈ లక్షణాల వల్ల శెట్టి సమయాలు 56 దేశాల భరతఖండంలో తమకు ఎదురు లేకుండా పాలించాయి. వీరిని వ్యతిరేకించే అధునాతన భావాలు కలిగిన

వామాచార కులాలపై ఆంక్షలు విధించి అణచి పెట్టిన సందర్భాలు కూడా లేక పోలేదు. చాలా శాసనాలలో చూసినప్పుడు కులాల హద్దుల పేరు తో ఎలా అణచి పెట్టారో కనిపిస్తుంది.

శెట్టిసమయాలు బలోపేతం కావడం, మెజారిటీ కులాలకు వేదికలు కావడంతో వీరి సలహా సంప్రదింపులు లేకుండా రాజ్యపాలన చేసే పరిస్థితులు నాడు లేకుండా పోయాయి. పన్నులు విధింపు, వసూలు వంటి కీలక వ్యవహారాలలో శెట్టి సమయాలు ముఖ్య భూమిక పోషించాల్సిన అవసరం ఏర్పడింది.

ఈ కులాలన్నీ ఒకే మాటపై నిలబడిన క్రమంలో నాటి రాజులు కూడా వీరికి ప్రాధాన్యత ఇవ్వక తప్పింది కాదు.

ఈ క్రమంలో శెట్టి సమయాలు కేవలం వ్యాపార సమయాలు గానే కాకుండా సాంఘిక, సామాజిక సమయాలుగా కూడా అతి పెద్ద పాత్రను పోషించాయి.

అలంగీరు పాదుషా గా పిలువబడిన ఔరంగాజేబు గోల్కొండ గెలిచిన తరువాత గోల్కొండలో విజయోత్సవాలు జరిపించాడు. ఈ సందర్భంగా తన రాజ్యంలోని సామంతులకు, సైన్యాధిపతులకు బహుమాన తాంబూలాలు ఇవ్వదలచి మహానాడు ఏర్పాటు చేశాడు. ఈయన వద్ద సైన్యాధిపతిగా పనిచేసిన ఎర్రంశెట్టి మీరాపాత్రుడు గాంధార ప్రాంతాన్ని, గోల్కొండను గెలుచుకోవడం లో ప్రధాన భూమిక పోషించాడు.

ఈ నేపథ్యంలో గోల్కొండలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎర్రంశెట్టి మీరాపాత్రుడు హాజరు కాలేదు. ఆయనతో పాటు చాలామంది పెద్దలు గైర్హాజరయ్యారు. వారెందుకు సమావేశానికి రాలేదని చక్రవర్తి అడిగితే వారు సమయంకట్టి బయటవున్నారని సేవకులు తెలిపారు.

అప్పటి ముస్లిం పాలకులు హిందువులపై వేసే అసంబద్ధమైన, అసహ్యకరమైన పన్నులకు నిరసనగా శెట్టి సమయాల నాయకులైన ఎర్రంశెట్టి మీరాపాత్రుడు, మైగాలపు బెజ్జానీడు, కనకాల నల్లాపాత్రుడు ల నాయకత్వంలో శెట్టి సమయాల పెద్దలు ఆహ్వాన తాంబూలాలు ముట్టుకోకుండా నిరసన తెలియజేశారు.

వారిని పిలిపించి సమయం కట్టడానికి కారణమేమిటని పాదుషా అడిగాడు.

దానికి సమాధానంగా అన్యాయమైన పన్నులు రద్దు చేయాలని సమయ నాయకులు కోరారు.

పన్నులు రద్దు చేస్తే ఖజానాకు నష్టం వాటిల్లుతుంది కదా అని పాదుషా ప్రశ్నించాడు.

అప్పుడు సమయ నాయకులు పాదుషాగారు శెలవు దయచేయిస్తే దేశాల వెంబడి సంతలు సాగించి, సాయరు కట్టించి అర్థము భర్తీ చేస్తాము అని హామీ ఇచ్చారు. సరే మీరు అడిగినట్లు జరిగిస్తాము నజరు ఏమిస్తారు అని అడిగాడు.

కంచి కామాక్షమ్మ వరప్రసాదమైన బెజ్జనీడు కోటలో రాజ మహాలు చుట్టూ తవ్వించి పన్నెండు కణజాల ద్రవ్యాన్ని చూపించాడని బెజ్జనీడు శక్తిని చూసిన ఔరంగాజేబు పన్నులు రద్దు చేయించాడని తెలుస్తోంది.

శాసన పాఠము (ఇలియట్ దొర శాసన సంపుటాల నుండి)

ఎర్రంశెట్టి మీరాపాత్రుడు వలదు యెలిజేటి శ్రీగవిరి అర్కా గుండవర ప్రవర్ధనవరాత్త జగదేవు కంశెంజేటి అశ్వపతి, గజపతి, నరపతి మూడు సింహాసనాల రాజులున్నూ దేశాలలో నడిపించుచున్న వర్ణాశ్రమ ధర్మాల కల్లా పన్నులు.

1. గోవుల తోకరూకలు పన్ను
2. బ్రాహ్మణులకు బొట్ల పన్ను
3. తలవెంట్రుక స్త్రీలకు వర్ణాశ్రమ ధర్మాల పన్ను
4. ఋతువుల పన్ను
5. స్థనముల పన్ను
6. శుభ శోభనాలకు పన్ను
7. సమస్త వర్ణాశ్రమ ధర్మాల వారికి పన్ను

ఈ పన్నులు రద్దు చేస్తూ

1. పెండ్లిండ్లకు దేవుని కట్నం	1రూక
సమయ మంత్రి కట్నం	1 రూక
ఒజ్జలు కట్నం	1 రూక
మంగలి వాని కట్నం	1 రూక

2. పంట పుట్టి కుంచాలు, గోనెకు హర్బజాకు 1కి 1 కాసు

ఈ పద్ధతిన ఏర్పాటు చేసి మహానాటి పెద్ద మాట మీరితే

1) కులం తప్పు 2) మహానాటి వారి తప్పు 3)దివాణం తప్పు 4) దేవుని తప్పు విధిస్తారు.

ఇందుకు సాక్షులు :

1. పూర్వలింగ
2. నారదలింగ
3. మార్కండేయులు
4. కవి సర్వాంచనులు

పాదుషా పార్సీ దస్కత్తు వున్నది.

చరిత్రలో అతిక్రూరుడుగా పేరుగాంచిన ఔరంగాజేబు చక్రవర్తి నే తమ దారిలోకి తెచ్చుకుని హిందువుల పై వేసిన అన్యాయమైన పన్నులను రద్దు చేయించిన శెట్టి సమయాల ఐక్యతా ప్రభావం ఎలాంటి దో ఈ శాసనం చెబుతోంది. ఒక రకంగా ఈ పుస్తక రచనకు నన్ను ప్రేరేపించినది కూడా ఈ శాసనమే అని చెప్పాలి. ఐక్యంగా ఎంతటి రాజులనైనా చక్రవర్తులనైనా తమ దారిలోకి తెచ్చుకోగలిగిన ఈ శెట్టి సమయాల బలాన్ని గ్రహించిన తెల్ల వారు ముందుగా విభజించడానికి శ్రద్ధ చూపించింది ఈ సమయాలపైనే.

జనజీవనం లో శెట్టి సమయాల పాత్ర

ప్రజాస్వామ్యం... ఈ పదం నేడు మనం వింటున్నదే....నేడు మనం జీవిస్తున్నదిక్కడే...నిజానికి ఇక్కడ ప్రజలు కేవలం ఓట్లు మాత్రమే వేస్తారు. అంతకంటే అధికారం చలాయించే అవకాశాలు కనిపించవు. ప్రజల ఓట్లతో అధికారం చలాయించేవారు వారి స్వలాభాలే తప్ప ప్రజల గురించి పట్టించు కున్న దాఖలాలు కనిపించవు. ఇందులోని ఏ వ్యవస్థ కూడా సామాన్యునికి మద్దతుగా వుండదు...వున్నట్లుగా కనిపిస్తుంది అంతే.....

కాని ప్రాచీన భారతీయ వ్యవస్థ అంతా అసలు సిసలైన ప్రజా స్వామ్యాన్ని చవిచూసింది అనడానికి నేను ఎంతగానో గర్వపడు తున్నాను. తమకేం కావాలో

ఆనాటి ప్రజలకు తెలుసు...వాటిని ఎలా సాధించుకోవాలో కూడా వారికి తెలుసు...

నాటి పరిపాలనలో గ్రామం అంటే వివిధ జాతుల సమాగం. నేడు వుండే విధంగా ప్రతిదానికీ పట్టణాలపై ఆధారపడే వ్యవస్థ నాడు లేదు. ఆనాడు పట్టణాలే గ్రామాలపై ఆధారపడే వ్యవస్థ వుండేది. గ్రామాలు స్వయం సమృద్ధాలు.

గ్రామంలో విభజన ఏ విధంగా వుండేదంటే

ప్రతి కులానికి ఒక పెద్ద వుండేవాడు. ఈ పూర్వాచార లేదా శెట్టి ఆచార కులాల పెద్దలను శెట్టి అని పిలిచేవారు.

నిజానికి ఈ శెట్టి అనే పదం శ్రేష్ఠి అనే పదానికి వికృతి.

శ్రేష్టుడు అంటే ఉన్నతుడు, ఉత్తముడు అనే అర్థాలు వున్నాయి. ఇలా కులానికి వుండే పెద్దను శెట్టి అనేవారు.

ఉదాహరణకు చాకలిశెట్టి, మంగలిశెట్టి, కుమ్మరిశెట్టి, కోమటిశెట్టి, మాలశెట్టి.....వైగైరా....

ఒకే వృత్తి కలిగిన కులాలను శ్రేణులుగా పరిగణించేవారు. ప్రతి శ్రేణికి పెద్దలుండే వారు వారిని శ్రేణిప్రముఖ్, శ్రేష్ఠిశెట్టి అని పిలిచేవారు (ఉత్తర భారతదేశంలో "శేఠ్" అనే పదం కూడా దీనికి సంబంధించినదే). చాలా వరకు ప్రతి కులానికి వున్న పెద్దను శెట్టిగానే సంభోందించేవారు.

ఈ కులాలన్నింటికీ పెద్దగా శెట్టిబలిజ కులస్తుల ఇండ్లలో దేశాయి శెట్టిని నియమించేవారు (మహానాటి శాసనాల ఆధారంగా బలిజవారిని మహానాటి పెద్దలుగా నియమించిన శాసనాల ఆధారంగా బలిజవారిని శెట్టిగా నియమించినట్లు తెలిసింది. ఇతర కులాల వారిని దేశాయి శెట్టిగా నియమించినట్లు ఆధారాలు లభించనందువల్ల ఇలా రాయడం జరిగింది-రచయిత)

ఇలా గ్రామం మెుత్తానికి వుండే దేశాయిశెట్టి గ్రామాధికారిగా, న్యాయాధికారిగా వుండేవాడు. ఈయన క్రింద చలువాది అనే ఒక సహాయకుడు వుండేవాడు. ఇతను నేడు జిల్లాకలెక్టర్ వద్ద వుండే బిళ్ల జమాను లాగా వుండేవాడు. వస్త్రధారణ కూడా అలాగే వుండేది నేటి బిళ్ల జమాను వస్త్రధారణకు స్ఫూర్తి ఈ చలువాది వారే. ఈ పదవిని మాల కులస్తులకు తప్ప అన్యులకు

ఇచ్చేవారు కాదు. ఇక ఈ సమయాలలో వివిధ వృత్తుల వారు అంటే కల్లు తీసే ఈడిగవారు, ఉప్పరి వారు, గాండ్ల వారు, చేపలుపట్టే బెస్తవారు తదితరులు వుండేవారు.

చాలామంది బ్రాహ్మణులు అగ్రకులంగా వున్నారు కదా వారే దిగువ కులాలపై ఆధిపత్యం వహించారని తెలియని రాతలు రాస్తూ చాలామందిని తప్పుదోవ పట్టిస్తుంటారు. కానీ వాస్తవానికి బ్రాహ్మణులు మొదట వామాచార కులాల జాబితాలో వుండే వారని, పాంచానం వారితో ఏర్పడిన ఘర్షణలతో ఆ గుంపునుండి బయటకు వచ్చారన్న అభిప్రాయాలున్నాయి. వామాచార కులాల గుంపునుండి బయటకు వచ్చిన వారు తటస్థంగా వుండిపోయారు. నిజానికి వారు తటస్థంగా వున్నా పూర్వాచార కులాలకు మద్దతుగానే వున్నారు.

ఇలా గ్రామాలలో వృత్తికులాలు, వ్యాపార కులాలు, పాలక కులాలు, సేవికాకులాలు గా ప్రజలు వున్నప్పటికీ ఈ శెట్టి సమయ కులాలలో ఎక్కువ తక్కువ అనే భావనలు వుండేవి కావు. ఎవరికి వారు తమ హద్దులను గుర్తుంచు కుని చరించడంతో ఈ సమస్యలు తలెత్తేవి కావు. ఈ కులాల మధ్య ఒక అద్భుతమైన సాన్నిహిత్యం నెలకొని వుండేది. ఈ కులాలు బంధువుల లాగా వావి వరుసలతో పిలుచుకోవడం నిజంగా అద్భుతమైన విషయం. ఈ వ్యవస్థలో అంతర్భాగాలైన కులాలు ఇప్పటికీ గ్రామాలలో ఇలాగే పిలుచు కుంటారు.

అలా పిలుచుకోవడంలో తాము ఎక్కువ తక్కువ అనే భావనలకు వారు దూరంగా కలసిమెలసి జీవించగలిగారు.

సేవికా కులాలకు చెందిన రజక వనిత గ్రామాధికారి అయిన దేశాయి శెట్టి ని అయ్యా అని కానీ, దొరా అని కానీ పిలవడం జరగదు. చిన్నాయనా, మామా అంటూ ఖచ్చితంగా వావి వరుసలతో పిలవడం నేను ప్రత్యక్షంగా చూశాను. అందుకే నేను ఈ వ్యవస్థను చాలా గొప్ప వ్యవస్థగా అభిప్రాయ పడుతున్నాను.

ఇక కులాల హద్దులు ఎలా వుండేవి?

ఒక కులం ఆచరించే వృత్తిని మరో కులం ఆచరించకూడదు ఇది పూర్తిగా నిషిద్ధం.

క్షురకులు నిజానికి వీరు ఇప్పుడు ''నాయీ బ్రాహ్మణులుగా''

చెప్పుకుంటున్నారు. కానీ మంగలి అన్నది మంగళ అనే మంగళ కరమైన పేరు. వీరు కేవలం క్షవరం చేసేవారుగానే చాలామంది చూస్తారు కానీ వీరు సంగీతరంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. దేవాలయాలలో హారతి చ్చేటప్పుడు మంగళవాయిద్యాలను వాయించే వారు కాబట్టి వీరిని మంగళవారు అన్నారు.

వీరు మంగళవాయిద్యాలు వాయించేవారు కొద్దిమంది పోగా మిగిలి నవారు ఎలా జీవించాలి?

అలా వీరు క్షవరాన్ని వృత్తిగా ఎంచుకున్నారు.

వీరికి బ్రతుకుతెరువుకు ఇబ్బంది కలగకూడదని.

నాటి శెట్టిసమయాలు స్వీయ క్షవరం పై నిషేధాన్ని విధించాయి.

స్వంతంగా క్షవరం చేసుకుంటున్నారు అంటే వారు వెలివేయబడినవారిగా పరిగణించేవారు. వీరు ఈ సేవలు అందించినందుకు గాను సంవత్సరానికి కొంత ధాన్యాన్ని ఆయా కుటుంబాలు చెల్లించేవి. ఈ రకంగా ధాన్యాన్ని చెల్లించే పద్ధతిని "మిరాశ" "మ్యార" అని వ్యవహరించేవారు. ఇలా సంవత్సరం నాడు ఈ కుటుంబాలకు దక్కే ధాన్యం చాలామంది రైతులు పండించే ధాన్యం కంటే ఎక్కువగా వుండడం కూడా జరిగేది.

అలాగే రజక కుటుంబాలకు కూడా "మిరాశ " వుండేది. దీనితో పాటు దేవాలయా లలో సేవలు అందించినందుకు గాను ఈ రెండు కులాలకు మాన్యాలు కూడా వుండేవి. ఇప్పటికీ చాలా దేవాలయాలలో మేళంమాన్యం,కసువుమాన్యం అంటూ కేటాయించి వుండడం కనిపిస్తుంది. ఇవే కాకుండా ఇళ్ళలో శుభకార్యాలు, పండుగలు పబ్బాలలో ఈనాం ల పేరుతో ఎంతో కొంత ముట్ట జెప్పాల్సి వచ్చేది. ఇది సంబంధిత కుటుంబం ఆర్థిక స్థోమతపై ఆధారపడి వుండేది. బట్టలు, బంగారు నగలు కూడా డిమాండ్ చేసేవారు.

అప్పటి వ్యవస్థలో బట్టలు వుతుక్కోవడం పై నిషేధం లేకపోయినా... మహిళల బహిష్టు బట్టలు, చావు సమయాల్లో అంటు బట్టలు ఉతుక్కోవడం పై నిషేధం వుండేది.

సేవలు అందించే కులాలకు ఆకర్షణీయమైన ఆదాయం వుంటేనే వారు సంతృప్తిగా సేవలు అందించగలరనే కారణంతోనే ఈ కట్టుబాట్లు చేసినట్లు

కనబడుతోంది. అదే విధంగా కమ్మరి,వడ్రంగి కుటుంబాలకు కూడా "మిరాశ" ఇచ్చే వారు.

ఉత్పత్తి సేవలు అందించే కులాలలో కుమ్మరి, కమ్మరి, వడ్రంగి వంటి కుటుంబాలు ప్రధానమైనవి. వీరిలో కుమ్మరులు శెట్టి ఆచార కులాలకు చెందిన వారు కాగా కమ్మరి, వడ్రంగి వంటి పనులు చేసే పాంచాననం వారు వామాచార కులాలకు చెందిన వారు.

ఒకానొక కాలంలో ఈ పాంచాననం వారు వడ్రంగం, కమ్మరం, శిల్పం వంటి కళలు తమ స్వంతం కావడంతో పూర్వాచార కులాలకు సేవలు అందించకుండా సహాయనిరాకరణ చేశారు.

మేము కాడి, మేడి చేయకుండా మీరు వ్యవసాయం చేయగలరా, మేము మగ్గం చేయకుండా బట్ట నేయగలరా. మేము శిల్పం చెక్కకుండా మీరు దేవాలయాలు కట్టగలరా, మేము నగలు చేయకుండా మీరు కనీసం పెళ్లిళ్లు చేసుకోగలరా అని అహంకరించడంతో, పూర్వాచార కులాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. సమస్య పరిష్కారంలో భాగంగా తమ తమ కులాలలో వున్న యువకులను ఆయా వృత్తులు నేర్చుకుని సేవలు అందించాల్సి ందిగా శెట్టి సమయాలు ఆదేశించాయి.

ఆ క్రమంలో భాగంగానే పూర్వాచార కులస్తులు ఈ వృత్తులు నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. పూర్వాచార కులస్తులలో పాంచాననం వారు చేసే ఐదు వృత్తులను చేసేవారు కనిపిస్తారు. తిరుపతిలో చందనం బొమ్మలు చేసే వృత్తిలో వుండేవారు అధికులు బలిజ కులస్తులే కావడం ఇందులో భాగమే. ఆ విధంగా పట్టుదలగా తమను తాము అభివృద్ధి చేసుకున్నాయి శెట్టి సమయాలు.

ఈ క్రమంలో తమ అవసరాన్ని ఆసరాగా చేసుకుని పూర్వాచార కులాలపై ఆధిపత్యం చెలాయించాలనుకున్న వామాచార కులాలపై పైచేయి సాధించడమే కాకుండా ఆయా రంగాలలో వారికంటే నైపుణ్యాన్ని సంపాదించుకున్నాయి. అంతే కాకుండా వామాచార కులాలపై అనేక ఆంక్షలు విధించి వారి స్థితి గతులను మరింతగా దిగజార్చాయి.

న్యాయవ్యవస్థలుగా

శెట్టి సమయాలు ప్రపంచానికే న్యాయశాస్త్ర సూత్రాలను నేర్పించిన వ్యవస్థలుగా మనం చెప్పుకోవచ్చు. ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన న్యాయ వ్యవస్థలు శెట్టి సమయాలు.

భార్యాభర్తల తగాదాల నుండి, భూముల సరిహద్దు వివాదాల వరకు తక్షణ న్యాయసేవలను అందించిన వ్యవస్థలు శెట్టి సమయాలు.

దేశాయిశెట్టి వద్ద ఒక పొడవాటి కాడ కలిగిన గరిట ఒకటి వుంటుంది. ఈ గరిట కాడపై నంది విగ్రహం, ఈ గరిటకు ఒక గంట దానికి ఒక గొలుసు వుంటుంది. దీనిని " గరిట గాలం" "బసవ శంకరం" "జనవశంకరం" "వజ్ర భైసుగ" అనే పేర్లతో పిలిచేవారు. దీని పై 18 కులాల శిల్పాలు, పేర్లు చెక్కి వుంటాయి. (ఈ గరిట గాలం గురించి చెప్పుకోవాలంటే ఇది కాశీ అన్నపూర్ణ వాడే పాత్ర, అన్నదానానానికి సంబంధించినది అంటారు. ఈ "వజ్రభైసుగ" సుసంపన్న ఆర్థిక పుష్కలత్వానికి ప్రతీక అంటారు. ఇవన్నీ వివిధ చరిత్రకారుల అభిప్రాయాలే అయివుంటాయి. గరిటగాలం అసలైన అర్థం ఇంకా తెలియాల్సి వుంది).

ఏదైనా పంచాయితీ చేయాల్సివచ్చినప్పుడు "చలువాది" ఈ గరిట గాలం ను భుజాన పెట్టుకుని సంబంధిత వ్యక్తుల ఇంటి వద్దకు వెళ్లి గంట వాయిస్తాడు. ఆంటే ఆ రోజు ఏదో పంచాయితీ జరుగనుందని ఆ ఇంటి పెద్ద పంచాయితీ వద్దకు చేరుకునేవాడు.

ప్రతి గ్రామంలో ఈ పంచాయితీలు జరిగే రచ్చబండలు వుండేవి వీటిని "శెట్టి అరుగు" అని పిలిచేవారు. ఇవి లేని చోట దేవాలయాలే వేదికలయ్యేవి. కులపంచాయితీ, కుటుంబ పంచాయితీ. అయినప్పుడు ఖచ్చితంగా ఆయా కుల పెద్దల సమక్షంలోనే విచారణ జరిగేది.

విచారణ ఎలా వుండేదంటే.....

న్యాయ సహాయం కోరే వ్యక్తి దేశాయిశెట్టి దగ్గరకు వెళ్లి తాంబూలంతో పాటు కొంత రుసుము చెల్లించి న్యాయ సహాయం కోరేవారు. ఈమేరకు దేశాయిశెట్టి చలువాదిని పిలిచి ఫలానా రోజు విచారణ వుందని చెప్పేవాడు. చలువాది ఈ సమాచారాన్ని సంబందిత వ్యక్తులకు చేరవేసేవాడు.

ఫిర్యాది పంచాయతీ పెద్దల ఎదుట తన ఫిర్యాదును విన్నవించుకునేవాడు. ఫిర్యాది తన ఆరోపణలను చేసేంతవరకు అతని వ్యతిరేక వ్యక్తులు కేవలం చూస్తూ వుండాలే తప్ప మధ్యలో మాట్లాడకూడదు. ఫిర్యాది తన సమస్యను విన్నవించుకున్న తరువాత శెట్టి ఆజ్ఞ మేరకు ప్రత్యర్థి తన వాదనను వినిపించాలి. ఒకరు మాట్లాడుతున్న సమయంలో మరొకరు మాట్లాడకూడదు. అలా ఇరువాదనలు విన్న తరువాత సరైన సాక్ష్యాల సేకరణకు, విచారణకు దేశాయిశెట్టి వాయిదాలు ప్రకటించేవాడు. ఈ క్రమంలో సమస్యల తీవ్రతను బట్టి వీలైనంత వేగంగా దేశాయిశెట్టి తీర్పును ప్రకటించేవాడు. ఇలా ప్రకటించిన తీర్పును ఇరువర్గాలు తప్పని సరిగా ఆమోదించి తీరాలి ఎవరైనా ఆమోదించకుండా ధిక్కరించిన పక్షంలో ఆ కుటుంబాన్ని వెలివేసేవారు. ఈ వెలి కులం లోనుండి వెలి, గ్రామం నుండి వెలి అని వుండేవి.

ఈ వెలి ఎలా వుండేదంటే......

వెలివేయబడిన కుటుంబానికి మొదటగా సేవికా కులాలు తమ సేవలు నిలిపివేసేవి. అంటే రజకులు బట్టలు ఉతకరు, క్షురకులు క్షవరం చేయరు, కుమ్మరి కుండలు ఇవ్వడు, చివరికి స్మశానంలో చితికి నిప్పు అంటించాలన్నా, లేదా గొయ్యి తవ్వాలన్నా బేదరి వారు సేవలు అందించరు. (1886 లో నరహరి గోపాల కృష్ణమచెట్టి రాసిన కర్నూలు మాన్యువల్ ఆధారం)

చిన్న చిన్న శిక్షలను వీరే అమలు చేసేవారు. తప్పులకు జరిమానాలు వేయడం, కొరడాలతో కొట్టించడం, వంటి శిక్షలు వేసేవారు.

ఈ సమాజంలో భోగస్త్రీలు అనబడే వేశ్యలు దేవాలయాలను ఆశ్రయించుకుని జీవించేవారు. వీరితో పాటు బసివిని, గణిక వంటి దేవదాసీలు వుండేవారు వేశ్యావృత్తి నాడు నేరం కాదు. కానీ వ్యభిచారాన్ని మాత్రం తీవ్రమైన నేరంగా పరిగణించేవారు. సంసార స్త్రీలతో వ్యభిచారం చేస్తే అటు స్త్రీకి ముక్కు కోయడం, స్థనాలు కోయడం వంటి శిక్షలు వేసేవారు. పురుషుడికి విత్తుకొట్టడం వంటి శిక్షలు వేసినట్లు తెలుస్తోంది. మహిళల పై అత్యాచార యత్నానికి గుండు కొట్టించి, సున్నపు బొట్లు పెట్టి, మెడలో చెప్పుల దండ వేసి, గాడిదపై ఊరేగించేవారు. ఈ శిక్ష అనుభవించిన వారు అవమానం తట్టుకోలేక గ్రామాలు

విడిచి పోయేవారు. వృత్తి దొంగలకు చేతులు నరకడం వంటి శిక్షలు అమలు చేసేవారు.

తీర్పులు చెప్పడంలో నారదస్మృతి, పరాశరస్మృతి వంటి గ్రంథాల ఆధారంగా తీర్పులు చెప్పేవారని చాలామంది చరిత్రకారులు రాశారు. ఇది రాజాస్థానాలలో జరిగివుండవచ్చేమో కానీ గ్రామీణ శెట్టి సమయాలలో ఈ స్మృతులను పరిగణలోకి తీసుకున్నట్లు కనిపించదు. ఎక్కువగా సహజ న్యాయ సూత్రాలనే అనుసరించినట్లు కనబడుతోంది. శెట్టి సమయాలను కానీ వాటి పెద్దలను కానీ ధూషిస్తే పరోక్షంలో నైనా సరే... సరయిన సాక్షాధారాలను పరిశీలించి వారికి తప్పు వేసేవారు. అంటే జరిమానా వేసేవారు. అలా జరిమానా చెల్లించని వారిని గ్రామం నుండి, లేదా కులం నుండి బహిష్కరించేవారు. లేదా కొరడా తో కొట్టించేవారు.

నిజ నిర్ధారణ కొరకు దివ్య పరీక్షలను సైతం దేశాయి శెట్లు ఆచరణలో పెట్టిన సంఘటనలు సైతం కనిపిస్తాయి. తీర్పు ఇవ్వడం జటిలమైన కేసులలో నిజ నిర్ధారణ కొరకు దేవాలయంలో ప్రమాణాలు చేయిం చడం, కాల్చిన గడ్డపలు గును పట్టించడం, దేవాలయ పూజారి ద్వారా మంత్రించిన బియ్యం ఇప్పించడం వంటి వి చేసేవారు. నయానో భయానో వాస్తవాలను దోషుల నుండి కక్కించడానికి ఈ రకమైన ఎత్తుగడలను, దోషుల బలహీనతలను ఉపయోగిం చుకునేవారు.

ఈ శిక్షలను దివ్య పరీక్షల గురించి మూఢనమ్మకాలను అనుసరిం చేవారు అని చాలామంది చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. కానీ దోషుల నమ్మకాలను ఆసరాగా చేసుకుని వారి నుండి నిజం రాబట్టేందుకు ఇలాంటి ఎత్తుగడలను న్యాయమూర్తులైన దేశాయిశెట్లు అనుసరించినట్లు కనిపిస్తోంది. కాల్చిన గడ్డపలుగును చూసి చేయి కాలుతుందేమో అన్న భయంతో నేరస్తుడు తన నేరాన్ని ఒప్పుకునేవాడు.

తీర్పు చెప్పేటప్పుడు బాధితులు ఎలాంటి న్యాయం కోరుతున్నారు? సంబంధిత కులపెద్దలు ఎలాంటి అభిప్రాయంతో వున్నారు అనే విషయాలను పరిగణలోకి తీసుకునేవారు. ఈ తీర్పులు బాధితులు సంతృప్తి చెందే విధంగా వుండేవి. ముద్దాయి నేరం రుజువు అయిన పక్షంలో మూడు నుండి ఏడు రోజుల వరకు తను నేరం చేయలేదని నిరూపించుకోవడానికి అవకాశం

ఇచ్చేవారు. ఈ వ్యవధిలో తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోలేకపోతే శిక్షలు అమలు జరిపేవారు. ఈ ఏడు రోజులూ వీరికి చాకలి బట్టలు వుతకడు, మంగలి క్షవరం చేయడు, కుమ్మరి కుండలు ఇవ్వడు, బేదరి స్మశానంలో సేవలు అందించడు. ఇలాంటి తీర్పులకు సంబందించిన కథలు మనకు చాలా కనిపిస్తాయి. మర్యాదరామన్న కథలు కూడా ఈ కోవకు చెందినవే. మర్యాదరామన్న కూడా దేశాయిశెట్టే...మదనపల్లె ప్రాంత అమర నాయకుడుగా పరిపాలన సాగించినట్లు తెలుస్తోంది.

అంతటి భయంకరమైన శిక్షలు వుండేవి కాబట్టే దేశాయి శెట్టి తీర్పులను అందరూ గౌరవించేవారు.

ఇలాంటి వ్యవస్థలో అన్యాయం జరిగేది కాదా అంటే జరిగినట్లుగా అన్ని కులాల పెద్దలు అభిప్రాయపడినప్పుడు దేశాయిశెట్టి పదవికే ముప్పు వాటిల్లేది. దేశాయిశెట్టి రాగద్వేషాలను తీర్పులో చూపించాడని అన్నికులాల పెద్దలు అభిప్రాయపడినప్పుడు పృథ్వీశెట్టికి ఫిర్యాదు చేసేవారు. ఆయన విచారించి శెట్టిని తొలగించి అతని స్థానంలో అదే కులానికి చెందిన మరో చదువుకున్న, సమర్థుడైన వ్యక్తిని దేశాయిశెట్టిగా నియమించేవారు. ఈ పదవి కూడా కులాల వారీగానే జరిగేది తప్ప మరో కులానికి ఇచ్చేవారు కాదు. ఎందుకంటే కులాలు సమాజంలో తమ వృత్తులతో పాటు తమ తమ బాధ్యతలను కూడా మోయాల్సిన పరిస్థితులు నాడు వుండేవి.

ఇక చిన్న చిన్న తప్పులకు శిక్షగా జరిమానాలు సైతం విధించే వారు. ఈ జరిమానాలను దేశాయిశెట్టి సమయు కులాలకు సంబంధించిన పెద్దలందరికీ సమానంగా పంచి ఇచ్చేవారు. లేదా దేశాయిశెట్టికి ప్రయాణ ఖర్చులు వుంటే ఆ మొత్తాన్ని తీసుకునేవారు. ఈ ధనం రాజు ఖజానాకు చేరేది కాదు.

కొన్ని చిన్న చిన్న గ్రామాలకు కలిపి ఒకే శెట్టి వుండేవాడు. ఆయన తీర్పు చెప్పడానికి వస్తున్నాడు అంటే గ్రామంలోని రచ్చబండదగ్గర ప్రజలు హాజరయ్యేవారు. ముందుగా చలువాది దేశాయిశెట్టిగారు వస్తున్నారహో అంటూ ముందుగానే సమాచారం ఇస్తాడు. పంచాయితీకి హాజరైన కులాల ప్రజలు అందరూ లేచి నిల్చుని ఆయనకు గౌరవం ఇచ్చేవారు. దేశాయిశెట్టి కూర్చున్న

తరువాత మిగిలిన వారు కూర్చునే వారు.

ఇప్పటి లాగా కోర్టుల చుట్టూ తిరిగే వ్యవస్థ కాదు న్యాయాధికారే బాధితుల వద్దకు వచ్చి తీర్పులిచ్చే వ్యవస్థ ఎంత గొప్పదో కదా....

(పలనాటి చరిత్రలో నాయకురాలు నాగమ్మ తండ్రి చౌదరి రామిరెడ్డి తీర్పులు చెప్పడంలో దిట్ట అంటారు. పలనాటి యుద్ధం కట్టుబాట్ల అతిక్రమణ - కట్టుబాట్ల అమలు మధ్య జరిగిన యుద్ధమే కానీ మరొకటి కాదు).

ఈ విధంగా న్యాయవ్యవస్థలుగా శెట్టి సమయాలు భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటాయి. మొదట్లో జాన్ కంపెనీ ఈ తీర్పులకు శిరసావహించక తప్పలేదు. ఈ పటిష్టమైన వ్యవస్థను రద్దు చేస్తే కాని తాము తమ వ్యవస్థను పదిలం చేసుకోలేమని భావించిన బ్రిటీషు పాలకులు శెట్టి సమయాలను రద్దుచేసి వాటి స్థానంలో కోర్టుల వ్యవస్థను ఏర్పాటు చేశారు.

ఈ విధంగా భారతీయుల ప్రాభవానికి గండి పెట్టారు. ఇప్పటికీ 2016 నాటికీ కొన్నిగ్రామాల్లో శెట్టి సమయాలు తమ ఉనికిని కలిగివున్నాయి. వాటి తీర్పులకు చట్ట బద్ధత లేక పోవడంతో అవి కేవలం పంచాయితీలుగానే మిగిలిపోయాయి.

గ్రామ స్థాయిలో జరిగే ఈ శెట్టి సమయం పంచాయితీలు ఆయా చిన్న చిన్న గ్రామాల్లో శెట్టిబలిజ కులస్తులు లేకపోతే సమయం లోని ఇతర కులస్తులు పంచాయితీలు నిర్వహించేవారు. వారిలో ప్రధానంగా లింగబలిజ, ఈడిగ, ఉప్పర, మేదర కులస్తులు కూడా వున్నారు.

ఈ శెట్టి సమయాలను నిర్వహించిన శెట్టిబలిజ కులస్తులకు ఇంటిపేరు చివరన శెట్టి అని వుంటుంది. ఉదాహరణకు యర్రం శెట్టి, కృష్ణంశెట్టి, లక్ష్మిశెట్టి, సిద్ధం శెట్టి వంటి పేర్లు.

పరిపాలన లో శెట్టి సమయాలు

పరిపాలనలో శెట్టి సమయాలు పోషించిన పాత్ర చాలా కీలకమైనది. ఈ శెట్టి సమయ పాలకులే పన్ను వసూళ్లు చేయించేవారు. పన్ను వసూళ్లతో పాటు శాంతి భద్రతలను కూడా తలారుల ద్వారా వీరే పర్యవేక్షించేవారు. వసూలు

చేసిన పన్నులో కొంతమొత్తాన్ని రాజుగారి ఖజానాకు చెల్లించడం తప్పని సరిగా చేసేవారు. మిగులు వసూళ్లను స్వంతంగా ఖర్చు పెట్టే స్వేచ్ఛ వారికి వుండేది. ఇలా శెట్టి సమయాల నాయకులుగా చెలామణి అయ్యే వారు రాజుల నుండి, పృథ్విశెట్టి నుండి శాసనాలు, ఫర్మానాలు, తామ్రశాసనాల రూపం లో హక్కులు పొందేవారు. ఇలా చాలా గ్రామాలపై హక్కులు కలిగిన శెట్లు వాటి లో కొంత భాగాన్ని అవసరమైతే స్వంత కులం లోని వారికే అమ్ముకోవడం కానీ దానం చేయడానకి గానీ పూర్తిగా స్వేచ్ఛ వుండేది.

క్రీ.శ. 1799 లో జరిగిన నాలుగవ ''ఆంగ్లో మైసూరు యుద్ధం'' (నాలుగవ కర్నాటక యుద్ధం) లో టిప్పసుల్తాను మరణించడంతో ఇప్పటి రాయలసీమ ప్రాంతం హైదరాబాదు నిజాం ఆధీనం లోకి వచ్చింది. క్రీ.శ. 1800 అక్టోబర్ 12 జరిగిన ఒప్పందం లో సైనిక సహకారం అందించినందుకు గాను ఈస్టిండియా కంపెనీ వారు నేడు రాయలసీమ అని పిలుస్తున్న దత్తమండలాల (బళ్లారి, అనంతపురం, కడప, కర్నూలు) పై పన్ను వసూలు చేసుకునే హక్కు పొందారు. ఈ సమయంలో ఇక్కడ వున్న శెట్టి సమయాల దేశాయిశెట్లకు పన్నులు బలవంతంగా వసూలు చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు.

అసలే కరువు ప్రాంతం జాలిగుండె కలిగిన దేశాయిశెట్లు, దేశాయిరెడ్లు తాము ప్రజల నుండి పన్నులు బలవంతంగా వసూలు చేయలేము అని చేతులెత్తేశారు. కేవలం ధన సంపాదన తప్ప మానవీయ విలువలు లేని ఈ స్టిండియా కంపెనీ వారు మరాఠా ప్రాంతం లోని అడవులలో క్రూరంగా దారి దోపిడీలు చేసే గిరిజన జాతులకు చెందిన వారిని పట్టుకొచ్చి రెడ్లు గా నియమించారు వారికి చదువు లేదు కాబట్టి రికార్డుల నిర్వహణకు చదువుకున్న వారిని కరణాలుగా నియమించారు.పన్నులు వసూలు చేయడం ఎదురు తిరిగిన వారిని క్రూరంగా అణచడం ఐక్యంగా వుండే వారిని విభజించడం వంటి వాటిపై ప్రత్యేక శిక్షణనిచ్చారు.

అలా జాలి దయ అనే పదాలకు అర్థం తెలియని కొత్త రెడ్లు బ్రిటీషువారి అండతో చెలరేగిపోయారు. పన్ను చెల్లించని ఇంటి ఇల్లాళ్ల తాళిబొట్లు కూడా లాక్కున్న సంఘటనలను ప్రజలు చూశారు. ఈ దారుణాలను సహించలేక

ఎదురు తిరిగిన దేశాయిశెట్లను దారుణంగా కత్తులతో వెంటాడి వేటాడి నరికారు. కొన్ని ప్రాంతాలలో బ్రిటీషు వారి ఆజ్ఞలను యథాతథంగా అమలు చేసిన దేశాయిశెట్లనే రెడ్డి పదవుల్లో కొనసాగించారు. ఈ కాలంలోనే పన్ను చెల్లించని వారి ఇంటిలో ఒక వాకిలి రెక్కను మాత్రమే తీసుకు పోయే వారు. అలా తీసుకు పోతే ఆ కుటుంబం అవమానం భరించలేక అప్పు తెచ్చి పన్నులు కట్టిన సంఘటనలు అనేకం.

బ్రిటీషు వారు దేశం మొత్తాన్ని ఆక్రమించిన తరువాత శెట్టిసమయు వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి పంచాయితీలు చేసే న్యాయవ్యవస్థ స్థానంలో కోర్టుల వ్యవస్థను ఏర్పాటు చేశారు. పన్ను వసూళ్ల కొరకు రెడ్డి కరణాల వ్యవస్థను కులాల వారీగా కాకుండా తాము ఏర్పాటు చేసిన విద్యావ్యవస్థలో చదువుకున్న వారిని మాత్రమే నియమించారు. ఈ విధంగా మహోన్నతంగా ప్రజలను కన్నబిడ్డలలాగా చూసుకున్న శెట్టి సమయ వ్యవస్థను కూకటి వేళ్లతో పెకిలించి వేశారు.

శెట్టి సమయ వ్యవస్థల కు అధికారాలు లేకపోవడం, కష్టాలొస్తే చెప్పుకోలేక పోవడం, కష్టాలు చెప్పుకున్నా శెట్టి సమయపాలకులుగా పని చేసిన బలిజ కులస్తులు వారి కష్టాలు తీర్చలేక పోవడం వంటి వాటి వల్ల తమ ప్రాభవాన్ని పూర్తిగా కోల్పోయారు. అసలైన ప్రజాస్వామ్యానికి పర్యాయపదాలైన శెట్టి సమయాలు కూకటి వేళ్లతో సహా కూలిపోయిన విషాద ఇతిహాసమిది.

(1939 - 1942 మధ్య కాలంలో జరిగిన ఒక వాస్తవం... కర్నూలు జిల్లా నందికొట్కూరు తాలూకా వేల్పనూరు గ్రామం తనకేదో అడ్డు వచ్చాడన్న కారణంతో ఒక చాకలి ని బ్రిటీషు పాలకులు నియమించిన రెడ్డి కొట్టాడు. బాధితుడు తమ కులాల పెద్ద అయిన 'శెట్టి పత్తి కొండయ్య'' కు ఫిర్యాదు చేశాడు. అప్పటికే దేశం మొత్తం బ్రిటీషు పాలన క్రిందికి వెళ్లిపోవడం. స్థానిక వ్యవస్థలను తొలగించి వాటి స్థానంలో బ్రిటీషు వారు తమవైన వ్యవస్థలను ఏర్పాటు చేశారు. దేశాయి శెట్లకు అధికారాలేవీ లేవు... అయినా బాధితులు మాత్రం తమకు అన్యాయం జరిగితే తమ పెద్దలు వున్నారన్న భరోసాతోనే జీవిస్తున్నారు. సంబధిత రెడ్డి ని పంచాయితీకి పిలిపించారు. తాను ప్రభుత్వం నియమించిన రెడ్డిని కాబట్టి తాను పంచాయితీకి రానని ధిక్కరించాడు. ఈ నేపథ్యంలో 'శెట్టి పత్తి కొండయ్య'' తన అనుచరులైన చాకళ్లను బట్టలు ఉతకవద్దని,

మంగళ్లను క్షవరం చేయవద్దని, కుమ్మర్లను కుండలు ఇవ్వవద్దని ఆజ్ఞలు జారీ చేశాడు. సుమారు రెండు నెలలు గడిచాయి... రెడ్డి తన బెట్టు దిగిరాక తప్పలేదు. తప్పని సరి పరిస్థితిలో పంచాయితీకి వచ్చాడు. పంచాయితీలో నేరం రుజువైంది. సంబంధిత నేరానికి గాను దోషికి జరిమానా విధించాలని పంచాయితీ పెద్దలు ఏకగ్రీవంగా తీర్మానించారు. దోషి గౌరవ ప్రదమైన గ్రామాధికారి పదవిలో వున్నాడు. మరి దోషి నుండి జరిమానా వసూలు చేసేవారెవరు? రాజ్యాధికారం లో అంతర్భాగమైన "రెడ్డి" నుండి "దేశాయి శెట్టి" అయిన పత్తి కొండయ్య జరిమానా వసూలు చేయలేకపోయాడు. ఇంకా వత్తిడి చేస్తే అధికారంలో వున్న వారు గ్రామం మొత్తాన్ని ఇబ్బందులకు గురిచేసే ప్రమాదం వుంది. దీంతో "గౌరవ ప్రదమైన పదవి లో దోషి వున్నందున శిక్ష వేయలేకపోతున్నామని, జరిమానా వసూలు చేయలేకపోతున్నాము" అని శెట్టి అశక్తత వ్యక్తం చేయడంతో పంచాయితీ ముగిసింది. ఇలాంటి సంఘటనల నేపథ్యంలో దేశాయిశెట్లను మరింత అణచిపెట్టారు. ఆ పంచాయితీ తరువాత నిరాశా నిస్పృహలకు గురైన 'శెట్టి పత్తి కొండయ్య" తన శెట్టి అధికారానికి ఆనవాలైన గరిట గాలాన్ని చలువాది వారికే ఇచ్చివేశాడు. సంబంధిత గరిట గాలం ఆచూకీ కొరకు నేను ప్రయత్నించినప్పటికీ అధి లభించలేదు. కానీ వారి అధికారానికి సంబంధించిన ఒక కంచు బిళ్ల పత్తి కొండయ్య మనుమడు పత్తి సుబ్బయ్య వద్ద కనిపించింది. అదే విధంగా పత్తి కొండయ్య చలువాది వారసుల వద్ద వారికి సంబంధించిన అధికార కంచుబిళ్ల మరొకటి దొరికింది వాటి ఫొటోలను ఇస్తున్నాను గమనించండి. ఇక గరిట గాలం వెలుగోడు పట్టణం లోని గాంధీనగర్ లో నివాసం వుంటున్న శెట్టి వసంతం తిరుమలయ్య కుమారుడు వసంతం తిరుపతయ్య వద్ద లభించింది. పూర్వాచార రాజులు, రాజ్యాలు అంతరించి పోయిన తరువాత మనవైన వ్యవస్థలను కాపాడడానికి శ్రీశైలం, నాగలూటి ప్రాంతాలలోని "జగద్గురు పీఠం"ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. వారికి సంబందించిన ఆధారాలు కనిపించాయి).

అంతర్జాతీయంగా శెట్టి సమయాలు

మొదట్లో కేవలం పూర్వాచార వర్గంగా వున్న శెట్టి సమయాలు తరువాత కాలంలో మెజారిటీ ప్రజల అండను సంపాదించుకున్నాయి. ఆ తరువాత ఈ సమయాలు వేల సంవత్సరాలు దేశాన్ని సుసంపన్నం చేశాయి. దేశం బయటి నుండి సంపదను తెచ్చి దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిల బెట్టాయి. బౌద్ధ విశ్వవిద్యాలయాలు ప్రపంచ విద్యారంగాన్ని శాసిస్తున్న కాలంలో వారు సంపాదించిన టెక్నాలజీ ని సమర్థవంతంగా శెట్టి సమయాలు వినియోగించుకున్నాయి.

జ్యోతిష శాస్త్రం సాధించిన ప్రగతితో నక్షత్ర రాశులపై అవగాహన కలిగింది. ఈ క్రమంలోనే సముద్ర జలాలలో ఎంత దూరమైనా క్షేమంగా ప్రయాణం చేయగలిగిన నౌకలను భారతీయులు నిర్మించారు. సముద్ర జలాలలో మార్గం కనుక్కోవడానికి దిక్సూచిని ప్రపంచానికి పరిచయం చేశారు. దిక్సూచి, నక్షత్ర గమనం పై పూర్తి పట్టు సాధించిన భారతీయులు తూర్పున వున్న అనేక జనావాసాలపై తమ ప్రభావాన్ని చూపారు (నావికా పంచాంగం అనే పంచాంగం ప్రత్యేకంగా వీరి కొరకే తయారు చేయబడింది).

వామాచార కులాల చేతి నుండి తీసుకున్న పంచవృత్తులను కొత్తపుంతలు తొక్కించారు. ఈ సమయాలలో వున్న ప్రతి కులం తమ తమ వృత్తులలో అసమాన నైపుణ్యాన్ని ప్రదర్శించింది. ప్రధానంగా వస్త్రపరిశ్రమ బలోపేతమైంది. ఈ వస్త్ర పరిశ్రమలో కులాల మధ్య పోటీ లేకుండా వుండేం దుకు శెట్టి సమయాలు చక్కటి రాజీ మార్గాన్ని అనుసరించాయి.

ఈ వస్త్రాలను సాలె, తొగట,కుర్ని, పట్టుకార్, క్షత్రి, దేవాంగులు, జంద్ర, అటకారు, మాల కులాలు నేసే వారు. వీరిలో సాలె, తొగట, కుర్ని, పట్టుకార్, క్షత్రి, మాల వారు పూర్వాచార కులాల వారు కాగా మిగిలిన వారు వామాచార కులాలకు చెందిన వారు. వీరిలో సాలె కులస్తులు పట్టు వంటి ఖరీదైన, సున్నితమైన వస్త్రాలు నేసేవారు, తొగటవారు పంచెలు, తువాళ్లు వంటి ప్రత్యేక వస్త్రాలు మాత్రమే నేసేవారు. ఇక పూర్తి ముతక వస్త్రాన్ని ఈ కులాలు

నేయకూడదు కేవలం మాల కులస్తులకు మాత్రమే ఈ అవకాశాన్నిచ్చారు. ఇవే వస్త్రాలను వామాచార కులాల పై మాత్రం ఆంక్షలు వుండేవి కావు. ఇక జనపనార, గోగునారతో నేసే గోనె సంచులు మాత్రం పీచుపెరిక కులస్తులు నేసేవారు. ఇక గొర్రె బొచ్చుతో నేసే కంబళ్ళు కురువ కుటుంబాలు మాత్రమే నేసేవి.

ఇలా అద్భుతమైన పని విభజన తో ఒక కులానికి మరో కులం పోటీ కాకుండా ఒకరి సహకారం తో మరొకరు జీవించే విధంగా ఏర్పాటు చేశారు. ప్రధాన కులాల వృత్తులలో వేగం నైపుణ్యం పెరిగే కొద్దీ వాటికి ఉపకులాలు పుట్టుకొచ్చాయి. ఈ ఉప కులాలు సంబంధిత వృత్తుల వారికి ఏదో ఒక ప్రక్రియలో సహాయకారిగా పని చేసేవారు. అంటే నేడు మనం జాబ్‌వర్క్ అని చెప్పుకునే మాదిరిగా.

శెట్టి సమయాలలో వుండే కులాలు పరస్పరం సహకరించకోవడం సమస్య ఎదురైతే మూకుమ్మడి గా ఎదుర్కోవడం అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో తమ వ్యాపారాలకు సహకరించని రాజ్యాలకు వ్యాపార సహకారాలు అందించకుండా సహాయ నిరాకరణ చేసేవారు. తప్పనిసరిగా ఈ సమయాల డిమాండ్లకు తలవంచి సహకరించాల్సిన పరిస్థితులు నాటి రాజులకు కల్పించారు. స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రోత్సహించారు.

ఎవరైనా రాజు శెట్టి సమయాల వ్యాపారులకు నష్టం కలిగించే విధంగా పన్నులు వసూలు చేసినా, వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసినా ఈ సమయాలు తీవ్రంగా ప్రతిఘటించేవి. ఆ రాజ్యంపై వ్యాపార నిషేధం పెట్టి దారిలోకి తెచ్చుకునేవారు. అలా ప్రతిఘటించిన రాజుల పై యుద్ధం చేసి తమ సమయం లోని వారినే పాలకులుగా నియమించిన సంఘటనలు కూడా వుండేవి. ఈ సమయాలు స్వంతంగా సైన్యాలను సైతం పోషించేవి. ఇవే కాక అంతర్జాతీయ వాణిజ్యం లో పాల్గొనే ప్రతీ వ్యాపారీ స్వయంగా ఆయుధం పట్టగలిగిన వారు కావడంతో తూర్పున వున్న అనేక రాజ్యాలను తమ వశం చేసుకున్నారు.

అందుకే నేడు మలేషియా, ఇండోనేషియా వంటి దేశాలలో హిందూదేశ ప్రభావం తీవ్రంగా వుండడడానికి ఇవే కారణాలు. రాజ కుటుంబీకులు కూడా పెద్ద ఎత్తున వ్యాపారాలు చేశారు. (వ్యాపారుల వారసులే రాజులయ్యారు

అనే వాదనకు కూడా బలమైన ఆధారా లున్నాయి). అప్పట్లో వంటకాలలో కారం రుచి కొరకు మిరియాలను వాడేవారు. దీంతో మిరియాలు, తమలపాకులు, సుగంధ ద్రవ్యాలైన దాల్చిన చెక్క, లవంగాలు వంటి వాటిని ఎక్కువగా ఎగుమతి చేసే వారు. ఎగుమతుల్లో సింహభాగం నూలువస్త్రాలదే. దేశీయంగా లోహపరిశ్రమ విస్తృతంగా అభివృద్ధి చెందడంతో ఇక్కడి నుండి కళాఖండాలు, లోహపు పాత్రలు విపరీతంగా ఎగుమతి అయ్యేవి. అలా సంపదను సృష్టించిన శెట్టి సమయాలు దేశాన్ని సుసంపన్నం చేశాయి.

ఇలా స్వంత సైన్యాలను కలిగి ఒక చేత ఖడ్గం, మరో చేత తక్కెడ పట్టుకున్న శెట్టి సమయాలు వ్యాపారంలో ఖచ్చితమైన నియమాలు పాటించే వారు. వ్యాపారం లో అక్రమాలకు పాల్పడేవారి పై కఠిన చర్యలు తీసుకునేవారు. ఈ క్రమంలో టెక్నాలజీని కొత్త పుంతలు తొక్కించిన మన కళాకారులు అద్భుతమైన నౌకలను నిర్మించేవారు.

ఈ నౌకలు ఎలా వుండేవంటే....

Accounts of Foreign Travelers to India

Coming to later times we have the account of Hiuen Tsang who notices a fleet of 3,000 sail belonging to the King os Assam. There is inscriptional evidence of the possession of a fleet under the Kakatiyas and the Cholas in South india. Marco Polo testifies to the huge size and efficient construction of Indian vessels while Yule in his Cathey refers to Rajput ships en route to China.

హ్యూయెన్‌త్సాంగ్ (చైనా యాత్రికుడు) భారతదేశం వచ్చినప్పుడు అస్సాం రాజు వద్ద 3,000 మంది నావికులు వున్న విషయాన్ని గమనించాడు. దక్షిణ భారత దేశంలోని కాకతీయుల వద్ద, చోళుల వద్ద ఓడల సముదాయాలు వుండేవని ఇక్కడి శాసనాలలో చెక్కబడి వుంది. రాజపుత్ర ఓడలు చైనా

వెళుతున్నప్పుడు అత్యంత నైపుణ్యంగా నిర్మించిన భారీ పరిమాణం కలిగిన భారతీయ పడవలను చూశానని చెప్పాడు.

Marco Polo, a famous Venetian traveler who visited India in 13th Century also visited Thane Port. The first chapter of his book which deals with India is almost devoted to shipbuilding industry in India.Friar Odoric of Pordenone, an Italian Monk who visited India in 14th Century, in his account of his voyage across the Indian Ocean, a mention is made of ships which can carry 700 people.

వెనిస్ కు చెందిన మార్కోపోలో అనే ప్రసిద్ధ యాత్రికుడు 13 వశతాబ్దంలో భారతదేశానికి వచ్చాడు. అప్పుడు అతడు " థానే"ఓడరేవును సందర్శించాడు. అతడు రాసిన తన గ్రంథం లోని మొదటి అధ్యాయంలో భారతదేశం మొత్తం ఓడల నిర్మాణానికి అంకితమైపోయిందని పేర్కొన్నాడు. ఇటలీకి చెందిన బౌద్ధ సన్యాసి Friar Odoric of Pordenone 14 వ శతాబ్దంలో భారతదేశాన్ని సందర్శించాడు.ఇతడు ఓడలో హిందూ మహా సముద్రంలో ప్రయాణం చేస్తున్నప్పుడు ఇక్కడ 700 మంది ప్రయాణం చేయగలిగిన ఓడలు కూడా తయారవుతున్నట్లు గమనించాడు.

"Ships of size that carried Fahien from India to China (through stormy China water) were certainly capable of proceeding all the way to Mexico and Peru by crossing the Pacific. One thousand years before the birth of Columbus Indian ships were far superior to any made in Europe upto the 18th century."

పాహియాన్ (ఈయన నాలుగవ శతాబ్దానికి చెందిన బౌద్ధయాత్రికుడు కాలినడకన భారతదేశానికి వచ్చి అనేక బౌద్ధ గ్రంథాల ను తన వెంట

తీసుకు వెళ్లాడు) భారతదేశం నుండి చైనా తిరుగు ప్రయాణం లో కొన్ని విశేషాలను గమనించాడు. భారతదేశ ఓడలు చైనా సముద్రాన్ని దాటి మెక్సికో, పెరూ కూడా వెళుతున్నట్లు గమనించాడు. అంటే కొలంబస్ పుట్టడానికి వెయ్యిసంవత్సరాల పూర్వం నుండి 18 వ శతాబ్దం వరకు భారతదేశ ఓడలు అత్యంత శక్తివంతమైనవి, యూరప్ ఓడలకంటే మెరుగైనవని తెలుస్తోంది. (అమెరికా ఖండం గురించి యురోపియన్లకు తెలియక ముందే భారతీయులు ఇక్కడి ప్రజలతో వ్యాపారం చేశారు.)

(source:: :The Civilaizations of Ancient America :

Ludovico di Varthema (1503 A. D) saw vessels of 1,000 tons burden built at Masulipatnam. According to Dr. Vincent, India built great sized vessels from the time of Agathareids (171 B.C.) to the 16th century. And no wonder the Portuguese, when they first landed at the west coast, were carried away by the excellent Indian vessels. Later still, the Vijayanagar Empire, which had as many as 300 ports, had a powerful fleet. The naval commander was styled Naviyadaprabhu. India has a coastline of about 6300 km.

Ludovico di Varthema (1503 A. D) అనే వ్యక్తి 1000 టన్నుల రవాణా సామర్థ్యం కలిగిన ఓడలను మచిలీపట్నం లో తయారు చేయడం గమనించాడు. డాక్టర్ విన్సెంట్ అభిప్రాయం ప్రకారం భారతదేశం లో అతి పెద్ద ఓడలను (క్రీస్తు పూర్వం 171) నుండి 16 వ శతాబ్దం వరకు నిర్మించారు. పోర్చుగీసు వారు భారతదేశం పశ్చిమ తీరం చేరుకున్నప్పటికీ ఇక్కడి భారీ నౌకలను చూసి ఆశ్చర్య పోయారు. అద్భుతమైన ఇక్కడి నౌకలను వారు ఉపయోగించుకున్నారు. అప్పటి విజయనగర సామ్రాజ్యంలో 300 శక్తివంతమైన నౌకాశ్రయాలుండేవి. నౌకాదళ కమాండర్ ను "నావియాడప్రభు" అనేవారు. భారతదేశానికి 6,300 కిలోమీటర్ల

సముద్రతీరం వున్నట్లు తెలుస్తోంది.

డాకర్ రాధాకుముద్ ముఖర్జీ గారు రాసిన **Indian SHipping-A History of th Sea BorneTrade and marine Activity of the Indians From the Earliest Times (published in 1912 orient)** అనే పుస్తకం అప్పటి ఓడల గురించి తెలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అందులోని కొన్ని విశేషాలు...

తూర్పు, పశ్చిమ తీరాలలో వున్న చాలా ఓడరేవులు ప్రపంచం లోని చాలా ఓడరేవులతో వ్యాపారానికి, ఓడ యాత్రలకు, ప్రయాణాలకు అనుకూలమైన సంబంధాలు కలిగి వున్నాయి. దానికి సహజమైన సాంకేతిక కారణాలు అనేకం వున్నాయి. గణిత, జ్యోతిష శాస్త్రాలను ప్రక్కకు పెడితే భారతదేశంలో అనేక రంగాలలో నిపుణులైన కళాకారులు చాలామంది వుండేవారు. వీరిలో నేత, లోహపు పనులు చేసేవారు, అద్దకం కళాకారులు ముఖ్యులు. భారతదేశం నుండి లెక్కలేనంత కలపను ఎగుమతి చేసేవారు. భారతదేశ ఓడలు టేకు చెక్కతో నిర్మించేవారు. అది ఉప్పునీటిని అలాంటి వాతావరణాన్ని చాలావరకు తట్టుకోగలదు. భారతదేశంలో 6,000 సంవత్సరాల నుండే ఓడల యాత్రలు సింధూనదిలో ప్రారంభమైనట్లు తెలుస్తోంది. **Navigation** అన్న పదం సంస్కృత భాషాపదం ఇదే పదం నేడు ప్రపంచమంతా వాడుకలో వుంది.

<u>ఎడ్వర్డ్ హ్యూగ్స్</u> :- భారతదేశ ఓడలు ఎనిమిది సార్లు సముద్రయానం చేసిన తరువాత కూడా ఆ ఓడలను యాత్రలకొరకు కొనుగోలు చేసేవారు. కానీ యూరప్ కు చెందిన ఓడలు ఆరు సార్లు నౌకాయానం కు మాత్రమే నిరపాయకరంగా వుండేవి. ముంబయిలో తయారైన ఓడలు ఒకటిలో నాలుగవ వంతు (25%) ఇంగ్లండులో తయారైన ఓడల కంటే చౌకగా వుండేవి.

థామస్ బవరీ :- ఈయన 1669-79 మధ్యలో భారతదేశాన్ని సందర్శించాడు. ఇతడు గమనించిన విశేషాలు...(చాలామంది ఇంగ్లీషు వర్తకులు ఉపయోగించే ఓడలు "మడపాల్లుం" లో తయారైనవే ఇక్కడ చాలా నాణ్యమైన కలప సమృద్ధిగా దొరుకు తుంది. ఇక్కడ ఇనుమును చాలా

తెలివిగా ఆకారాలు మలచగలిగిన స్వదేశీయులున్నారు. సూదులు, బోల్టులు, లంగరు మొదలైనవి అందంగా నైపుణ్యంగాచేసేవారు. చాలా నైపుణ్యం కలిగిన నిర్మాణ కారులు చాలామంది వున్నారు. వీరు చాలా చక్కగా ఓడ స్థంభాలకు కట్టుతాళ్లు, ఓడలకు సంబంధించిన వస్తువులను తయారు చేస్తారు.

నికోలోకాంటి :- 15 వ శతాబ్దంలో భారత్ ను సందర్శించినప్పుడు భారతీయుల ఓడానిర్మాణం లో గల నాణ్యత ఆయనకు చాలా నచ్చింది. ఆయన ఇలా రాశారు. "హిందూదేశం లోని చాలా రాజ్యాలు మనకంటే పెద్దవైన ఓడలను వాడుతున్నాయి. ఇవి 2000 ల వరకు చెక్క కాండాలతో తయారైనవి. ఇవి ఐదు తెరచాప స్థంభాలను మోస్తున్నాయి. ఓడ క్రింది భాగంలో మూడు పలకలు గా నిర్మించబడి వుంటాయి. అవి తరచుగా సముద్రం లో వచ్చే తుఫాన్లను తట్టుకునే విధంగా నిర్మించబడ్డాయి. కొన్ని ఓడలలో ఒక భాగం మూయబడి వుండగా మిగిలిన భాగం నౌకాయానానికి అనుగుణంగా నిర్మించబడి వుంటుంది. పై భాగంలో వున్న డెక్ గదులుగా నిర్మించబడి వుంది".

భారతదేశానికి సముద్ర మార్గాన్ని కనుగొన్నవాడు వాస్కోడగామా అనడం ఎంతవరకు సత్యం....

మన దేశంలో ఆంగ్లేయుల ద్వారా ప్రచారం చేయుబడిన భ్రమలలో ఇదొకటి. ఇందులో వాస్కోడాగామా భారత్ రావడం మాత్రమే సత్యం కానీ ఆయన ఎలా వచ్చాడనేది తెలుసుకొంటేనే మనకు సత్యం ఏమిటో తెలుస్తుంది.

సుప్రసిద్ధ పురాతత్వ వేత్త పద్మశ్రీ డా.విష్ణుశ్రీధర వాకణ్కర్ ఇలా తెలిపినారు. "నేను నా పర్యటనలో భాగంగా ఒకసారి స్పెయిన్ వెళ్లినాను. అక్కడ నాకు వాస్కోడగామా డైరీ లభించింది. దానిలో వాస్కోడగామా భారత్ కు ఎలా వచ్చాడో వివరంగా వుంది. అందులో ఆయనిలా వ్రాసినాడు. "నాపడవ ఆఫ్రికాలోని జాంజిబారుతీరం చేరుకొన్నప్పుడు నా ఓడ కన్నా మూడు రెట్లు పెద్దగా వున్న పడవను అక్కడ నేను చూసినాను. ఒక ఆఫ్రికన్ దుబాసీనీ

తీసుకుని ఆ పెద్ద ఓడ యొక్క యజమానిని కలిసినాను. ఆ యజమాని పేరు "స్కందుడు" గుజరాతీ వ్యాపారి భారతదేశం నుండి జాజిచెట్టు మరియు టేకు చెట్టు కలపను, మసాలా ద్రవ్యములు తీసుకుని వచ్చాడు. వానికి బదులుగా ముత్యముల తీసికొని కొచ్చిన్ ఓడరేవుకు వచ్చి వ్యాపారం చేసేవాడు. నేను అతడిని కలుసుకొనడానికి వెళ్లినప్పుడు అతడు సాధారణ వేషంలో ఒక చిన్న మంచం పై కూర్చుండియున్నాడు. అతడు ఎక్కడికి వెళుతున్నారని అడిగినాడు. నేను హిందూదేశం చూడడానికి వెళుతున్నానని చెప్పాను. అప్పుడా వ్యాపారి నేనూ రేపు అటే వెళ్తున్నాను నా వెనుక అనుసరించి రమ్మన్నాడు. ఆ విధంగా ఆ వ్యాపారి ఓడను అనుసరించి భారతదేశం చేరాను". ఈ సత్యం స్వతంత్ర భారతదేశం లో నైనా మన నవతరానికి చెప్పవలసింది కానీ దురదృష్టవశాత్తు అలా జరగడం లేదు.

ఈ సంఘటన చదివిన పిమ్మట మన మనసులోనికి ఒక ఆలోచన తప్పక వస్తుంది. నౌకా నిర్మాణం లో ఇంత ఉన్నత స్థితిలో నున్న దేశంలో ఇప్పుడా విద్య ఎందుకు నశించిపోయింది? ఆంగ్లేయులు వచ్చిన పిదప వారి పాలనలో ఒక పథకం ప్రకారం కుట్రపన్ని నౌకా నిర్మాణ పరిశ్రమను నాశనం చేశారనే చారిత్రక సత్యాన్ని తప్పక తెలుసుకోవాలి. ఈ చరిత్రను వివరిస్తూ ప్రఖ్యాత చరిత్రకారుడు శ్రీ గంగా శంకర మిశ్రా ఇలా వ్రాశారు.

అందరికన్నా ముందున్న హిందువులు

పాశ్చాత్యులు భారతదేశంలోనికి రాకపోకలు సాగించినప్పుడు వారిక్కడి ఓడలను చూసి ఆశ్చర్యపోయారు. 17 వ శతాబ్దం నాటి వరకూ ఐరోపా వారి ఓడలు అధికాధికంగా ఆరువందల టన్నుల సామర్థ్యం మాత్రమే కలిగివుండేవి. కానీ భారత్ లో "గోఘా" అనే పేరుగల పెద్ద ఓడలు 1,500 టన్నుల సామర్థ్యం కలిగి వున్నట్లు ఐరోపావారు గ్రహించారు. ఐరోపా కంపెనీలు ఇలాంటి పెద్ద ఓడల్ని వినియోగించడం మొదలు పెట్టాయి. నైపుణ్యము గల హిందూదేశ కార్మికుల ద్వారా పెద్ద ఓడల్ని తయారు చేయించే పరిశ్రమల్ని అనేకం ప్రారంభించారు. 1811 వ సంవత్సరం లో లెఫ్టినెంట్ వాకర్ ఇలా రాశారు. బ్రిటీషు వారి ఓడలన్నీ ప్రతి పన్నెండేళ్లకు మరమ్మత్తుల పాలయ్యేవి. కానీ

భారతీయ ఓడలు టేకు కర్రతో చేయబడి 50 సంవత్సరాలకు పైగా ఎలాంటి మరమ్మత్తులు అవసరం లేకుండా పని చేసేవి. ఈస్ట్ఇండియా కంపెనీ వద్ద "దరియాదౌలత్" అనే పేరుగల ఒక ఓడ ఉండేది అది 87 సంవత్సరాలపాటు ఎలాంటి మరమ్మత్తులు లేకుండా చక్కగా పనిచేసింది. భారతదేశంలో ఓడల నిర్మాణానికి సీసం కర్ర (చంద్ర కలప) సాల వృక్షము కలప, టేకు కర్ర ఈ మూడు రకాల కలప వాడేవారు.

1811 లో వాల్ట్ జర్ సాల్విన్స్ అనే ఫ్రెంచ్ యాత్రికుడు తను రాసిన "లెస్ హిందూ" అనే పుస్తకంలో ఇలా పేర్కొన్నాడు. "ప్రాచీన కాలం నుండి హిందువులు నౌకా నిర్మాణ కళలో ఆరితేరియున్నారు. నేడు కూడా యూరప్ వారికి ఈ కళలో పాఠము చెప్పగల సమర్థులే. ఆంగ్లేయులు హిందువుల నుండి నౌకానిర్మాణ కళను నేర్చుకొనుటకు చాలా ఉత్సాహం చూపించేవారు. భారతీయ ఓడలలో నైపుణ్యం, కళాత్మకత కలసి వుంటాయి. ఈ ఓడలు హిందువుల నిర్మాణ కౌశలానికి ధైర్య సాహసాలకు ప్రతీకగా వున్నవి.

ముంబయి లోని పరిశ్రమలో 1736 నుండి 1863 వరకు 300 పెద్ద ఓడలు తయారైనవి. వీటిలో ఎక్కువ ఓడలను బ్రిటీషు నౌకాదళం "షాహీబేడే" లో చేర్చుకున్నారు. వీటిలో "ఏషియా" అను పేరు గల ఓడ 2,289 టన్నుల సామర్థ్యం కలది. దానిలో 84 ఫిరంగులు అమర్చబడి యుండెను. బెంగాలులోని హుగ్లీ, సిల్హట్, చట్టగావ్,ఢాకా మొదలగు చోట్ల నౌకా నిర్మాణ పరిశ్రమ లుండేవి. 1781 నుండి 1821 వరకు 1,22,693 టన్నులు సామర్థ్యం కలిగిన 272 ఓడలు కేవలం హుగ్లీలోనే తయారైనవి.

ఆంగ్లేయుల కుటిలత్వము

బ్రిటీషు ఓడల వ్యాపారులు భారతీయుల నౌకా నిర్మాణ కళా ఔన్నత్యాన్ని ఓర్వలేకపోయారు. భారతీయ ఓడల్ని వాడవద్దని ఈస్టిండియా కంపెనీపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ విషయం లో అనేక విచారణలు కూడా జరిగినవి. 1811 లో కల్నల్ వాకర్ గణాంకాలతో సహా రుజువు చేశాడు. ‘‘భారతీయ ఓడలకు ఖర్చు తక్కువ. అవి చాలా బలంగా వుంటాయి. బ్రిటీషు నౌకాదళంలో కేవలం భారతీయ ఓడలనే వాడినచో చాలా పొదుపు అవుతుంది. బ్రిటీషు నౌకానిర్మాణ కార్మికులు మరియు వ్యాపారులలో ఈ మాట చాలా భయాందోళనలు కలిగించింది. డాక్టర్ టేలర్ అను నతడు ఇలా వ్రాసినాడు. ‘‘హిందూదేశపు సరుకులతో నిండిన భారతీయ ఓడ లండన్ ఓడరేవు చేరుకున్నప్పుడు ఆంగ్లేయ ఓడల వ్యాపారులు చాలా భయకంపితులయ్యేవారు. థేమ్సునది ఒడ్డున శత్రువుల నౌకాదళపు ఓడలను చూసినప్పుడు కూడా అంతగా భయపడే వారు కాదు’’.

లండన్ ఓరరేవులో పనిచేసే కార్మికులు అందరికన్నా ముందుగా ఆందోళనకు దిగినారు. ‘‘మన పనులన్నీ నష్టాల పాలవుతాయి మా కుటుంబాలు పస్తులతో చస్తారు’’ అని గోల చేసినారు. ఈస్టిండియా కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ ఇలా వ్రాసినారు. ‘‘హిందూదేశపు ఓడ పనివారలు (కళాసీలు) ఇక్కడికి వచ్చి మన సామాజిక స్థితిగతులను చూస్తారు దానితో మనపై వారికున్న గౌరవం, భయభక్తులు పూర్తిగా మంటగలసిపోతాయి. వాళ్లదేశం వెళ్లి మనలోని లోపాలను, లొసుగులను, మన బండారాన్ని బయటపెట్టి ప్రచారం చేస్తారు. దానితో ఆసియావాసులకు మన పట్ల ఉన్న ఆదరభావం నశిస్తుంది. ఈ ఆదరభావం భయభక్తుల వలననే మనం ప్రభుత్వాన్ని నిలుపుకుని యుండగలిగి నాము. ఇపుడది కాస్త లేకుండా పోతుంది. కావున దీని ప్రభావం మనకు చలా హానికారకమౌతుంది’’. వెంటనే అంగ్ల పార్లమెంటు సర్ రాబర్ట్‌పీలే అధ్యక్ష తన దీనిపై ఒక కమిటీ వేసినారు.

నల్లచట్టము

ఈ కమిటీ సభ్యులలో పరస్పరం అభిప్రాయ బేధములేర్పడినవి. అయినా పై రిపోర్టు ఆధారంగా ఒక చట్టమును 1814 లో తెచ్చారు. దీని ప్రకారం భారతీయ కళాసీలకు బ్రిటీషు నావికులుగా పనిచేయు అర్హత లేదు. బ్రిటీషు ఓడలలో తక్కువలో తక్కువగా 3/4 వంతు బ్రిటీషు కళాసీలను నియమించుట తప్పనిసరి. బ్రిటీషువారిని కాకుండా ఇతర దేశాలకు చెందిన యజమానుల ఓడలు లండన్ రేవులో ప్రవేశించే వీలు లేదు. ఇంగ్లండులో తయారైన ఓడలద్వారానే బయటిదేశాల సరకులు ఇంగ్లండుకు రావాలి. ఇలాంటి నల్లచట్టము అనేక కారణాల వలన మొదట అమలు కాకున్ననూ 1863 నుండి ఇది పూర్తిగా అమలు చేయబడినది. భారదేశంలో కూడా ఇలాంటి నియమాలు కల నల్ల చట్టము తేబడినది. దీని వలన భారతదేశంలోని ప్రాచీన నౌకా నిర్మాణ కళ అంతరించిపోయినది. భారతీయ ఓడలపైన, సరకుల పైన విదించిన పన్ను బాగా పెంచబడింది. ఇలా భారతీయ వ్యాపారులని,ఓడలని వ్యాపారం చేయకుండా వేరుచేయడం జరిగింది.

సర్ విలియం డిగ్బీ అనునతడు ఇలా చాలా చక్కగా చెప్పినాడు. ''పాశ్చాత్య ప్రపంచపురాణి (బ్రిటీషు రాణి) ప్రాచ్య సాగర రాణిని ఇలా వధించి వేసింది'' భారతీయ నౌకా నిర్మాణకళ ముగిసిపోయిన తీరును తెలియజెప్పే సంక్షిప్త ఇతిహాసమిది.

(http://scienceintelugu.blogspot.in/ సౌజన్యం తో)

నిజానికి భారతీయ నౌకా నిర్మాణ కళ పట్లనే కాదు, చేతి వృత్తుల పట్ల సైతం ఆంగ్లేయులు తమ ఓర్వలేనితనాన్ని ప్రదర్శించారు. నౌకా నిర్మాణంలోని కిటుకులను నేర్చుకున్న తరువాత నిపుణులైన పనివాండ్లను చంపివేయడమో లేదా వారి చేతులను నరకడమో వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని కూడా ఆరోపణలున్నాయి. అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను నేసి విక్టోరియా రాణికి బహుమతిగా ఇచ్చిన భారతీయ చేనేత కార్మికుల చేతి వేళ్ళు నరికించారన్న ఆరోపణలు కూడా వున్నాయి. ఇలా ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తిన భారతీయ కళాసరస్వతి కనుమరుగైపోయింది.

తూర్పుదేశాలపై శెట్టి సమయాల ప్రభావం

బౌద్ధ మతం దేశం లో ఉత్కృష్ణ స్థితిలో వున్న సమయంలో నౌకా వ్యాపారం మహోజ్వలంగా వెలిగింది. ఈ సమయంలో బౌద్ధ ధర్మాన్ని ప్రభోధించడానికి సన్యాసులు వ్యాపారులతో కలసి సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు. ఆరు, ఏడు శతాబ్దాల కాలంలో తూర్పున వున్న బర్మా, థాయిలాండ్ వంటి దేశాలలో వలస సామ్రాజ్యాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అక్కడ నాగరికతలను విపరీతంగా ప్రభావితం చేశారు.

నేటికీ అక్కడ జీవిస్తున్న "మూన్" జాతీయుల మూలాలు మన తెలుగు వారితో ముడిపడి వున్నాయన్నది ఎవరూ కాదనలేని పచ్చి నిజం.

మూన్ లిపి నుండి లాన్నాలిపి లాన్నా లిపి నుండి నేటి థాయ్ లిపి అభివృద్ధి చెందిందని భాషా శాస్త్రవేత్తలు అంటారు.

"లార్డ్ శివ అండ్ బుద్ధా ఇన్ గోల్డెన్ ఐల్స్" అనే పుస్తకంలో బౌద్ధ మత పరిశోధకుడు లోకేష్ చంద్ర అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

శ్రీశైలం నుండి వెళ్లిన వారే ఇండోనేషియాలో శైలేంద్ర వంశాన్ని స్థాపించారు. వీరు సెంట్రల్ జావాను కేంద్రంగా చేసుకుని పరిపాలించారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన "బొరాబొదూర్" స్థూపాన్ని కొండను తొలిచి పద్మాకారం లో నిర్మించింది శైలేంద్ర వంశీకులే.

ఇక్కడి ప్రసిద్ధ రాజవంశాల్లైన"శ్రీవిజయ" "శైలేంద్ర" వంశాలు బౌద్ధమతంలోని మహాయాన విభాగానికి చెందినవిగా తెలుస్తోంది.

క్రీ.శ. ఒకట వ శతాబ్దం నుండి 13 వ శతాబ్దం వరకు థాయిలాండ్ ను పరిపాలించిన ప్రసిద్ధ రాజవంశాలు రెండు. అవి "ద్వారావతి" "హరివంశ" అనే వంశాలు. వీటిలో "హరి వంశాన్ని" స్థాపించినది "చామదేవి". అచ్చమైన తెలుగురాణి.

బ్రిటీషు బర్మాకు తొలి కమీషనర్ అయిన "ఆర్థర్‌పెయిరీ" అనే బ్రిటీషు చరిత్రకారుడు 1833 లో "ద హిస్టరీ ఆఫ్ బర్మా" అనే పుస్తకాన్ని రాశాడు. అందులో బర్మాలో తలైంగుల పాలన క్రీ.శ. 5 వ శతాబ్దంలో ప్రారంభమై 11వ శతాబ్దంలో అంతమైందని రాశాడు. "ఎ షార్ట్ హిస్టరీ ఆఫ్ బర్మా" లో

ఎస్.డబ్ల్యు.కాక్స్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు.

పూర్వ చారిత్రక యుగంలో నౌకా మార్గంలో వచ్చిన తలైంగులు "తటోను" లో మొట్టమొదటి వలస సామ్రాజ్యాన్ని స్థాపించారు.

మధ్యయుగాలలో శెట్టి సమయాల వైభవం

మధ్యయుగాలలో ఈ శెట్టి సమయాల వైభవం ఎలా వుండేదంటే 14,15 శతాబ్దాలలో జీవించిన కవిసార్వభౌముడు శ్రీనాథుడు తన హరవిలాసం గ్రంథాన్ని చామశెట్టి దేవయ కుమారుడు యవచి తిప్పయ(త్రిపురారి) కి అంకితమిచ్చాడు. ఈ తిప్పయ అనే వ్యక్తి వైశ్యుడని శ్రీనాథుడు పేర్గొన్నాడు. ఆ కాలంలో రాజరికం చేసే వారిని క్షత్రియులని, వ్యాపారాలుచేసే వారిని వైశ్యులు గానే సంబోధించేవారు. రాజ కుటుంబీకులే చాలా మంది పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసేవారు. చామశెట్టి యవచి తిప్పయ (త్రిపురారి) గురించిన విశేషాలు చాలా వున్నాయి. ఇతను అప్పటి కొండవీటి రాజ్యంలోనే అత్యంత సంపన్నుడని రాజుకే అప్పు ఇచ్చేంత గొప్పవాడని పేరుండేది.

ఈయన బిడారి బయలుదేరితే ఒక ఊరు ఊరే కదిలినంతగా వుండేదంటారు. ఈయన శ్రేణీ సమూహం లో అనేక మంది వర్తకులూ, ప్రయాణీకులూ వుండేవారని తెలుస్తోంది. ఈ బిడారితో ప్రయాణించాలంటే కొంత రుసుము చెల్లించి తమ పేరు నమోదు చేయించుకోవాల్సి వుండేది. ఈయనకు తిరుమలనాథుడు, జామిశెట్టి అనే ఇద్దరు తమ్ముళ్లు వుండే వారు. వీరిద్దరూ ఆయనకు సహాయకారులుగా వుండే వారు.

ఈయన నౌకలతో పెద్ద ఎత్తున వాణిజ్యం చేస్తుండే వాడు. ఈయన తండ్రి చామశెట్టి దేవయ రెడ్డి రాజులతో అత్యంత సన్నిహితంగా మెలిగేవాడు. కర్పూర వసంతరాయలు అని పేరు కలిగిన కుమారగిరిరాజు (కుమారగిరిరెడ్డి) కి తిప్పయ్యశెట్టి అత్యంత సన్నిహిత మిత్రుడని శ్రీనాథుడు పేర్కొన్నాడు. కుమార గిరిరాజు శ్రీశైలం నుండి పాతాళ గంగ వరకో లేక త్రిపురాంతకం నుండి శ్రీశైలం వెళ్లే దారిలోనో రాతి మెట్లు లేదా రాతి తాపలు నిర్మించాడు. దీనికి ఆర్థిక సహాయం తిప్పయ్యశెట్టే అందించాడు. అదే విధంగా కుమార గిరిరాజు కాలంలోనే జరిగిన వసంతోత్సవానికి కూడా తిప్పయ శెట్టే ఆర్థిక సహాయం చేశాడు.

సీ. పంజార గర్పూర పాదపంబులు తెచ్చె
జలనోంగి బంగారు మొలక దెచ్చె
సింహళంబున గంధ సింధురంబులు దెచ్చె
హురుమంజి బలు తేజిహరులు దెచ్చె
గోవ సంశుద్ధ సంకుమద ద్రవము దెచ్చె
యాంప నాణి ముత్యాలు దెచ్చె
భోట గస్తూరికా టంకములు దెచ్చె
జీని ıనాంబర శ్రేణి దెచ్చె
తే. జగదగోపాలరాయ వేశ్యాభుజంగ
పల్లవాదిత్య భూదానపరిశురామ
కొమరగిరి రాజ దేవేంద్రు కూర్మిహితుడు
జాణ జగజెట్టి దేవయచామిశెట్టి.
తే. తమ్మలిద్దఱు దనయాజ్ఞ దల ధరించి
యన్ని దీవుల దెచ్చు లాభార్థకోటి
యర్థులకు నిచ్చి కీర్తి బేహార మాడు
నవచిత్రిపురాంతకుండు వంశాబ్ధివిభుండు.
మ. తరుణాసీరితవాయిగోవరమణాస్థానంములం జందనా
గరుకర్పూరహిమాంబుకుంకుమరజః కస్తూరికా ద్రవ్యముల్
శరధిం గప్పలిజోగులన్ విరివిగా సామాన్ల దెప్పించు నే
ర్పరి యా వైశ్య కులోత్తముం డవచితిప్పం డల్పుడే యిమ్మహిన్.
తరుణాసిరి = బర్మాలోని తెన్నసెరి
తవాయి = థాయిలాండ్
రమణా = బర్మాలోని రామన్నదేశం (రంగూన్)
పంజారం = సుమత్రాదీవి లోని పాన్‌సార్
యాంప = శ్రీలంక లోని జాఫ్నా
బోట = భూటాన్
హరుముజి = గల్ఫ్ లోని హెర్ముజ్

నావల పేర్లు

కప్పలి = తమిళ ప్రాంతంలో కనిపించే కప్పల్
జోంగ్ = జన్క్ అనే చైనా నౌక
వల్లీ, వలికా = హిందూదేశ నౌకలు
సమ్మన్ = చైనా వాళ్ల చిన్న నౌక

అంకతెలగరిశెట్టి

ఈశెట్టి సమయాలకు చెందిన మరో వ్యాపారి గురించి ఖండవల్లి లక్ష్మీ రంజనం గారు "ఆంధ్రదేశ చరిత్ర, భూగోళ సర్వస్వం" అనే గ్రంథం లో ప్రస్తావించారు. ఈ వివరాలను ఆయన దాక్షారామం లోని భీమేశ్వరాలయంలో వున్న ఒక నాగ విగ్రహం దగ్గర వేసిన శాసనం నుండి సేకరించారు. దానిలో "అంకతెలగరిశెట్టి" అనే వ్యాపారి గురించిన ప్రస్తావన వుంది. వీరబలింజ సమయం వారు ఇచ్చిన దానాన్ని ఈ శాసనం తెలియజేస్తోంది. రాజమహేంద్ర వరానికి చెందిన " మల్లప్ప ఒడయురు" భీమేశ్వరుడికి చేస్తున్న పుణ్యానికి గాను ఈ దానాన్ని వీరబలింజ సమయం వారు అందజేశారు.

దీని గురించి డాక్టర్ జి.వి.పూర్ణచందు గారు "గోదావరి తీరాన ప్రాచీన వాణిజ్యం" అంకతెలగరి శెట్టి కథ అంటూ ఆంధ్ర భూమి దిన పత్రికలో ఒక వ్యాసాన్ని రాశారు. ఈ వ్యాసం 2015 లో గోదావరి పుష్కరాల సందర్భంగా ఆంధ్రభూమి ప్రచురించిన "పుష్కర గోదావరి" అనే ప్రత్యేక సంచికలో ప్రచురించారు. ఈ వ్యాసం లో పూర్ణ చందు గారు అంక తెలగరి శెట్టి గురించి చాలా చక్కగా వివరించారు. అంకశెట్టిది పంచముల గోత్రమని, ఆయన తండ్రి పెద్ది నాయకుడని, తల్లి మారాంబ అనీ, భార్య దేవాంబిక అనీ ఆయన రాశారు. "పులియమార్కొలుగండ" "పృథ్వీశెట్టి" "బల ంజ ధర్మ ప్రతిపాలక" అనే బిరుదులు అంక తెలగరిశెట్టికి వున్నాయన్నారు. ఆయన డబ్బు మనిషి కాడని, పరాక్రమశాలి, సరసుడు, పాలనాదక్షుడు అని ఆయన భావించారు. క్రీ.శ.1444 నాటి శాసనంగా ఆయన పేర్కొన్నారు.

అంక తెలగరి శెట్టి గురించి **డాక్టర్** పూర్ణ చందుగారి వర్ణన లోనే చూద్దాం.

ఇది క్రీ.శ.1444 నాటి శాసనం. ఆ సమయంలో రాజమహేంద్రి పాలకుడిగా మహారాజాధిరాజ వీరప్రతాప ప్రౌఢదేవరాయగారి ప్రధాని నాగభూపాలుడి కొడుకు మలభూపాల ఉన్నాడట. అతనికి పుణ్యంగా ఈ దానశాసనం సమర్పించబడింది. అంకతెలగరిశెట్టి శాసనాన్ని బట్టి వర్తక శ్రేణులు తాము ప్రాతినిథ్యం వహిస్తున్న గ్రామాలు, లేదా నగరాల పాలనా బాధ్యతలు కూడా నిర్వర్తించినట్టు అర్థమౌతోంది. ఇతర వర్తక శ్రేణుల వారిని కలుపుకుని దేవాలయ అభివృద్ధి పనులు, దానాలు, ఇతర స్వచ్ఛంద పౌరసేవలూ చేసి వుంటారు. రాజకార్యాలు ప్రభుత్వ నిర్వహణ, ఇతర సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ పరంగా వచ్చే ఇతర ఇబ్బందుల పరిష్కారం, వివాదాల పరిష్కారం, అనీ ఈ వర్తక శ్రేణులు చూసి వుంటాయని తెలుస్తుంది. గోదావరి తీరంలో ప్రాచీన వాణిజ్యం కనీసం నాలుగు వందల ఏళ్ల క్రితం వరకూ క్రమ శిక్షణాయుతంగా కొనసాగిందని అంకశెట్టి గారి కథ చెప్తోంది. దాన శాసనాల్లో పేర్ల తప్ప చరిత్ర ఏమీ ఉండదనే వారికి ఈ ''అంకతెలగరిశెట్టి శాసనం'' గట్టి పాఠం చెప్తుంది.

ఈ సందర్భంగా నేను డాక్టర్ పూర్ణచందు గారికి ఫోను చేసి మాట్లాడడం జరిగింది. ఆయన నాతో మాట్లాడుతూ చరిత్ర గురించి చాలా తెలుసుకోవాల్సి వుందన్నారు. శెట్టి అనే పదం కనిపిస్తే చాలు అది నేటి వైశ్యులకు అంట గట్టేస్తున్నారని అన్నారు. శెట్టి అనే పదం బలిజ కులస్తులకు చాలామందికి వుందన్నారు. ఈ అంక తెలగరి శెట్టి అనే ఆయన బలిజ కులస్తుడని ఆయన అభిప్రాయపడ్డారు.

చరిత్ర నిర్మాణం లో ఇప్పటి వరకు చాలా పొరపాట్లు జరిగాయనే నా అభిప్రాయాలకు ఇలాంటి పెద్దల అభిప్రాయాలు ఊతమిస్తున్నాయి. నేటి ఆర్యవైశ్యులు గా చెప్పుకునే కోమటిశెట్లు కూడా శెట్టి సమయాలలో అంతర్భాగాలే తప్ప మరొకరు కారు.

చరిత్ర నిర్మాణం లో నేటి వరకు అత్యధికంగా పాల్గొన్న కులం బ్రాహ్మణులు. శాసనాలను పరిష్కరించడం లో వారికి వున్న అసమాన నైపుణ్యం, సమర్థత వారికి ఆ అవకాశాన్ని అందించింది. వీరిలో చాలామంది చాతుర్వర్ణ వ్యవస్థను మనసులో పెట్టుకుని చరిత్ర నిర్మాణం సాగించారు. అందు వల్ల వారు చాలాచోట్ల గందరగోళానికి గురవుతున్నారు.దీనికి కారణం వర్ణం

కులం ఒకటే అనే భావనే.... చాలా శాసనాలలో పేర్ల చివర శెట్టి అని వుంటుంది కానీ చంద్ర వంశ, సూర్యవంశ క్షత్రియులమని చెప్పుకుంటారు, వీరు వైశ్యులా, క్షత్రియులా? అనే సందేహాలు. వీరికి మరో సందేహం వీరిలో చాలామంది చతుర్థ కులజులు, చాతుర్వర్ణ కులజులు అనే శాసనాలు కూడా కనిపిస్తున్నాయి. చతుర్థ కులజులు అంటే శూద్రులు. మరి వీరు శెట్లు ఎలా అయ్యారు? సూర్య చంద్ర వంశాలకు చెందిన క్షత్రియులు ఎలా అయ్యారు? అనే సందేహాలు. ఇదే గందరగోళం అటు కాకతీయుల విషయంలోనూ, ఇటు విజయనగర, మధుర, తంజావూరు రాజుల విషయంలోనూ ఏర్పడుతుంది.

మనం చరిత్రను బౌద్ధ, జైనాల కంటే ముందు, తరువాత అని వర్గీకరించకుంటే ఈ గందరగోళం కొంతవరకు తగ్గుతుంది. బౌద్ధ, జైన మతాల కాలంలో చాతుర్వర్ణ వ్యవస్థ మనుగడలో వున్నట్లుగా కనిపించదు. ఆ కాలంలో చాలా కొద్ది సంఖ్యలో బ్రాహ్మణ వర్గం వుండి వారు తమ వేదాధ్యయన పరం పరను కొనసాగించి వుంటారు.

బౌద్ధం సామాన్యుల మతం ఇక్కడ ఉపనయనం జనబాహుళ్యం లో కనిపించదు. దీన్ని ప్రత్యేక వ్యవస్థగానే మనం పరిగణించి తీరాలి. ఈ క్రమంలోనే నాటి రాజ వంశాలు ఉపనయనం లేకుండానే రాజ్యాలు చేశాయి. అలా బహుళ జనాదరణ పొందిన బౌద్ధ, జైనాలు ఎనిమిద శతాబ్దం నుండే క్షీణించడం ప్రారంభమైనట్లు కనిపిస్తుంది. ఆది శంకరాచార్యుల అద్వైతమే కారణమని చాలామంది అంటుంటారు. ఆయన ప్రభోధించిన మతం అద్వైతం, దక్షిణ భారతదేశంలో ని జైనమతాన్ని నామరూపాలు చేసిన మతం వీరశైవం అనే చెప్పాల్సివుంటుంది. దాన్ని ప్రభోధించిన బసవేశ్వరుడు ఆదిశంకరుల తరువాతి వాడు. కనుక బౌద్ధ జైనాల పట్ల ప్రజల్లో నమ్మకాలు బలహీనపడినట్లుగా కనిపిస్తాయి. దానికి తోడు ముస్లిం దండయాత్రలు కూడా ఒక కారణమై వుండవచ్చు. సహేతుకమైన కారణాలు భవిష్యత్తులో బయటపడతాయని ఆశిద్దాం.

జైన మతం ప్రభావం వల్లనే ఎరియ, గుండయ, బేతయ వంటి పేర్లు రాజుల శాసనాలలో కనిపిస్తాయి. దీనిని ఆసరాగా చేసుకుని చాలామంది చరిత్ర కారులు వీరు గిరిజన జాతుల నుండి పాలకులుగా అభివృద్ధి చెందిన వారిగా అభిప్రాయపడుతుంటారు. ఇది పొరపాటుగానే కనిపిస్తుంది. రెడ్డి రాజుల

విషయం లోనూ ఈ పొరపాట్లు కనిపిస్తాయి. రెడ్డి రాజులు నేటి రెడ్లు ఒకటే అనే అభిప్రాయంలో చాలా మంది చరిత్రకారులు వున్నారు. అది వాస్తవం కాదు. రెడ్డి రాజులు పూర్వాచార కులం కాగా నేడు రెడ్లు గా చెబుతున్నవారు పూర్వాచార కులాలకు చెందిన వారు కాదు. దీని గురించి కర్నూలు మేన్యువల్ స్పష్టంగా చెబుతుంది. ఈ చరిత్ర గురించి ఇక్కడ అప్రస్తుతం కాబట్టి ఇక్కడ చర్చించలేకపోతున్నాను.

స్పష్టంగా గుర్తు పెట్టుకోవాల్సిన మరొక విషయం వుంది. నాటి సమాజాన్ని నేటి ఆధునిక సమాజ దృష్టితో చూస్తున్నాం అందు వల్ల మరికొన్ని పొరపాట్లు దొర్లుతున్నాయి. నాటి ప్రాచీన సమాజంలో కుల కట్టుబాట్లు చాలా కఠినంగా అమలు జరిగాయి. ఈ విషయాన్ని ప్రధానంగా పరిగణలోకి తీసుకోవాలి. కుల సంకరం కలిగిన వారిని ఆ నాటి సమాజం గౌరవించేది కాదు. అలాంటి కుటుంబాలను అన్ని రకాలుగా ప్రక్కకు పెట్టిన సందర్భాలు అనేకం కనిపిస్తాయి. రాజులు ఇతరులతో వివాహాలు చాలా సాధారణంగా చేసుకునే వారు అని చరిత్రకారులు అభిప్రాయపడుతుంటారు. కానీ ఆ అభిప్రాయాలు తప్పు.

రాజుల రాణి వాసాలలో ఇతర కులాలకు చెందిన స్త్రీలు అనేకమంది వుండి వుండవచ్చేమో కానీ వారికి రాణి హోదా వుండదన్న విషయాన్ని తెలుసుకోవాలి. ఇక వివాహాల విషయంలో కూడా రాజులు మరణించనైనా మరణించేవారు తప్ప ఇతర కులస్తులకు పిల్లనిచ్చేవారు కాదు. తమ కంటే కొద్దిగా తక్కువ వంశాలకు చెందిన వారు అనే విషయాన్ని కూడా నాటి రాజులు భూతద్దంలో చూసినట్లు అనేక ఆధారాలు కనిపిస్తాయి. మన హీరో శ్రీకృష్ణదేవరాయలకు కూడా గజపతులు పిల్లనిచ్చే సమయంలో తక్కువ వంశానికి చెందిన వాడుగా భావించినట్లు అనేక కథలు ప్రచారం లో వున్నాయి. అదే విధంగా ఒకే కులస్తులైన మధుర, తంజావూరు రాజుల మధ్య పాత బంధుత్వం వున్నప్పటికీ ఇలాంటి భావనలే యుద్ధాలకు దారితీశాయి.

ఇలాంటి సామాజిక పరిస్థితుల నేపథ్యంలో అనులోమ, విలోమ వివాహాల ప్రస్తావనలు చరిత్రకారుల భ్రమలుగానే పరిగణించాల్సి వుంటుంది. ఈ వివాహాలు సామాన్య ప్రజానీకం అనుసరించి వుండవచ్చునను కానీ

రాజకుటుంబాలు మాత్రం కాదని తెలుసుకోవాల్సి వుంటుంది. ఇలా కులసంకరం జరిగిన కుటుంబాలను ప్రజలు రాజులుగానే కాదు కనీసం గ్రామ పాలకులుగా సైతం అంగీకరించేవారు కాదన్న విషయం సుస్పష్టం.

ఇలా కులసంకరాలను తీవ్రంగా ప్రతిఘటించే వారు కనుకనే బలిజ కులం నుండి నేటి వెలమ, కమ్మ కులాలు విడిపోవాల్సి వచ్చింది. పలనాటి యుద్ధ కాలంలో రేచెర్ల గోత్రీకుడైన శీలం బ్రహ్మనాయుడు చాపకూటి సిద్ధాంతం ప్రతిపాదించి పూర్వాచార కులాలను ధిక్కరించడం, కట్టుబాట్లను పక్కకు పెట్టడం వల్లనే పల్నాటియుద్ధం సంభవించింది. (ఇది వైష్ణవ, శైవ మతాల మధ్య జరిగిన యుద్ధంగా చాలామంది పరిగణించారు. అది వాస్తవం కాదు. మలిదేవరాజు, బ్రహ్మనాయుడుల బృందం నుండి రాయబారిగా వెళ్లిన అలరాజు నలగామరాజుకు స్వయానా అల్లుడు, శైవమతానికి చెందిన వాడు. మరి వైష్ణవులైన బ్రహ్మనాయుడు గుంపులో ఎలా వుండగలుగుతాడు?).

అప్పుడే బ్రహ్మనాయుడిని కులం నుండి వెలివేసినట్లు తెలుస్తోంది. అలా వెలి వేయబడిన ఆయన అనుచరులే వెలుగోటి రాజులని తెలుస్తోంది. కర్నూలు జిల్లాలోని వెలుగోడు అలా వెలివాడ, వెలుగువాడ, వెలుగోడుగా రూపాంతరం చెందింది. ఈ వెలుగోటి రాజులే వెంకటగిరిని పరిపాలించిన వెలుగోటి వంశం. వీరి గోత్రం రేచెర్ల , వీరు వెలమలు.

అదేవిధంగా కమ్మకులస్తులు కూడా కాకతీయుల కాలంలో కాపులనుండి విడిపోయినట్లు తెలుస్తోంది. థర్స్టన్ కేస్ట్స్ అండ్ ట్రైబ్స్ ప్రకారం ఒక వ్యక్తి ప్రతాపరుద్రుడిని తండ్రి లేని వాడు అని తిట్టడం వల్ల తమను వెలి వేశారని తెలిపినట్లు రచయిత పేర్కొన్నారు. ఇది నిజమై వుండదు. ఎందుకంటే ఒక వ్యక్తి చక్రవర్తిని ధూషిస్తే కేవలం అతడి కి మాత్రమే శిక్ష పడుతుంది తప్ప అతడి బంధువులందరికీ పడదు. విడిపోయిన కొన్ని కుటుంబాలు కట్టుబాట్లను అతిక్రమించడమో లేదా ధిక్కరించడమో జరిగినందువల్లనే వారు ప్రధాన కులం నుండి విడిపోవాల్సి వచ్చి వుంటుంది.

గౌరవనీయులు ఆచార్య యార్లగడ్డ బాలగంగాధర రావు గారు తన పలనాటి వీరచరిత్రలో కమ్మవారికీ, యాదవులకూ (ఈయన ఉద్దేశ్యంలో యాదవులంటే తెలుగునాట వున్న గొల్ల కులస్తులు) అనాదిగా కంచం పొత్తూ

మంచం పొత్తూ వున్నాయి. ఈ మాట పై ఎవరూ ఆవేశాలకూ అపోహలకూ లోను కావలదని మనవి చేశారు. అది కాదన వీలులేని సత్యమని కూడా స్పష్టం చేశారు. తెలుసుకోవాలనుకునేవారు వయో వృద్ధులను అడిగి చూడాలని కూడా ఆయన సూచించారు.

ఇలాంటి కులసంకరాలు బలిజ, కాపు కులంలో నిషేధించబడ్డాయి. ఇలా కులసంకరం వల్లనే కమ్మ కులస్తులు విడిపోయి వుండవచ్చు. గత 20 సంవత్సరాలు క్రితం వరకూ కూడా వీరిని కమ్మకాపులు గానే వ్యవహరించేవారు. ప్రతాపరుద్రుని కాలంలో కులసంకరాల వల్ల కమ్మకులస్తులు కాపు కులం నుండి విడిపోయినట్లు స్పష్టమౌతోంది.

ఆ. ఊరి వరదనీరు నురికి సరస్సుజేరి
తీర్థయోగ్యమైన తెరగుగాదె
కాలచోదితమున గాకతీశ్వరుల గొల్చి
కాపులెల్ల వెలమ కమ్మలైరి

కం. తొలికాలవముర్వి గొడవల
వెలియై యాలయములందు విహరించుటచే
నిలకాపు జనులు కొందరు
వెలమలనన్ జగతిలోన - విశ్రుతులగుటన్

పద్మనాయక చరిత్ర ద్వారా పై రెండు కులాలు కాపు కులం నుండి విడిపోయినట్లు తెలుస్తోంది.

ప్రతి కులం ఏర్పాటు వెనుక వారికి అనుకూలమైన ఆధ్యాత్మిక కథలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కథలన్నీ వాస్తవదూరంగా కనిపిస్తుండడం వల్ల నేను వాటిని వీలైనంతవరకు పరిగణలోకి తీసుకోలేదని మనవి చేసుకుంటున్నాను.

పుస్తక నేపథ్యం

నేను 1980-83 మధ్య కాలంలో ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో చదువుకున్నాను. అప్పుడు మా అమ్మా, నాన్న యర్రగొండపాలెం తాలూకాలోని అటవీ ప్రాంతం మధ్యలో వున్న పాలుట్ల అనే చిన్న గిరిజన గూడెంలో నివశించేవారు. మా తండ్రి రామసుబ్బయ్య గారు వడ్రంగి, అక్కడ వ్యవసాయం చేసే గిరిజనులకు వ్యవసాయ పనిముట్లు చేసి ఇచ్చేవారు. నేను శెలవుల్లో ఇంటికి వెళ్లేవాడిని మా ఇంటి ముందు చిన్న పందిరి తడికల్తో వేసి వుండేది. దాని క్రింద మా నాన్న గారు వ్యవసాయపనిముట్లు చేసేవారు. ఆ సమయంలో గ్రామంలోని చాలామంది అక్కడే కూర్చుని కాలక్షేపం కబుర్లు చెప్పుకుంటుండేవారు. వాటిల్లో గుండు సూది నుండి ఆటంబాంబువరకు, కాటమరాజు కథ నుండి ప్రపంచ యుద్ధం వరకు చర్చా వస్తువుల్లై వుండేవి. ఆ ఊర్లో అందరికీ మా ఇల్లే కాలక్షేప స్థలం గా వుండేది. ఊర్లోకి కొత్తవారెవరైనా వస్తే ఇక్కడ జరిగే చర్చల్లో తప్పకుండా పాల్గొనాల్సిందే.

యర్రగొండపాలెం మండలం గంజివారి పల్లె నుండి "మాల చెన్నయ్య" అనే వ్యక్తి తరచుగా మా ఇంటికి వచ్చేవాడు. ఈయన చిన్న బట్టల మూట మోసుకుంటూ వచ్చేవాడు. అందులో చీరలు, పంచెలు, తువాళ్లు వుండేవి. అతను సరాసరి నేరుగా మా ఇంటికే వచ్చేవాడు. మా అమ్మ నారాయణమ్మ గారు అతడికి భోజనం పెట్టేది. ఒక చాప ఇస్తే అక్కడే రాత్రి పడుకుని మళ్లీ తెల్లవారి చుట్టుప్రక్కల గూడేలలో బట్టలు అమ్ముకోవడానికి వెళ్లేవాడు. అప్పట్లో నాకు పెద్దగా తెలిసేది కాదు. చెన్నయ్యనే అడిగే వాడిని ఎందుకు తాతా ఎప్పుడూ మా ఇంటికే వస్తావు నీకు తెలిసిన వాళ్లు ఇక్కడ ఎవరూ లేరా అని. దానికి ఆయన లేదు బాబూ మేము మీ ఇండ్లకే వస్తాము మాకు తెలిసిన వారు ఎవరున్నా మీ ఇళ్ల వద్దనే వుంటాము అది మా ఆచారం అనేవాడు నాకేమీ అర్థం అయ్యేది కాదు. రెండు మూడు రోజులు వుండి బట్టలన్నీ అమ్ముకున్న తరువాత ఆ బట్టలకు గాను ఒకటో రెండో మేక పిల్లలను ఇక్కడ నుండి తీసుకు వెళ్లేవాడు. మా నాన్నను అడిగాను ఎందుకూ అతను ఎప్పుడూ మన ఇంటికే వస్తాడు అని ఆయన చెప్పాడు శెట్టి ఆచారం వుంది మనకు అందువల్ల

వారు మన ఇంటికే వస్తారు అనేవాడు. నాకప్పుడు సరిగా అర్థం అయ్యేది కాదు. వారి మాటల్లో పద్దెనిమిదిన్నర కులాలు వున్నాయని అనుకుంటుంటే విన్నాను. వారే అనేవారు ఈ పద్దెనిమిది కులాలు ఏవి? అని వాటి గురించి వారికి కూడా పెద్దగా అవగాహన వుండేది కాదు. అర కులం ఎవరు అనే చర్చ జరిగేది ఒకరొకరు ఒకోరకంగా మాట్లాడే వారు నాకు పెద్దగా అర్థం అయ్యేది కాదు.

ఆ తరువాత ఆ అడవి ప్రాంతంలో నాకు తరచుగా మలేరియా వచ్చేది దాన్ని చెంచులు వరుసజ్వరం అనేవారు. రోజు విడిచి రోజు జ్వరం చలితో వచ్చేది. మనిషిని పీల్చి పిప్పి చేసేది. అక్కడి చెంచు వైద్యులు చేసే వైద్యంతో తగ్గిపోయేది కానీ అప్పటికే నేను బాగా చిక్కి శల్యమై పోయేవాడిని రెండు మూడు సార్లు జ్వరం వచ్చే సరికి ఇక అక్కడ వుండకూడదని మా అమ్మా నాన్నలు నిర్ణయించారు. అక్కడి నుండి యర్రగొండపాలెం వచ్చి చేరాం.

మా అమ్మమ్మ స్వంత గ్రామం "పెద్ద కొలుకుల" కావడం తో చుట్టు ప్రక్కల వున్న ప్రతి గ్రామంలో మాకు బంధువులు వుండేవారు. గంజివారిపల్లె, ఎగువపాలెం (వెంకటాద్రిపాలెం), గుర్రపుసాల తదితర గ్రామాల నుండి మండల కేంద్రమైన యర్రగొండపాలెంకు మా బంధువులు తరచుగా వచ్చేవారు. సరుకుల కొనుగోలుకు, ఆసుపత్రులకు వచ్చేవారి సంఖ్య చాలా ఎక్కువగా వుండేది. ఎవరు వచ్చినా సరే వారికి బస మా ఇంట్లోనే. ఎగువపాలెం (వెంకటాద్రిపాలెం) నుండి లక్ష్మిశెట్టి పాలంకయ్య అని 60 సంవత్సరాల వృద్ధుడు తరచుగా వచ్చేవాడు.

మా అమ్మ ఆయన నీకు తాత అవుతాడు అని చెప్పడంతో నేను తాతా అని పిలిచేవాడిని. ఆయన గురించి మాట్లాడుకునే టప్పుడు ఆయన ఎగువ పాలెం చుట్టుప్రక్కల వున్న 16 గ్రామాలకు శెట్టి అని చెప్పే వారు నాకు పూర్తిగా అర్థం కాక పోయినా 16 గ్రామాలకు పెద్ద అనే విషయం మాత్రం అర్థం అయ్యేది. ఇప్పుడు ఎందుకు ఆ పెద్దరికం లేదు? అని అడిగితే అది ఇప్పుడు లేదు ఒకప్పుడు వుండేది ఆయన అన్ని గ్రామాలలో పంచాయితీలు చేసేవాడు. అని మాత్రం చెప్పేవారు. అప్పట్లో దాని గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి లేక పోవడంతో అంతటితోనే సంతృప్తి చెందేవాడిని.

నేను యర్రగొండపాలెంలో చదువుతున్న సమయంలోనే శెలవులకు

మా జేజి, జేజినాయన వద్దకు వచ్చేవాడిని వారు కర్నూలు జిల్లా వెలుగోడులోనే వుండేవారు. మా రాయలసీమ ప్రాంతంలో నానమ్మను జేజి అని, నాన్న తండ్రిని జేజినాయన అని పిలుస్తావు. చాలామంది అబ్బ అని కూడా అంటుంటారు నాకు మాత్రం జేజినాయన అనే పిలవడమే అలవాటు.

అలా శెలవులకు వచ్చిన సమయంలో ఒక సంఘటన జరిగింది. మాకు బట్టలు ఉతికే చాకలి లక్ష్మమ్మ బట్టల మూట తెచ్చి క్రింద వేసింది చాలా కోపంగా... అప్పుడు మా జేజినాయన నులక మంచంపై కూర్చుని వున్నాడు. ''పెదనాయనా నాకు కమ్మలు కొనిస్తానన్నావ్ ఇంతవరకు కొనియ్యలా.. ఎప్పుడు కొనిస్తవు?'' అంటూ నిలదీసింది. దానికి సమాధానంగా మా జేజినాయన ''వడ్లు రానియ్యవమ్మా కొనిస్తా'' అంటున్నాడు తాపీగా. ''ఎన్నిరోజులాయ అప్పడు కొనిస్తా ఇప్పుడు కొనిస్తా అంటాండవ్ కొనియ్యనే కొనియ్యకుండవ్'' అంది చాలా సీరియస్ గా లేదమ్మా ఈ సారి ఖచ్చితంగా కొనిస్తాలేమ్మా అంటూ ప్రశాంతంగా సమాధానం చెబుతున్నాడు మా జేజినాయన. ''నీ ఇట్టం నీ బుద్ధిపుట్టినపుడు కొనియ్యి'' అని కోపంగా విసావిసా వెళ్లిపోయింది.

ఎందుకో నాకు ఆమె మాట్లాడుతున్న తీరు నచ్చలేదు కోపం వచ్చింది. వెంటనే మాజేజినాయనతో అన్నా ''ఏంది జైనాయినా ఆమె అట్టమాట్లాడుతోంటే నువ్వు బాకిన్నోనిలెక్క మెత్తగ మాట్లాడుతొండవ్ ఆమెకేమన్నా బాకిండమా ఏంది'' అన్నా కోపంగా నేను అప్పుడు మా జేజినాయన ప్రశాంతంగా ''అట్లా అనగూడదమ్మా చాకలోళ్లు అంటే మన ఇంటి ఆడపిల్ల లెక్క పండగ ఇనాంగా కమ్మలడిగింది కొనిస్తలే అని మాటిచ్చినా కొనియ్యాలగదా'' అన్నాడు. మా నాన్నను కూడా ఆమె అన్నా అని మా అమ్మను వదినా అని పిలిచేది. మా అమ్మానాన్న కూడా అమెను అత్తా అని నన్ను పిలవమనే వారు. ఆమె పిల్లలు కూడా నన్ను బావ అని పిలిచేవారు. అంత సన్నిహితంగా వున్నా ఎప్పుడూ హద్దులు దాటే వారు కాదు.

ఈ పిలుపుల మధ్య ఒక చిన్న సంఘటన జరిగింది. వెలుగోడులో రిజర్వాయరు కడుతున్న కాలంలో తెలుగుగంగ కార్యాలయంలో డేనియల్ నోబుల్‌పాల్ అనే జూనియర్ అసిస్టెంట్ నా మిత్రుడు. మేము తరచూ కలుసు కుంటుండేవాళ్లం. ఒక రోజు టీ స్టాల్ వద్ద ఇద్దరం టీ త్రాగుతుండగా అదే తెలుగు గంగ కార్యాలయంలో అటెండర్ గా పనిచేస్తున్న లక్ష్మమ్మ చిన్న కొడుకు

వెంకటేశ్వర్లు "ఏం బావా బాగుండవా అత్తా,మావు బాగుండారా" అని పలుకరిం చాడు. "బాగున్నారు పై టీ త్రాగు" అన్నాను.అప్పటికే వెంకటేశ్వర్లు కులం తెలిసిన పాల్ నా వైపు అనుమానంగా చూస్తూ నీకు బంధువా వీడు అన్నాడు. నేను కాదు అన్నాను. మరి బావ, మామ అంటున్నాడు అన్నాడు. అవును అలాగే పిలుస్తాడు నేను కూడా వాళ్లమ్మను అత్తా అనే పిలుస్తా అన్నాను.

అదేంటి అన్నాడు అర్థం కానట్లు మొహం పెట్టి. ఎందుకో నాకు తెలియదు మేము అలాగే పిలుచుకుంటాము అన్నా... వీళ్లే కాదు చాలా మంది ఇతర కులాల వారు సైతం మమ్మల్ని ఇలాగే పిలుస్తారు బంధువులలాగే వరుసలతో మాట్లాడుతాము అన్నాను ఎందుకు అన్నాడు పాల్ నిజానికి నాకు కూడా అలా ఎందుకు పిలుచుకుంటారో అప్పటికి తెలియదు.

ఆ తరువాత శ్రీకృష్ణదేవరాయులు మా కులస్తుడు అని 2010 లో గొల్ల కులస్తులు పత్రికల్లో ఒక ప్రకటన ఇచ్చారు. అది చూసిన కొంతమంది మిత్రులు ఇది నిజమా ఇప్పటి వరకు రాయలపేరు సత్రాలకు,ట్రస్టులకు మనవారు పెడుతున్నారే ఇదేమిటి? అని అడిగారు. నిజానికి నాకు కూడా రాయలు బలిజకులస్తుడు అని అనడం మాత్రమే తెలుసు అంతకంటే ఎక్కువ తెలియదు. గొల్ల కులస్తులకు చెందిన కులపత్రికలు సైతం రాయలు గొల్ల అనే విషయాన్ని విపరీతంగా ప్రచారం చేశాయి. నాకు అవి చదివినప్పుడు నిజమే అనిపించింది. ఇతరుల చరిత్రను కబ్జాచేయడం తప్పుకదా ఎందుకిలా జరిగింది.

ఇందులో నిజానిజాలను తెలుసుకోవాలి అని రాయలకులం గురించిన ఆధారాల కొరకు అన్వేషణ ప్రారంభించాను. అలా ప్రారంభమైన నా అన్వేషణలో నా చిన్నతనం నుండి అర్థం కాకుండా మిగిలిపోయిన అనేక అంశాలు తారసపడ్డాయి. చాలా మంది పరిశోధకులు పరిచయమయ్యారు. నాకు చిన్నప్పటి నుండి ఒక అలవాటు వుంది. ఏదైనా ఒక కథ విన్నప్పుడు దాన్ని యదార్థంగా జరిగితే ఎలావుంటుందో అన్న ఇమేజినేషన్‌లోకి వెళ్లిపోవడం. నాకు రామాయణ మహాభారత కథల్లో యుద్ధాలు అంటే చాలా ఇష్టం. ఆ సినిమాలు అంటే చాలా ఇష్టంగా చూస్తాను. పాత సినిమాలు చూస్తున్నప్పుడు పాత్రలు పోటాపోటీగా పద్యాలు పాడుతుంటే ఎందుకో నాకు చాలా అసహజంగా

వున్నాయనిపించేది.

పెద్ద పెద్దవిల్లులు చేత ధరించి వున్న వారిని చూస్తే ఇలాంటి విల్లుల ద్వారా బాణాలు సంధించడం ఎలా సాధ్యం అన్న అనుమానాలు. అప్పుడే ప్రజెంటేషన్ సరిగా లేదని భావించేవాడిని. మహాభారతయుద్ధాన్ని అత్యంత సహజసిద్ధంగా చూడాలనే కోరిక వుండేది. కత్తుల తో యుద్ధం చేసేటప్పుడు ఒక కత్తికి మరో కత్తి తగిలి కత్తులు మొద్దుగా అవుతాయి కదా వాటితో ఎలా నరకగలుగుతారు ఇలా వుండేవి నా అనుమానాలు. ఎంతటి విలుకాడైనా బాణాన్ని వంద గజాల దూరం వరకు వదలలేడు. ఒక వేళ వదిలినా లక్ష్యాన్ని ఛేదించలేడు. సినిమాలలో చూపించేవి కథల పుస్తకాలలో కనిపించేవి చాలా అసహజంగా అనిపించేవి. ఇలా వుండే నా ఆలోచనలు నాతో పాటు పెరిగి పెద్దగా అయ్యాయి తప్ప చిన్నతనంలోనే ఆగిపోలేదు.

రాయుల కులం గురించి నేను చేస్తున్న అన్వేషణలో అనేక సార్లు కుడి,ఎడమ కులాల ప్రస్తావనలు, శెట్టిసమయాల ప్రస్తావనలు, అనేక వీరబలింజ శాసనాలు తారసపడ్డాయి. ఇలియట్‌దొర శాసన సంపుటాలలో ఒక ముస్లిం చక్రవర్తి చేత పన్నులు రద్దు చేయించిన శాసనం కనిపించింది. అలంగీర్ పాదుషా (ఔరంగాజేబు) హిందువులపై వేసిన అసంబద్ధమైన పన్నులు రద్దు చేయించిన కొందరు వ్యక్తులు కనబడ్డారు.

ఒక చక్రవర్తిని ఎదిరించి పన్నులు రద్దు చేయించగలిగిన వారు ఎంతటి బలవంతులైవుంటారు. ఏమిటి వారి బలం, అసలు అలా ఎలా పన్నులు రద్దు చేయించగలిగారు, అన్న సందేహాల నడుమ ఆ శాసనానికి సంబంధించిన పలు కథలను మౌఖికంగా విన్నాను, పుస్తకాలలో చదివాను అవి వాస్తవాల లాగా నాకు కనిపించలేదు. కానీ శాసనాలు మాత్రం వాస్తవం నా ఈ పరిశోధనా ప్రయాణం లో వీలైనంత సమాచారం సేకరించాలన్న తపనతో అవసరం వున్నా లేకపోయినా అనేక గ్రంథాలను చదవాల్సి వచ్చింది. ఎందరో పాశ్చాత్యుల రచనలను పరిశీలించాల్సి వచ్చింది. ఎందరో చరిత్రకారులకు అర్థం కాకుండా నిలిచిపోయిన పలు చారిత్రక సందేహాలు, శూన్యాన్ని పూరించగల సంఘటనలు అనేకం తారసపడ్డాయి.

వీటన్నింటినీ గ్రంథస్థం చేయాలన్న కోరిక కూడా అప్పుడే కలిగింది.

వాస్తవానికి నేను పెద్ద రచయితను కాను కానీ కొంత రాయగలను అది నా పెంపుడు తల్లి ''ఆంధ్రభూమి'' దినపత్రిక చలువ. మా అమ్మ నాకు జన్మను ఇస్తే ఆంధ్రభూమి నాకు సమాజాన్ని చూపించింది. మనుషుల మనస్థత్వాలను చదవడం నేర్పించింది, సమాజంలో గుర్తింపునిచ్చింది. పాత్రికేయుడిగా 19 సంవత్సరాల నా సుదీర్ఘ ప్రయాణంలో నేను చాలా నేర్చుకున్నాను. అందుకే నేను మా అమ్మ తరువాత అమ్మ ఆంధ్రభూమి అని సవినయంగా చెప్పుకుంటాను.

అలా నా ఈ పుస్తకం ''మనం మరచిన మహా వ్యవస్థలు శెట్టి సమయాలు'' రాయడం మొదలు పెట్టాను అలా కొద్ది రోజులు ఆగకుండా సాగిన నా రచనా ప్రయాణం సగం లో ఆగిపోయింది. కీబోర్డుపై వేళ్లు కదలడం లేదు. అప్పటి నుండి ప్రారంభమయ్యాయి నా కష్టాలు పుస్తకాలు రాయడమంటే ఎంత కష్టమో అప్పుడు అర్థమైంది. రాసినంతలో నా వద్ద వున్న సమాచారం మొత్తం అయిపోయింది. మిగిలిన సమాచారం కొరకు కనిపించిన ప్రతి పుస్తకాన్ని త్రిప్పడం మొదలు పెట్టాను పనికి వచ్చే ప్రతి విషయాన్ని నోట్ చేసుకునే వాడిని దాని లోతు పాతులు తెలుసుకోవడానికి అర్థం చేసుకోవడానికి పలువురితో చర్చలు చేసేవాడిని ఈ క్రమంలో నే నాకు భట్టరుశెట్టి పద్మారావు రాయలు గారు, పోలిశెట్టి సత్తిరాయుడు గారు ఎంతో సహకరించారు. చాలా సమాచారాన్ని నాకు అందజేశారు. పోలిశెట్టి సత్తిరాయుడు గారు శెట్టి సమయాలకు సంబంధించి అనేక పత్రాలను నాకు పంపించారు.

ఈ పుస్తకం భవిష్యత్ తరాలకు ఉపయోగపడాలంటే సమాచారం లో తప్పులు వుండకూడదని చాలా జాగ్రత్తలు తీసుకున్నాను. కానీ నేనూ మనిషినేగా నాకు తెలియకుండా పొరపాట్లు జరిగి వుండవచ్చు కదా అలా తప్పులు సరిదిద్దు కోవాలన్న ఉద్దేశ్యంతో పలువురు మేధావులను అభిప్రాయాలు తెలుపవలసిందిగా అభ్యర్థించాను. అడగగానే నా పుస్తకాన్ని ఆసాంతం చదివి, తప్పులను సరిదిద్ది, ముఖచిత్రం రూపుదిద్దడానికి అమూల్యమైన సలహాలు ఇచ్చిన పెద్దలు తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ సామల రమేష్ బాబు గారికి, చరిత్ర పరిశోధకులు శ్రీ భట్టరుశెట్టి పద్మారావురాయలు, శ్రీ చొక్కపు నారాయణస్వామి గారలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను

అనుబంధం

శెట్టి సమయాలు ప్రారంభమయ్యే నాటికి కుడి చేతి వైపు 18 కులాలు, ఎడమచేతి వైపు 9 కులాలు వున్నట్లు తెలుస్తోంది. ఈ కులాలు 19 వ శతాబ్దం చివరి నాటికి బ్రిటీషు వారి సర్వే ప్రకారం కుడిచేతి వైపు 60 కులాలు, ఎడమచేతి వైపు కేవలం ఆరు కులాలు మాత్రమే వున్నట్లు గా రాశారు. కాలక్రమేణా పూర్వాచారుల ప్రాబల్యం పెరగడం వల్ల వామాచారులు బలహీనపడ్డారు. ప్రధాన కులాల వృత్తులకు అనేక విధాలుగా సహకారం అందించే బాధ్యతలు చేపట్టిన అనేక ఉప కులాలు ప్రత్యేక కులాలుగా స్థిరపడినట్లు కనిపిస్తోంది. ఆ క్రమంలో లోనే ప్రధాన కులాలకు ఉపకులాలు ఏర్పడి వుండవచ్చు.

ఇలా 27 కులాలు 66 అంతకంటే ఎక్కువ కులాలుగా వృద్ధి చెందాయి. వామాచార కులాల గుంపు నుండి బయటకు వచ్చిన బ్రాహ్మణులు ఎటూ వెళ్ళకుండా తటస్థంగా వుండి పోవడం, పూర్వాచార కులాల నుండి వెలివేయబడిన కొన్ని గుంపులు ప్రత్యేక కులాలు గా ఏర్పడి తటస్థంగా వుండి పోవడం, బయటి ప్రాంతాల నుండి వచ్చిన జాతులు సైతం ప్రత్యేక కులాలుగా ఏర్పడి తటస్థంగానే వుండడం వంటి కారణాల రీత్యా కొన్ని తటస్థ కులాలు కూడా వున్నాయని మనం భావించవచ్చు. వీరి ఆచారాలు పూర్వాచారులకు వ్యతిరేకంగా వుండడం తో తటస్తులను సైతం వామాచార కులాలుగానే పూర్వాచారులు పరిగణించారు. మతపరమైన, వ్యవస్థ పరమైన విషయాలలో బ్రాహ్మణులు తటస్తులుగా వున్నప్పటికీ పూర్వాచార కులాలకు తమ సంపూర్ణ మద్దతు నిచ్చారు. బహుశా వీరు నమ్మదగిన వారు కావడంతో వారు అలా మద్దతునిచ్చి వుండవచ్చు.

నాకు అందుబాటులో వున్న సమాచారం మేరకు కొన్ని పూర్వాచార కులాలను ప్రధాన కులాలుగా పరిగణించి వర్గీకరించాను. (ఖచ్చితమైన సమాచారం లేక పోవడం వల్ల కొన్నికులాలను మాత్రమే ఇక్కడ పేర్కొనడం జరిగింది. ఈ జాబితా మొత్తం 60 కులాల వరకు వున్నట్లు బ్రిటీషు రాతల వల్ల తెలుస్తోంది. కానీ వాటి గురించి స్పష్టమైన సమాచారం లభించలేదు. అందు వల్ల ఖచ్చితమైన పూర్వాచార కులాలు అని తెలిసిన వాటినే ఇక్కడ ప్రస్తావించడం జరిగింది.)

పూర్వాచార, కుడిచేతి కులాలు

1.బలిజ (శెట్టిబలిజ, తోటబలిజ, పెరికబలిజ లేదా ఉప్పుబలిజ, కాపు, తెలగ, ఒంటరి, తూర్పుకాపు, మున్నూరు కాపు) వృత్తి సైనికులు, పాలకులు, వ్యవసాయం, వ్యాపారం, పాంచాణనం వారి నుండి తీసుకున్న పంచవృత్తులు.

2. ఈడిగ వృత్తి : కల్లు, కల్లు గీత, మద్యం వ్యాపారం,

3. గంగపుత్ర, తెనుగు, వాడబలిజ, వృత్తి చేపలు పట్టడం ప్రాచీన ఓడల కళాసీలు

4. కోమటిశెట్లు (ఆర్యవైశ్యులు), వృత్తి వ్యాపారం

5. తొగట వీర క్షత్రియ, వృత్తి చేనేత

6. పద్మశాలి, వృత్తి అతి నాజూకు వస్త్రాల చేనేత

7. కురువ, వృత్తి కంబళ్ల నేత

8. గాండ్ల, వృత్తి ఒక ఎద్దు గానుగతో నూనె తీసేవారు

9. రజకులు (చాకళ్లు), వృత్తి బట్టలు ఉతకడం

10. నాయీబ్రాహ్మణ (మంగలి), వృత్తి మంగళవాయిద్యాలు, క్షవరం

11. కుమ్మరి , వృత్తి కుండలు చేయడం.

12. మేదర, వృత్తి వెదురు కార్మికులు

13. ఉప్పర, వృత్తి భూమి అభివృద్ధి.

14. వడ్డెర, వృత్తి గనులు, భవన నిర్మాణం

15. కళావంతులు, సూర్యబలిజ

16. మాల, వృత్తి చేనేత, వ్యవసాయ కార్మికులు

17. కృష్ణబలిజ లేక పూసల, వృత్తి చిరువ్యాపారులు.

18. సుగాలి, వృత్తి గోరక్షకులు, సరకుల రవాణా

19.. లింగ బలిజ, వృత్తి గ్రామాధికారులు, సైనికులు , వ్యాపా రు లు

20. పెరిక, వృత్తి గోనెసంచుల నేత, తాళ్లు తయారు చేయడం.

21. రంగరాజు, వృత్తి అద్దకం పనివారు
22. కుర్ని , వృత్తి చేనేత
23. కత్రి
24. పట్టకార్
25. జంగం, వృత్తి వీరశైవుల గురువులు, పశుపోషణ, బిక్షాటన
26. ఎరుకల, వృత్తి వెదురు కార్మికులు
27. గుజరాత్, మరాఠా వ్యాపారులు

వామాచార, ఎడమచేతి కులాల వారు

1. పాంచానన౦ వారు
2. బేరి కోమట్లు
3. దేవాంగులు,జంద్ర,అటకారు
4. బోయ
5. గొల్ల
6. మాదిగ

తటస్థ కులాలు


1. బ్రాహ్మణ
2. వెలమ
3. కమ్మ
4. రెడ్డి

పరిశీలించిన గ్రంథాలు

1. Casts and Tribes of Southern India -by Edgar Thurston
2. ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర – సంస్కృతి -IV మధ్యయుగ ఆంధ్రదేశం –పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్
3. Right and Left Hand Castes in South India – Arjun Appadurai
4. The commerce and navigation of the anciants in the Indian ocean - William Vincent .
5. Early History of India - By Vincent Smith.
6. Costel trade Flourished with Europeans - By Pramod Sangar.
7. A Brief History of India - By Alain Danielou
8. ఆంధ్రప్రదేశ్ సమగ్ర చరిత్ర –పి.వి.కె.ప్రసాదరావు
9. CORPORATE LIFE IN ANCIENT INDIA - by R.C.Manjudar
10. రెడ్డి రాజ్యాల చరిత్ర – మల్లంపల్లి సోమశేఖరశర్మ
11. హరవిలాసం – శ్రీనాథుడు
12. సిద్దేశ్వర చరిత్ర – కాసె సర్వప్ప
13. portgees diries - Edgar prestaze
14. Inscriptions of Andhra Pradesh -Published by Government of Andhra Pradesh
15. గౌరీపుత్ర చరిత్రము – నిశ్చింత ఎంబారయ్య, 1898
16. బలిజవారు పురాణం – సేలం పగడాల నరసింహులు నాయుడు
17. ప్రతాపరుద్ర చరిత్రము – ఏకామ్రనాథుడు
18. కాశీయాత్ర చరిత్ర – యేనుగుల వీరాస్వామి

ఇంకా అనేక శెట్టి ఆచార కులాల పెద్దలను సంప్రదించడం జరిగింది. శెట్లుగా పని చేసిన వారి వారసులను కూడా కలసి సమాచారం సేకరించడం జరిగింది.


దేశాయి శెట్ల వారసులు చెప్పిన కథలలో నమ్మశక్యమైన వాటిని మాత్రమే ఆధారాలుగా తీసుకోవడం జరిగింది.



దేశాయి శెట్టి వద్ద వుండే వజ్రబైసుగ (గరిట గాలం)



శెట్టి పత్తి కొండయ్య వారసుల వద్ద లభించిన కంచు బిళ్ల



ప్రాచీన ఓడ

రచయిత గురించి

పుట్టినది : ఫిబ్రవరి 16, 1968, వెలుగోడు, కర్నూలు జిల్లా

చదువు : న్యాయశాస్త్రం, ప్రసూనా న్యాయకళాశాల, కర్నూలు

కుటుంబ నేపథ్యం : వడ్రంగం, వ్యవసాయం, మధ్యతరగతి

రచనా నేపథ్యం : 1997 నుండి ఆంధ్రభూమి దినపత్రికలో గ్రామీణ విలేఖరి

ఇష్టాలు : క్రీడలు, పుస్తకపఠనం, లలిత సంగీతం



ధూపం అభిమన్యుడు

ముద్రిక, కర్నూలు - 94405 69106